గ్రంథాలయసర్వస్వము.

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘపక్షమున ప్రకటింపబడు

సచిత్ర మాసపత్రిక

సంపు. ౮ | బెజవాడ నవంబరు, 1934 | సంచిక ౧

అయ్యంకి వేంకటరమణయ్య

సంపాదకుడు

1 వాయువు ఎల్లవారికి ఎట్లు స్వాధీనమైయున్నదో
జ్ఞానముకూడ అట్లు స్వాధీనము కావలయును

2 ఉదకము ఎల్లవారికి ఎట్లు సేవ్యమైయున్నదో
జ్ఞానముకూడ అట్లు సేవ్యము కావలయును

3 సూర్యచంద్రమండలముల తేజస్సు ఎల్లవారికి
ఎట్లు సౌఖ్యప్రదముగానున్నదో అట్లే
జ్ఞానముకూడ సౌఖ్యప్రదము కావలయును

— చిలకమర్తి లక్ష్మీనరసింహము

వార్షికమూల్యము : సభ్యులకు రు 3-౦-౦

ఇతరులకు రు ౪-౦-౦

విడిసంచిక రు ౦-౪-౦

RSVM01 A146

విజ్ఞాన చంద్రికయందు ప్రకటింపబడిన

హిందూ మహాయుగము

కొమర్రాజు లక్ష్మణరావు ఎ.ఎం. గారిచే రచియింపబడినది. వెల రు 1—8—0.

బౌద్ధ మహాయుగము

వేలూరి సత్యనారాయణ ఎం. ఏ గారిచే రచియింపబడినది.

వెల క్యాలికోబైండు రు 2—0—0
రాపరుబైండు రు 1—8—0

జడకుచ్చులు

రాయప్రోలు సుబ్బారావుగారిచే రచియింపబడినది. వెల రు 1—0—0

మేనేజరు,
ఆంధ్ర గ్రంథాలయ ప్రెస్, బెజవాడ.

ప్రకృతి

స్వాభావిక ఆరోగ్య సచిత్ర మాసపత్రిక.

ఆరోగ్యనియమములను - మందు, శస్త్రములతో నిమిత్తములేని స్వాభావిక చికిత్సా విధానములను, స్వాభావిక జీవనమును బోధించును. సంవత్సరచందా రు 3-0-0

మేనేజరు,
ప్రకృతి కార్యాలయట్రస్టు, బెజవాడ,

జ్వాల మాసపత్రిక—బెజవాడ

విడిపత్రిక ఒక అణా - సం॥ చందా రూపాయి

శతాబ్దాల ఆచారం మానసిక బానిసత్వంగానూ, మతాభిమానం నల్లమందు మత్తుగానూ అయి నిస్తేజంగా, నీరసంగా స్వతంత్రత వివిధంగానూ లేని సంఘానికి అలవడి, తిరుగుబాటు సత్యాన్ని నిండుకన్నులతో చూడగలధైర్యం కావాలి. జ్వాల ఉద్దేశం ఇది.

CP

గ్రంథాలయ సర్వస్వము

చందా: ఆంధ్రదేశగ్రంథాలయసంఘ సభ్యులకు సభ్యత్వచందాతో రు 3 లు మాత్రమే.

ప్రతినెల 1 వ తేదీన వెలువడును

వ్యాసములు

గ్రంథాలయ శాస్త్రము-ఆంధ్రవాఙ్మయము-ఆంధ్రాభ్యుదయములను గూర్చిన అనుభవ పూర్వకములైన వ్యాసములు, గ్రంథాలయ సంఘములయొక్క నివేదికలు, వృత్తాంతములు, గ్రంథముల విమర్శనములు- ఇందు ప్రకటింపబడును.

పటములు

గ్రంథాలయ భవనములయొక్కయు, గ్రంథాలయ సభలయొక్కయు, గ్రంథాలయ సేవకులయొక్కయు, పటములును, ఆంధ్రాభ్యుదయ బోధకములగునట్టి పటములును ఇందు ముద్రింపబడును.

గమనింపుడు

ఈ పత్రిక ప్రతినెల 1 వ తేదీన వెలువడును. కావున వ్యాసములను పంపువారు ఏనెల పత్రికయందు ప్రకటింపవలెనో దానికి వెనుకటినెల 15 వ తేదీకి పూర్వమే పంపవలయును. పటములను వెనుకటినెల 1 వ తేదీకి పూర్వమే పంపవలయును.

ప్రకటన రేట్లు

ఒకసారి 1 పుటకు	రు 20-0-0
ఒకసారి ½ పుటకు	రు 12-0 0
ఒకసారి ¼ పుటకు	రు 6-0-0

రాజపోషకులు

శ్రీరాజా వేంకట కుమారమహీపతి సూర్యారావు బహద్దరుగారు
శ్రీరాజా నాయని వేంకట రంగారావు బహద్దరుగారు
బెల్లంకొండ రాఘవరావుగారు, అగ్రహారందారు
మసుల వేంకట చిన్నంరాజు శ్రేష్ఠిగారు
గోపు రామచంద్రరావుగారు

వివరములకు;—
గ్రంథాలయ సర్వస్వ కార్యస్థానము,
బెజవాడ.

శ్లో॥ సా౽౽శుప్రసాదినీ బ్రహ్మ। ౽స్త్రైశ్వరీ చిన్మయీ౽జయేత్
దృశ్యైజ్ఞేయే చసర్వస్మి। న్నక్షరా౽౽హ్వాయదా౽స్తి యా.

౯ - వ
సంపుటము.

గ్రంథాలయ సర్వస్వము.

౨ - వ
సంచిక.

మే, 1934.

సరస్వతీదేవి స్తుతి.

కం॥ గ్రంథమునాలయమను నీ, పన్థాలను దెలయునడకె మానుష్య మనన్.
కన్థకు గతిలేకుండిన గ్రన్థాలయమహిమ లెఱుగ ఘనుఁడై నెగడున్. శ్రీ. శా.

శా॥ మాతా కుప్యతు వా పితా త్యజతు వా ప్రీణాతు నో సోదరాః
తావ ద్బంధుగణా ద్విష స్త్వపి గురు శ్శప్త్వా న వా శామ్యతు
జాయా నో సహతాం క్రమేణ నృపతి శ్శా స్త్వన్యథా నామ సా
వాగ్దేవీ వదనాంబుజే వసతిచే త్కో౽ నామ దీనో జనః. శ్రీ. శా.

శా॥ లక్ష్మీశ్చే ద్గజపూర్వికా౽స్త్వయి ధనే మా మాశ్రయేర్న సమా
ఇత్యేవం తవ కల్పనేతి కలయే వేషే౽త్ర భాషే౽oబ! తే
తస్యా శ్చాపి హి నామదా౽౽క్షరరుచే! వేషః కుత స్తే క్షరో।
భ్రాన్తిః కస్య నహీంతి వక్తు ముచి తాహ౽oబా౽స్త్వహో శారదే. శ్రీ. శా.

16 వ ఆంధ్రదేశ గ్రంథాలయమహాసభ,

కాకినాడ.

జనవరి నెల 21, 22 తేదీలు, 1934 సం॥

ఆంధ్రదేశమందున్న వివిధమండలములనుండి పలువురు గ్రంథాలయముల ప్రతినిధులు 20 వ తేదీ సాయంకాలమే విచ్చేసిరి. ప్రతినిధులందరికిని అప్పనవారి సత్రమందు బసలు భోజనవసతులు ఏర్పాటు చేయబడెను. పలువురు స్త్రీలుగూడ ప్రతినిధులుగా వచ్చియుండుట గమనింపదగిన విషయము. ప్రతినిధుల సౌకర్యమునకై ఆహ్వానసంఘమువారు విశేషపరిశ్రమ జేసి చక్కని ఏర్పాటులను గావించిరి.

21 వ తేదీ ఉదయము 8-30 గంటలకు ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘముయొక్క వార్షిక సమావేశము జరిగెను.

మధ్యాహ్నము 2-30 గంటలకు అన్నదాన సమాజమువారి ఆవరణలో వేయబడిన విశాలమగు పందిరిలో 16 వ ఆంధ్రదేశగ్రంథాలయ ప్రతినిధుల మహాసభ ప్రారంభమయ్యెను.

ప్రథమమున కొందరు పండితులు వేదమంత్రములతో ప్రార్థనలను గావించిరి.

శ్రీదుగ్గిరాల వెంకటసూర్యప్రకాశరావుగారి
ఆహ్వాన సంఘాధ్యక్షోపన్యాసము.

పదునారవ ఆంధ్రదేశ గ్రంథాలయ మహాసభకు వ్యయప్రయాసల కోర్చి దూరప్రదేశములనుండికూడ విచ్చేసిన భాషాభిమానులరగు మీకు నీ సభాసన్మాన సంఘము వారిపక్షమున మనఃపూర్వక స్వాగత మొసంగుచున్నాను. వెనుకటి కోఆపరేటివురిజిస్ట్రార్లలో నొకరు ఆ డిపార్టుమెంటు వార్షిక నివేదికలలో నుదాహరించినట్లుగా చెన్నపురిరాజధాని దక్షిణమండలములందు ఐకమత్యాభివృద్ధికి పరపతిసంఘవ్యాప్తి కారణభూతమగుచున్నరీతిని ఆంధ్రమండలములందు గ్రంథాలయస్థాపనప్రాచుర్యము దృఢమగున్నదని వ్రాసినవిషయము క్రమక్రమముగ స్థాయియగుచున్నదని చెప్పుట అతిశయోక్తికాదు. ఆయుద్యోగీయుఁడు పైన వ్రాసిన దానిని బలపరచుచు పరపతిసంఘస్థాపనాభివృద్ధి కూడ వెంబడించి, ఆంధ్రదేశమున ప్రజైకమత్యమునకు జనసామాన్యజ్ఞానాభివృద్ధికి రెండుమార్గములు ఏర్పడినవి.

నాగరకత చెందినదేశము లని చెప్పబడిన ఏష్యాయూరపుఖండభాగములందు ప్రజలు లిపిని నిర్ణయించుకొనినకాలమునుండియు తమజ్ఞానమును గ్రంథరూపమున చిరస్థాయిచేయుటకు బ్రయత్నించినట్లు దృష్టాంతములు ప్రజలముగ గానబడుచున్నవి. కాగితములు, ముద్రాయంత్రములు మొదలగు సాధనములు లేని పూర్వకాలమున లోహము, రాయి, ఇటుక, భూర్జపత్రము, చర్మము, తాళపత్రము మొదలగు పరికరముల సాహాయ్యముతో భాషాభిమానులు, విద్యాభిమానులు, వివేకమహితులు తమ యభిప్రాయములను లిఖించి చిత్రించి చెక్కించి పురాతన జ్ఞానమును మనకు లభ్యముగావించిరి. గ్రంథము సేకరించుట కర్తవ్యమని యెంచి పాటుపడిరి. పురాతన దేశములలో చీనా, టిబెటు, భరతఖండము, పారశీకము, బాబిలను, అస్సీరియా, ఈజిప్టు, గ్రీసు మొదలగునవి ప్రధానముగ పేర్కొనదగినవి. క్రీస్తుశకారంభమునకు దరువాత యూరపుఖండమునందలి వివిధదేశములందు గ్రంథాలయస్థాపనమును, గ్రంథముల సేకరించు ప్రయత్నము ఎట్లు విజృంభించెనో తెలుప ప్రయత్నించుట అనావశ్యకమని తలచి దానినిగూర్చి చెప్పదలచలేదు.

ఈ దేశమున ముఖ్యముగా ఉత్తరహిందూస్థానమున మత, వైజ్ఞానిక, నైతిక, శాస్త్రీయ, రాజకీయ విషయములనుగూర్చి గ్రంథబాహుళ్య ముండెననియు, అట్టి విజ్ఞానభాగ్యమువలననే వీరపురుషులతోపాటు ధీబలసంపన్నులు పెక్కురు ప్రతిచోట బ్రబలియుండుట

వలన దేశము దుర్జయముగ నుండెనని యీదేశముపై దండెత్తిన మహమ్మదుఘోరీ కనిపెట్టెను. పండ్రెండు సారులు దండెత్తివచ్చిన మహమ్మదు గజినీ దేశమునందలి ధనకనకరత్న సంపన్నతను చూరగొనుటతో సంతృప్తుడయ్యెను. మహమ్మదుగోరీ ధనము నపేక్షింపక ప్రజాజ్ఞానవృద్ధి సాధకములైన గ్రంథములను సంగ్రహించి వానిని దగ్ధము గావింపకుండిన పక్షమున ఈదేశమున తా మజేతలము కాజాలమను రహస్యమును గ్రహించి దానినే యవలంబించెను. అతని సైన్యముల ఘాతుక ప్రయత్నముల బారినుండి తప్పించుకొనుటకు ఆకాలపు విద్యాసంపన్నులు తమ ధనధాన్యపశునిక్షేపములమాట తలపెట్టక తమగ్రంథైశ్వర్యములతో హిమవత్పర్వత ప్రాంతములకు నేపాళరాజ్యమునకుఁ బారిపోయి తమ యమూల్యధనములగు గ్రంథముల నచట భద్రపరచిరని చరిత్రలం దుదాహరింపబడియున్నది. ఈగ్రంథముల సేకరించుటయం దభిలాష బౌద్ధుల కాలమున నారంభమై దినదినాభివృద్ధి యయ్యెను. బౌద్ధ విశ్వవిద్యాలయములందు అమూల్యమగు గ్రంథసముదాయము చేర్చబడి యుండినట్లు మనము చదివియున్నాము. క్రమక్రమముగ నార్యులు భరతఖండమున వేర్వేరుభాగముల నాక్రమించి యందు నివాసము లేర్పరచుకొనినపిమ్మట వేదశాస్త్రములను సంస్కృతకావ్యనాటకాదికళలను భద్రపరచుచు దేశభాషలకుగూడ ప్రోత్సాహమొసగి ఆయాభాషలందును కావ్యరచనకు బ్రోత్సాహము నవకాశము నిచ్చిరి. ఒక్క ఆంధ్రభాషను తలపెట్టితిమేని మీమాంసాదిశాస్త్రములకు ప్రధానస్థానముగా నుండిన గౌతమీతటమున ఆంధ్రమహాభారతరచనము నన్నయభట్టు యత్నించి ఆంధ్రభాషకు గౌరవస్థానము నిచ్చుటయే తార్కాణము. పదియవశతాబ్దారంభము మొదలు నేటివరకును సంస్కృతసాహిత్యమునందలి గ్రంథముల యాంధ్రీకరణ ప్రయత్నము నిరాటంకముగ సాగుచున్నది. సంస్కృతగ్రంథములను తెనుగుకావ్యములను భద్రపరచుటకు ఆంధ్రులు పడినశ్రమ వర్ణనాతీతము. ఇనుపగంటమును చేబూని తాళపత్రములపై సంస్కృతాంధ్రలిపులలో మహాభారతరామాయణాది గ్రంథములను వ్రాయుట యెంతకష్టమో మన మూహింపజాలము. వర్ణింపజాలము. తెలుపజాలము. ఒక్క తాళపత్రప్రతిని జూచినయెడల మచ్చునకైన తుడుపులు గీతలు హంసపాదములు కానరావు. ఆకాలము నాటి లేఖకులకు బలమగు వెలుగునిచ్చెడు విద్యుద్దీపములు లేవు. ఇన్నిరకముల సులోచనములు లేవు. ఏయరుగుపైననో ఏచెట్టునీడనో గూర్చుండి వా రాగ్రంథములకు ప్రతుల వ్రాయుటకు బూనినదీక్ష, పడినశ్రమ ఆశ్చర్యదాయకములు. ఇప్పటికాలమున నొక చిన్నపాతమును వ్రాయదలపెట్టితిమేని చిత్తు, సాఫులు లేకుండ నడువదు. దాని నచ్చొత్తించునపుడు ఐదు ప్రూఫులు పదిసవరణలు జరుగకుండ నెంతచిన్నపాత్రమైనను మన చేతికందదు. శ్రీకారము మొదలు మంగళమువరకు నొక్కరీతిని అచ్చును మించినలిపితో భిన్నప్రతులను వ్రాసి భద్రపఱచి దేశమునకు, దేవభాషకు, దేశభాషకు వర్ణనాతీతమైన మహోపకారమును గావించిన మన పూర్వుల శ్రమకును భాషాభిమానమునకు మనకృతజ్ఞతను దెల్పుటకు మనకు శక్తిచాలదు. వేదమునకు వేదభాష్యమునకు ప్రతిని వ్రాసిన పండితు డొకడు తనతాళపత్రగ్రంథాంతమున నీక్రిందిరీతిని తన తదనంతరవంశీయుల బ్రార్థించుచు వ్రాసినట్లు చదివియుంటిని. "అయ్యలారా! ఈప్రతివ్రాత ముగించునప్పటికి నాచేయిపడిపోయెను. దృష్టిమాంద్యము జెందెను. నడుము వంగిపోయెను. ఈనడుమ కాలమున నేను కుటుంబవ్యవహారముల దలపోయలేదు. ఇట్టి పరిస్థితులలో వ్రాసిన యీ గ్రంథమును నాపుత్రులు పౌత్రులు వారి బిడ్డలు అమూల్యధనముగ నెంచి కాపాడి నా యాత్మకు సంతోషము కలిగించునట్లు నాయిష్టదైవ మనుగ్రహించుగాక" ఈ చొప్పున మన దేశమున బురాతనగ్రంథసంపాదనము తద్రక్షణము జరిగెను. ఈగ్రంథ సేకరణమునందు బ్రాహ్మణులు, క్షత్రియులు, శూద్రులు. సమానశ్రద్ధ వహించిరి. మామండలమున నే నెఱిగినంతవరకు కమ్మశాఖలోని వారైన ఒభిళిసేనివారు ఆంధ్రమహాభారతాది గ్రంథములకు బ్రతులు స్వయముగ వ్రాసిరి. దానిలోని కొన్నిపర్వములను నేను చెన్నపురి ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారమునకుఁ జాలకాలము క్రిందట సమర్పించితిని.

యూరపుఖండమునందువలె మనదేశమున చరిత్రలు ప్రకృతిశాస్త్రములు, యాత్రలు మొదలగు విషయములనుగూర్చి వ్రాయబడిన గ్రంథములు కానరాకున్నను కడచిన వేయిరేండ్లనుండి హిందూ మహమ్మదీయ ప్రభువులు తమ సంస్థానములందు పురాతనాధునిక గ్రంథసంపాదనమునకు గొప్ప ప్రయత్నములుచేసి మన దేశమునకు మహోపకారమును గావించిరి. ఈస్టు ఇండియాకంపెనీవారి పరిపాలనము స్థిరపడనారంభించి వారి రాజ్యవిస్తరము హెచ్చ నారంభించినకొలది మనదేశైశ్వర్యముతో పాటు ఉత్కృష్ట గ్రంథ పలాయనముకూడ

నారంభమయ్యెను. ఇంగ్లీషువారు, ఫ్రెంచివారు, జర్మనీ వారు, ఈదేశపు టమూల్య పురాతన సంస్కృత గ్రంథ సముత్కరములను సమస విధోపాయావలంబనముచే నిచట లేకుండజేసిరి. తుదకు మనమిపుడు వానిప్రతులు కావలసినయెడల పాశ్చాత్యదేశములనుండి తెప్పించు కొనవలయును. ధన కనకరత్నాభరణములు మనచేయి జారిపోయినట్లే మనదేశమునందలి పురాతనచిత్రములు, తాళపత్రగ్రంథములు మొదలగునవికూడ నధికారబలము వలనను కొన్నివేళల న్యాయైక దూరమార్గావలంబనము వలనను, పశ్చిమముఖమునుబట్టినవి. సంశీరుజంగు బహదరు నేపాళమునందలి 15 వేల తాళపత్రగ్రంథములను బ్రిటిషుపుస్తక భాండాగారమునకు బహుమానముగ నొసంగెను. బ్రిటిషురెసిడెంటు వానిని వందనములతో గైకొని రవానాచేసిన విషయము ప్రకటింపబడినపుడు అట్టి పురాతన నాగరక, వాఙ్మయమును గోలుపోవుట కన్న అర్ధరాజ్యమును ధారవోసియున్నయెడల దేశమున కట్టి విపరీతనష్టము సంప్రాప్తము కాకుండునని దూర దృష్టిగల దేశాభిమానులు కొందరపుడు వ్రాసియుండిరి. ఈదేశమునుండి మన వాఙ్మయము తొలగిపోయినవిధములు వర్ణించుటకు ప్రత్యేకోపన్యాస మావశ్యకమై యుండును. దాని నిచ్చట సంగ్రహముగ నేని వివరింప యత్నించినయెడల గ్రంథవిస్తరము తప్పనిసరి యగును

సంస్కృతభాషా పునరుద్ధారణము కొరకు జీర్ణ గ్రంథ పరిశోధనము కొఱకును ఆంగ్లేయ విద్యావిధానానుకూలముగ సంస్కృతమును నేర్పుటకు ప్రభుత్వమువారు దొరకొనినప్పుడు, వారు చాలవరకు జర్మనీ ఆస్ట్రేలియా దేశములనుండి ఆచార్యులను నియమించుచుండిరి. ఈ యాచార్యులు తమ యుద్యోగముతో పాటు పురాతన గ్రంథసంపాదనమునకు దొరకొని దాని కొర కవలంబించిన మార్గములు విపాసమును వింతను మోసమును స్ఫురింపజేయును. తంజావూరు సంస్థాన భాండాగారమును నెలకొల్పుటకు శరభోజీ మహారాజు పడిన శ్రమ,చూపినయోరిమి, వెచ్చించిన ధనము తెలిసికొనినయెడల అశ్చర్య సంతోషములు మనహృదయ సీమల జనింపకమానవు. ఈ చొప్పుననే బ్యాంకిపూరులో ఖుదాబక్షు స్థాపించిన పుస్తకభాండాగార గ్రంథ సంపాదనమున కాతడు పడినకష్టములు, పొందిన నిరాశలు మనము మరువదగినవికావు. రంగూను కలకత్తాలు మొదలు డెమాస్కసు, ఏష్యామైనరువరకు అతని యేజంట్లు ఉత్తమగ్రంథ సంపాదనార్థము చూపిన కౌతూహలము ప్రతివానికి ననుసరణీయము. దానికొర కాతడు సమర్థులైన ఏజంట్లను నియమించి వారికి విరివిగ ధనమిచ్చి యొక్కొక్క గ్రంథము చొప్పున సంపాదించెను. ఈగ్రంథసంపాదకులు 'ప్రాతపుస్తకాలు కొంటాము పాతకాగితాలు కొంటాము' అనువంటి వారుగా నుండదగరుకదా ? వారు, ప్రముఖులగువారి యింట చితుకాగితపు ప్రోవులను శ్రద్ధతో పరిశీలించి గులకరాళ్లలోనుండి మణుల నేరినట్లు అగ్రంథాలయము నకు పుస్తకముల సంపాదించిరి. ఖుదాబక్షు కొన్ని యేండ్లు శ్రమపడి సంపాదించిన రెండు పార్సీగ్రంథములను పాట్నాజిల్లాజడ్జి చదువుటకని పుచ్చుకొని తాను ఉద్యోగమును చాలించుకొని స్వదేశమునకు బోవుచున్నపుడు పొరపాటున తన యితరసామగ్రితో పంపివేసితినని చెప్పి ఆగ్రంథములను హరింపదలచెను. విదేశమున కేగుచున్న యూరోపియను చేజిక్కిన యేవస్తువు సామాన్యముగ యజమానునకు మరలదక్కుట యపూర్వ విషయమగుటచే ఖుదాబక్షు ఖిన్నుడయ్యెను. తాను తనదేశమును జేరినపిమ్మట నాగ్రంథములను బంపుమనని దొరగారు పొరపాటుననైన నుదాహరించలేదు. కొన్నాళ్లకు ఖుదాబక్షుగారి లాహోరు ఏజంట్లు అచ్చట ప్రాతపుస్తకము లమ్మువాని దుకాణమున రెండు విలువగల పురాతనగ్రంథములుగ దోచినవానిని కొని బ్యాంకిపూరులైబ్రరీకి పంపెను. ఆరెండును దొర వారు హరింపదలచిన గ్రంథములయ్యెను. దొరవారు తమ సామగ్రులను గ్రంథములను పెట్టెలలో బస్తా బందీచేయుట కాజ్ఞాపించినప్పుడు ఈ శిథిలగ్రంథములు పనికిరాని ప్రాతకాగితములక్రింద నెంచి వానినివిడిచి పెట్టి నిగనిగలాడుచు ముద్రింపబడిన రెండుమాసపత్రికలను వానిస్థానమున నమర్చిరి. స్వదేశమున కేగినపిమ్మట వాని కొరకు వెదకగ, అవి కాన్పించక దొరవారు ఖిన్నులై యుండుట నిశ్చయము. దైవము తనపాలిట నున్నాడనియు, మోసము సర్వదా జయము పొందదని యు ఖుదాబక్షు నమ్మియుండును.

హైందవవిజ్ఞాన నిలయమని చెప్పదగునున్నను కలకత్తా ఇంపీరియలు లైబ్రరీ అడయారు గ్రంథాలయము, మనదేశమున పేర్కొనదగిన గ్రంథాలయములు. బొంబాయి, కలకత్తా, ఏషియాటిక్కు సొసైటుల లైబ్రరీలు మనదేశసాహిత్యసామగ్రికి ముఖ్యనిలయములు. సర్వకళాశాలలున్న ప్రతిస్థలమునందును గ్రంథాలయాభివృద్ధికి ఉత్తమగ్రంథసంపాదనకు ప్రయత్నములు ప్రస్ఫుటములగుచున్నవి. ఇంక వేర్వేరు పట్టణములందును

గ్రామములందును స్థాపింపబడిన గ్రంథాలయములందు గ్రంథసంఖ్యను హెచ్చుగ చూపుటయే ప్రధానముగ నెంచి రైళ్లలో విక్రయింపబడు రూపాయికి 30 గ్రంథములవంటి వానివలన గ్రంథబాహుళ్యమే కాని చదువరులకు లేశము లాభము కలుగకున్నది. యూరపుఖండమందలి సుప్రసిద్ధగ్రంథాలయములందు నూరేండ్లక్రింద భద్రపరుపబడిన గ్రంథములలో నూటికి 70 వరకు నశింపుచేయబడ దగినవనియు కచ్చేరీలలోని రికార్డుల వలెనే గ్రంథాలయములోని గ్రంథములను సంఖ్యాబాహుళ్యముకొరకు భద్రపరుప దగనివనియు దీనిని గురించుచు నడుపబడుచున్న గ్రంథాలయములే లోకోపయోగకరములుగ నుండులనియు, అవి జరుగనినాడు ప్రకృతిశాస్త్రసిద్ధాంత ప్రసుత్తానుభవ విషయవిరుద్ధములగు విషయములతో నిండియున్న గ్రంథపఠనమువలన కాలము వ్యర్థమగుటయు నిష్ప్రయోజన జ్ఞానముతో మనకు నింపబడుటయు దప్ప లాభముండదనియు నొకానొకసమయమున లార్డు రోజుబరీ చెప్పియున్నాడు. ఇది ముమ్మాటికి నిజము. ఈసంగతిని ప్రతిగ్రంథాలయపాలకులు గమనించుట విధాయకము,

పాశ్చాత్యదేశీయులు పురాతనగ్రంథములు, వ్రాతప్రతులు, శిల్పములు. చిత్తరువులు, శాసనములు, మొదలగువానిని సంపాదంచి వానిని లోకోపయోగముకొరకు గ్రంథాలయములకు, చిత్రవస్తు ప్రదర్శనశాలలకు, కళాభవనములకు, విశ్వ విద్యాలయములకు, సమర్పించుచుందురని మనము తరుచుగ పత్రికాముఖమున దెలియుచున్నాము. వీని కొరకు కచట విద్యాభిమానులు కళాభిమానులు వెచ్చించుధనము వెర్రివాని చేతిలోని రాతివలె కొన్నపుడును. ఒక్క పురాతన గ్రంథకర్త యొక్క గద్యకావ్యమునుగాని పద్యకావ్యమునుగాని సంపాదించుటకు వారు పరరాష్ట్రసంపాదనమునకు పడవలసినంతశ్రమ పడుదురు. రష్యాలో సోవియటుప్రభుత్వమువారివశమందున్న 'కోడెక్సుసినెయిటికసను (Codex cinaiticees) నాల్గవశతాబ్దమునాటి బైబిలువ్రాతప్రతిని బ్రిటిషు మ్యూజియమునకు సంపాదించుటకు విశ్వప్రయత్నము చేసి లక్షపౌండ్లకు దానిని కొనితెచ్చిరని గత డిశెంబరు 27 తేదిని తంతివార్తలలో నుదాహరింపబడెను. ఈ యపూర్వవ్రాతప్రతిని సంపాదించుటకు రాజు మొదలు రెడ్డివరకు విరాళములిచ్చుచున్నారు. చూచితిరా వారి భాషాభిమానము! దేశమున విద్యాభాగ్యాభివృద్ధికాంక్ష! గ్రంథముల విలువ నెరుగని పండితకుటుంబముల సంతతివారు తమ పూర్వు లతిశ్రమలకు జాలై సేకరించి భద్రపరచిన తాళపత్రములను సంక్రాంతి భోగిమంటలకు సమర్పించినవారు కలరు. ఒకయున్నత పాఠశాలయం దిపుడు సంస్కృత పండితుడుగనున్న విప్రుడు కొంతకాలముక్రిందట తనబందుగు లింటికి చుట్టము చూపుగబోయి రాత్రి పరుండినపుడు వారాతనికి తలగడకు మారుగ వారింట మిగిలియున్న యొక లావైన తాళపత్ర గ్రంథమునిచ్చిరి. ఆరాత్రికి దానినాతడు తలగడగ నుపయోగించి మరుచటి యుదయమున దాని సూత్రమును విప్పి చూడగ నది శంకరభాష్యమయ్యెను. మనదేశ దురదృష్టమిట్లయ్యెను. అథర్వవేదము నిండుప్రతికొరకు ఆష్ట్రియాపోవలసివచ్చెను. విజ్ఞానసర్వస్వమువారు శివాజి ప్రతిమను ప్యారీసునుండి తెప్పించిరి. అక్కన్న మాదన్నగారి ఛాయాపటము అంష్టరుడంనుండి రావలసివచ్చెను. లోక సౌభ్రాతృత్వము సాధ్యమై లోకకల్యాణము సమకూడిననాడు మనదేశమునుండి దేశాంతరములకు బలాత్కారముగ గొనిపోబడిన గ్రంథములు, శిల్పములు, చిత్రములు లోనగునవి మరల పూర్వాభిముఖములగునని నే నూహించుచున్నాను; పరమేశ్వరు డది సమకూర్చుగాక! ఆంధ్రమండలములందలి చాల వ్రాతప్రతులు చెన్నపురిప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారము చేరినవి. కడచిన 10, 15 యేండ్లలో కొన్ని జర్మని యింగ్లండు దేశములకేగినవి. శ్రీ పిఠాపురం మహారాజాగారు కీర్తిశేషులైన చెలికాని లచ్చారావుగారు వ్రాతపతులను చాలవరకు సంపాదించిరి. ఆంధ్రసాహిత్య పరిషత్సభవారివద్దను మంచి గ్రంథసముదాయమున్నది. వీనిలో నూటికి 80 వంతున ముద్రితములని కనబడుచున్నది.

ఆంధ్రగ్రంథాలయోద్యమము స్వయంభువు. ఇది కేవల ప్రజాపోషణము వలన నిలిచియున్నది. దీనికి ప్రభుత్వాదరణము సున్న. దేశాంతరములందు వలె పట్టణములందు గాక నిచట నీయుద్యమము గ్రామములందారంభమయ్యెను. ఆంధ్రోద్యమారంభముతో గ్రంథాలయ స్థాపన మారంభమయ్యెనని చెప్పనగును. దీనికి మహా మహోపాధ్యాయ శ్రీపరవస్తు వేంకట రంగాచార్యులయ్యావార్లంగారు పితామహులుగ కనపడుచున్నారు. పిమ్మట పులివెందల, ఒంగవోలు, విజయనగరము, కుముదవల్లి; ఉండి, కొల్లూరు, గుంటూరు, రాజమహేంద్రవరము, హైదరబాదు, విజయవాడ, కాకినాడ లోనగు ననేక పట్టణము

లందు గ్రామములందు గ్రంథాలయములు స్థాపింపబడి చాంద్రాయణ వ్రతదీక్ష నడుపుచున్నవి. ఈయుద్యమము మాట తలపెట్టునప్పుడు శ్రీయుత అయ్యంకి వేంకటరమణయ్యగారును, కీర్తిశేషులైన సూరి వేంకట నృసింహశాస్త్రిగారును తలపునకు రాకమానరు. భీష్మునియెదుట శిఖండివలెగాక అర్జున సారథియగు శ్రీకృష్ణునివలె వేంకట రమణయ్యగారు మన మహాసభా రథమును నడుపుట కిపుడు మనమధ్య నున్నారు. గోత్రనామములు చెప్పి పాదములు సోక మ్రొక్కుటను అభివాదనమందురు. పాదములు సోకుట మాట నటుండనిచ్చి, ఏకార్షేయ శౌనకసగోత్రోద్భవులైన అయ్యంకి వేంకటరమణశర్మగారికి మన కరయుగములను లలాటస్థలమున చేర్చి యభివాదన మొనర్చుటకు నిచట సమావేశమైన గ్రంథాలయాభిమాను లభ్యంతరము చెప్ప రని తలచుచున్నాను.

జనసామాన్యమును జ్ఞానవంతులను చేసి వారి కన్యోన్య స్నేహసహకార భావమును పెంపొందింపజాలిన ప్రతిష్ఠాపనము ధర్మగ్రంథాలయము. గ్రామజీవనమునకది కేంద్రస్థానము గావలయును. జాతి పరిజ్ఞానాభివృద్ధులకేది సాక్షీభూతమో, గ్రామముయొక్కసమస్తవ్యాపార పరిష్కృతి కది కూడలి స్థలము. అట్టి పవిత్రప్రదేశమునందును జ్ఞానసంపాదనప్రయత్నము దాని యుద్దేశసంకల్పముల నేమరి, చీట్లపేకాట, చతురంగములతో నచట పౌరులు, జానపదులు కొన్నిచోట్ల ప్రొద్దులు పుతురని తెలియుట శోచనీయము. మనదేశ శ్రేయమును సర్వదా కోరుచుండు రివరెండు పండర్లండు చీట్లపేకాటనుగూర్చి ప్రబుద్ధభారతి పత్రికలో వ్రాసినదానినిచట భాషాంతరీకరించి పొందుపరచుచున్నాను.

“ఉపయోగమునుబట్టి గాకున్న, పేకముక్క లితర కాగితపు ఆటముక్కలవలెనే ప్రమాదకరములుగావు. వానిని నిరాక్షేపణీయవిధముగనుపయోగించవచ్చునని మన మెరుగుదుము. వానినిగూర్చి రెండుమూడు విషయములు మాత్రము చెప్పవలసియున్నది. అవి జూదమున కుపయోగించు సామాన్య సాధనసామగ్రియై యున్నవి. ఒక యువకుడు మంచి ఆటకాడైనపక్షమున దానిమూలమున నాతని కవలీలగ జూదమాడు నలవాటు పట్టుబడగలదు. ఇంతేగాక పేకాటవలన, ఆటగానికి దేహపరిశ్రమమున కవకాశ ముండదు. టెన్నిసు మొదలగు ఆటలవలె నది వెల్లడిగ గాలిలో నాడుకొనునది కాదు. ఆ యాటవలన వ్యర్థమగుకాలము అమితము. అది తల చూపినచో బుద్ధివైశద్య ప్రయత్నము కల్ల. ఈదేశపు (అమెరికాదేశపు) ఉత్తర దక్షిణభాగములందు వందలువేలకొలది సంఘములు మానసికవిషయ చింతన మెరుగని మరణావస్థయం దున్నవి. బుద్ధికౌశలము చూడవలసిన కార్యమునకు వాని బురికొల్పశక్యము కాదు. దీనికి గారణము పేకాటవ్యసనమే? యూకరు మొదలగు నితర పేకాటకూటములకు జనులు గుంపులుగుంపులుగ పోవుచుందురు. అట్టివారి కితర ఘనకార్యాచరణాపేక్ష కలిగించుట సాధ్యము గాదు. పేకాటయం దీ చెడులక్షణము లిమిడియుండుటవలన నిది ప్రమాదకరవ్యసనమని గ్రహించి దానిదరికి జేరకుండుటయే శ్రేయస్కరము.”

ఆమడలకొలది దూరముపోవు ఫిరంగిగుండ్లతో, వాయు విమానములతో విషవాయువులతో జలాంతర్గాములతో లోకసంహారము చేయుచున్న క్రైస్తవ, మహమ్మదీయ, బౌద్ధమత రాజ్యములువిజృంభించియున్న యీకాలమున - నిరాయుధులైన హిందువులు చతురంగ సైన్యములను గ్రంథాలయములందు, పఠనమందిరములందు, క్లబ్బులందు వ్యాయామఫలకమునందుగాక వేరువిధమున నడిపించుట సాధ్యము గాకుండుటవలన వారికాలహరణక్రీడలు సమ్మతము లనబడదగినను, దేహపరిశ్రమకుపయోగించుక్రీడలకు దొరకొని చతురంగమును కూడ పేటికాంతర్గతము గావించుట వివేక లక్షణ మని తెలుప సాహసించుచున్నందులకు నన్ను మన్నింప వేడెదను.

లండనునగరభాగమగు బ్లూమ్సుబెరీలో జాతీయ కేంద్రగ్రంథాలయ మిపుడు నెలకొల్పబడియున్నది. అది ప్రపంచమందలి గ్రంథాలయసంస్థలలో నుత్కృష్టమైనదని చెప్పుట యతిశయోక్తి కాదు. దానియందిపుడు 50 లక్షల పుస్తకములుకలవు. మన తెలుగుజిల్లాలన్నిటిలోగల గ్రంథములను లెక్కపెట్టినను వానిలో సగమైన నుండునని తోచదు. అందలి గ్రంథములను చదువుట కచట కెవ్వరును వెళ్లరు. ఆగ్రంథాలయాధికారికి పాఠకముఖసందర్శనలాభము చేకూరదు. అందలి గ్రంథములను చదువువారు పెక్కండ్రు, గ్రంథాలయ మెచ్చట నున్నదో యెరుగరు. వా రందలి గ్రంథములను టపాద్వారా తెప్పించుకొని చదివి మరల పంపివేయుదురు. విజ్ఞానలోకమున గల సర్వవిషయముల గురించిన గ్రంథములు బ్రిటిషు దీవులలోని పుస్తకభాండాగారములకు ప్రతిదినమచటనుండి కట్టలుగ టపా

లో పంపబడును. ఆకేంద్రగ్రంథాలయము బ్రిటిషుదేశమునకు జాతీయవిశ్వవిద్యాలయమువంటిదైనది. అది ఉచిత పుస్తకభాండాగార మగుటచే దేశమందలియన్నిభాగములవారు తమస్థానిక గ్రంథాలయము ద్వారా అందలి గ్రంథములు తెప్పించుకొని తమస్వస్థలముననే వానిని చదువగలుగుచున్నారు. ఒకస్థానిక గ్రంథాలయమున పాఠకులు కోరిన గ్రంథ మందు లేనిపక్షమున, దానినిర్వాహకులు దాని కొరకు కేంద్రగ్రంథాలయమునకు వ్రాయుదురు. అచ్చట కూడ నది లభ్యము కానిచో వెంటనే దానియధికారు లాపుస్తకమును గురించి వాకబుచేయుటకు సాహిత్యాన్వేషణ శాఖవారికి (Literary Detective Department. తెలిపి వారిద్వారా సంపాదించి పంపుదురు. ఈచెప్పిన శాఖవారు బ్రిటిషుదీవులందు, తదితర బ్రిటిషు రాజ్యభాగములందు గల 182 లయిబ్రరీలతో వ్యవహరించుచు నసంఖ్యాకములైన తమ గ్రంథరాజములను సులభముగ నితరులకు హస్తగతము గావించుచున్నారు. ఈగ్రంథసముదాయమున నవలలు (Novels) లేవు. వానిపఠనము చీట్లపేకాటవలె నిష్ప్రయోజక మని దాని యధికారులు తలపోసి వాని నందు చేర్చలేదేమో! దీనికొరకు నూత్నముగ నిర్మింపబడిన భవనమున మనజార్జిసార్వభౌముడు 1933 సంవత్సరము నవంబరు 27 తేదీని ప్రవేశమహోత్సవము జరిగించెను. ఆభవనమునం దింకను పదిలక్షల గ్రంథము లుంచుటకు చోటుకలదు. అందలి పుస్తకముల కొరకు దేశపు నానాభాగములనుండి దినమునకు సగటున 400 దరఖాస్తులచొప్పున వచ్చుచుండును. అట్టి దరఖాస్తులమీద గతవత్సరమున 61,680 పుస్తకములు టపాద్వారా యితరచోట్లకు బంపబడెను. పుస్తకముల నడుగక సంజాయిషీమాత్రము కోరుచు వ్రాసిన ఉత్తరములందుతఱచుగ క్లిష్టప్రశ్న లుండును. వానికినిసత్వరముగ బ్రత్యుత్తర మంపుదురు. సట్టిసంజాయిషీ కోరినవిషయములు కొన్ని గ్రాహ్యములు. (1) పగిలిపోయినపింగాణిసరుకులను మేకులతో బిగించుటెట్లు? బార్జెసు (Barges) రకము పడవలను కట్టుటనుగురించిన గ్రంథము లెవ్వి? (3) సోల్జరుబొమ్మలను చేయువిధము నేర్పుగ్రంథములు (4) నెపోలియను బోనపార్టి యుద్ధకాలపు నాటి ఆయుధవివరము. (5) జంతుకంకాళమును భద్రపరచువిధము. (6) స్లావోనికు భాషావ్యాకరణము. (7) దక్షిణసముద్రద్వీపవృక్షసముదాయము. (8) దుస్తులలో కల్గిన మార్పుల క్రమము దెల్పు గ్రంథములు.

స్థలాంతరమునకు పంపబడు గ్రంథములు వెల హెచ్చైనవియైనను, అవిపోయినవి కనపడలేదను వాదము వినబడుట యరుదు. ఇతరులకు పంపబడిన పుస్తకములు శిథిలములైనను, మురికియైనను, దానికి ప్రతిగ్రహీతలు, దానిబాధ్యతవహింతురు. ఈచెప్పినవారిరువురపై నార్థిక సంబంధభారము దామాషాయిగ నుండుటజేసి నష్టమల్పముగనుండును. నిత్యము రవానాచేయబడుపని బాలికలకు నేర్పుదురు. గ్రంథములను తెప్పించుకొనుటకు తిరిగి పంపుటకయ్యెడు తపాలవ్యయమంతయు పాఠకులు వహింతురు గాన కేంద్రగ్రంథాలయమునకు వ్యయమల్పము. ఇందలి గ్రంథములు సజీవములు నిర్జీవము లని రెండు విధములుగ విభజింపబడి యున్నవి. నిత్యమును తఱచుగ కోరబడు గ్రంథములు సజీవ భాగమునందు చేర్చబడియున్నవి. ఎప్పుడో, ఎన్నడో కోరబడు గ్రంథవములు, నిర్జీవగ్రంథభాగమున నుండును. 1916 వ సంవత్సరమున స్థాపింపబడినయీజాతీయవిశ్వవిద్యాలయప్రదాత ఆండ్రూ కార్నిజీ. నూటికి 10 మందియైన చదివినవారు లేక, వేయిసంవత్సరములనుండి దేశభాగ్యము తొలగిపోవుచున్న యీదేశమునం దట్టి గ్రంథాలయము తలనూపుటకు కొన్నిశతాబ్దములు పట్టునేమో.

బరోడా రాజ్యమున సంచార గ్రంథాలయములు గలవు. వానినిగూర్చి మీకు ప్రత్యేకముగ దెలుపబడును. ఇతరపట్టణములందు కాపురమున్న సభ్యులకు చెన్నపురి లిటరేరిసొసయిటీవారు గ్రంథములను పంపుచుండిరి. అది నే నెరుగుదును. ఒక్కపట్టనమున వివిధభాగములందు జనసామాన్యమున కుచితవార్తాపత్రికాపఠన మందిరము లుండుటయు విజ్ఞానప్రదీపికి సాధనభూతము. సూరతుపట్టణము నాల్గుదిశల నట్టి మందిరములను నే జూచితిని. అవి యింకను వర్ధిల్లుచున్నవని నేదలచుచున్నాను. ఈసందర్భమున కలకత్తామ్యునిసిపలు కార్పొరేషను వారి ప్రయత్నములు శ్లాఘాపాత్రములు. 1919 సంవత్సరము మొదలు కార్పొరేషను వారు ప్రజాయత్త గ్రంథాలయములకు ధనసాహాయ్యము చేయుచు ప్రతియేట రు 58000 వెచ్చించుచున్నారు. నగర వివిధభాగములందున్న 146 లయిబ్రరీలవారి కాధనము పంచిపెట్టబడుచున్నది. ఆభాండాగారములం దిపుడు 5 లక్షల సంపుటము లున్నవి. ప్రతిగ్రంథాలయము సగటున 50 పత్రికలను కొనుచున్నది. ప్రతిగ్రంథాలయమునకు సగటున దినమునకు 200 పాఠకులు వచ్చుచున్నారు. ప్రతిలయిబ్రరీనుండి మొత్తముమీద 500 మంది పుస్తకముల నెరవుగ గొనుచున్నారు. అట్లు ఎరవుగ గొన్న

గ్రంథములు మొత్తము ప్రతి లయిబ్రరీకి 25,000 లయ్యెను. పాఠకులందు గ్రంథముల నెరవు గొనువారి యందు పురాణవిద్య నెరుగనివారు విశేష సంఖ్యాకు లున్నారు. ఇందుమూలమున ప్రతి లయిబ్రరీ గ్రంథ సముదాయమునందు నూటికి 70 వంతు బంగాళీ గ్రంథము లున్నవి. కార్పొరేషన్ వారొసగు సహాయద్రవ్య మంతయు పుస్తకములను వార్తాపత్రికలను కొనుటకే వినియోగింపవలయును. మరియు నా మొత్తమున కనీసము 10వ వంతు, ఆరోగ్యము, పారిశుద్ధ్యము దేహపరిరక్షణములను బోధించు ప్రచురణములను- 15 వ వంతు మతము నీతి దేశయాత్రలు, చరిత్రాత్మకవిషయగ్రంథములను- అనను పైదవవంతు దేశీయపునరుద్ధారణ ప్రజ్వలన బోధకములగు గ్రంథముల కొనుటకు వినియోగింపవలెనను నియమము కలదు. ఆయా వార్డుల కవున్సిలరు లందలి లయిబ్రరీకమిటీలలో గౌరవసభ్యులుగ నుందురు. లయిబ్రరీ నెలకొల్పబడిన గృహము దానికి సంబంధించిన పనులకే వినియోగింపబడ వలయును (అచ్చట పేకాట చతురంగము కూడునని కాని కూడదని కాని నిర్ణయింపబడలేదు) ఈచొప్పున పాలీనా నియామకముగ నిచ్చు గ్రాంటుకు అదనముగ, చిరస్థాయియైన లయిబ్రరీకి ప్రత్యేకవిరాళము లిత్తురు. కాకినాడ పట్టణమున మ్యునిసిపలువారు పురమందిర మందలి పుస్తక భాండాగారమునకు, రామారావుపేట భాండాగారమునకు ద్రవ్యసాహాయ్యము నిచ్చుచున్నారు. రామచంద్ర వేంకట కృష్ణరాయ పుస్తకభాండాగారమునందు వార్తాపత్రికల నేర్పాటుచేయక పోవుటవలన నాపఠనమందిరము ప్రజారంజకము కాకపోవుట సరియే కదా, క్రమముగ దిగజారుచున్నదని నేను విన్నవింప సాహసించుచున్నాను. జిల్లాలోని పుస్తక భాండాగారములందు వాసికెక్కియున్న పోలవరం జమీందారు గారి పుస్తక భాండాగారమున వార్తాపత్రికా పఠనమున కేర్పాటుచేయుటకును తెలుగుగ్రంథముల నింకను విరివిగ తెప్పించుటకును, పాఠకులు రాత్రి కొంతకాల ముచట నిలిచి చదువుకొనుటకును బహిరంగ సభలు పాఠకుల కడ్డము కాకుండ ప్రత్యేకస్థల మేర్పాటు చేయుటకును, ఆ లయిబ్రరీ కార్యనిర్వాహకులను వేడుచున్నాను.

ఇపుడు పట్టణములందు పెద్దగ్రామములందు లోకల్ బోర్డులవారు మునిసిపల్ సంఘమువారు ప్రత్యేక పుస్తకభాండాగారములను స్థాపించుటో ఉన్నవానికి ధనసహాయ మొసగుటో, లేక తను తమపాఠశాలలలో లైబ్రరీగ్రంథము లనబడువాని నమర్చి యుంచుటో వాడుకయైనది. క్రమముగా ప్రతిసంవత్సరము కాకున్నను కొన్నియేండ్లనుండి దొరతనమువారు రాజధాని యాదాయమునుండి లైబ్రరీల పోషణము నిమిత్తము కొలదిపాటి ద్రవ్యసహాయము చేయుచున్నారు. ఆ ద్రవ్యప్రదానవిధానము సంకటమార్గ ప్రయాణమువలె నున్నది. "చెరిసగాయస్వాహా- అలాగైతే మాభాగైదంనమమ" అను హాస్యగ్రామ్యోక్తి కనుగుణముగ నీద్రవ్యప్రదానము నడచుచున్నది. ఆసాహాయ్యమును బడయుటకుమందు స్థానిక పరిపాలనసంఘమువారి యనుగ్రహాభిమానముల బడయవలయును. కొన్ని స్థలములందు వారి యనుగ్రహము భాండాగార నిర్వాహకుల జాతికులములనుబట్టియు వారిస్థానిక రాజకీయ సంబంధములపైనను ఆధారపడియుండును. చాల విలువ కలిగిన పుస్తకములతో నిండియుండి విశాలమైనభవనమున నెలకొల్పబడి పనిచేయుచున్నగ్రంథాలయములకు, ప్రెసిడెంటు ఛైర్‌మను ఎన్నికలలో తోడ్పడినవారు నడుపుచున్న నామమాత్ర పుస్తకాలయముల కిచ్చినంత విరాళమునైన ననుగ్రహింపని నిదర్శనములు కలవని చెప్పుదురు. ఇది సత్యము కావచ్చును. ఇది యిట్లుండ, దొరతనము వారొసగిన విరాళముతోను స్థానికపరిపాలనా సంఘములు భాండాగార నిర్వాహకులు సమకూర్చిన ద్రవ్యముతోను కొనవలసిన గ్రంథములను జిల్లా విద్యాశాఖాధికారులు ముందుగ నామోదించవలెను. వీరిలో రకరకముల తత్వములవా రున్నారు. భాండాగారాధికారులు నిబంధనానుసారముగ సిద్ధము చేసి పంపిన పుస్తకముల జాబితాలోని గ్రంథము లన్నిటిని వీరు చదివియుండుట యసాధ్యము. టాల్‌స్టాయిగ్రంథముల కొనగూడదను అధికారి యొకడు, బెర్నార్డుషా గ్రంథములు కూడదను వాడొకడు, రివరెండు చార్లెసు ఆండ్రూసు ప్రకటనములను నిషేధించువాడొకడు, మహాత్మాగాంధినిగూర్చిన పుస్తకములు గ్రంథాలయములో నుండ గూడదని అభ్యంతరము చెప్పువాడింకొకడు. ఇట్టి చిత్తవిభ్రమము కలవారితో భాండాగారనిర్వాహకులు కలిసిమెలసి తిరుగుచు కృతకృత్యులు కావలసియున్నది. ఈ కష్టనివారణమునకు దానభేదోపాయములు రెండును సహాయభూతము లగుచున్నవి. సామాన్యముగ పల్లెటూళ్ళలోని గ్రంథాలయములలో జానపదుల వ్యవసాయాది గ్రామవృత్తుల వృద్ధికి తోడ్పడగల గ్రంథజాలము లేదు. ఎక్కడ చూచినను రామాయణము, భారతము, భాగవతము, అధ్యాత్మరామాయణకీర్తనలు, రామదాసుచరిత్ర మొదలగు పురాణవిషయబోధకము

16వ ఆంధ్రదేశ గ్రంథాలయ మహాసభ

కాకినాడ

ఆహ్వానసంఘ అధ్యక్షులగు

దుగ్గిరాల వేంకట సూర్యప్రకాశరావుగారు



ప్రథమాంధ్ర గ్రంథాలయ ప్రచారకుల మహాసభ

కాకినాడ

ఆహ్వాన సంఘాధ్యక్షులగు

నేతిశ్రీకంటి యోగానందరావుగారు

బి. ఏ., ఎల్. టి..



అధ్యక్షులగు

శ్రీమతి బొడ్డపాటి సీతాబాయమ్మగారు

లగు గ్రంథములుమాత్రమే కొననగును. గ్రామవాసులకు హరికథలు, ఉపన్యాసరూపమున బోధింప తలపెట్టితిమేని కుచేలోపాఖ్యానము, సీతాకళ్యాణము, ప్రహ్లాదచరిత్ర, గరుడగర్వభంగము, ద్రౌపదీవస్త్రాపహరణము, సావిత్రీపరిణయము మొదలగు పురాణగాథలే ప్రత్యక్షమగును. అంతటితో సంతుష్టిపడిన లాభములేదు. నవీనశాస్త్రజ్ఞానము గూడ వారికి లభింపజేయవలెను. ఆలమూరు గ్రామపునర్నిర్మాణసంఘమువారివలె మూడు నాల్గు పరిస్థితులు చేజిక్కియుండి కొంత సిరాదాయముకూడ కనబడుచుండినప్పుడే ప్రజాక్షేమకరమగు పని సాధ్యమగును.

జనపదములందు లైబ్రరీలు సర్వవిధవ్యాపారములకు చేయూతగ నుండి తోడు నీడగావలెనని పెద్దలు బోధించుచు పాశ్చాత్యదేశములందలి యాదర్శములను మన మనోనేత్రముల యెదుట విప్పిచూప యత్నింతురు. స్వపరిపాలనముగల రాజ్యములలోని ధర్మములు, ఆచరణములు మన కెట్లు సాధ్యమగును.

కర్షకులకు ప్రకృతశాస్త్రపరిశోధకులకు, సాహిత్యచిత్రకళాచరిత్రాభిమానులకు గ్రామసాంఘిక ఆర్థికపారిశ్రామికాభివృద్ధికుతూహలులకు గ్రామభాండాగారములు తోడ్పడవలసినరీతిని తెల్పుగ్రంథములను చదివి లాభము పొందించవలెనని-రాజధానినగరములనుండియు విశ్వవిద్యాలయములనుండియు విచ్చేసిన వక్తలు, ఆచార్యులు మనకు తరుచుగ బోధించుచుందురు. వారియుపదేశవాక్యములు మబ్బులోని మెరుపులవలె తాత్కాలికముగ మనదృష్టికి మిరుమిట్లు కొలిపి వెంటనే మనలనంధకారమగ్నుల గావించును. జాతిమతశాఖాభేదములు, మన రాజకీయవ్యవహారనాట్యరంగమున పాత్రలైయున్నంతకాలము మన పుస్తకభాండాగారములును ఇతరప్రయత్నములవలెనే వృద్ధినిగాంచనేరవు. ఏ బరోడా మహారాజు వంటివాడో పూనుకొని తన నైజవిద్యాభిమానమును స్వప్రజాభివృద్ధ్యౌత్సుక్యమును విజృంభింపజేసిననాడుగాని శ్రేయస్కరమగు నీయుద్యమము అచిరకాలమున దేశమున కొనరింపవలసినంత మేలును చేకూర్పజాలదు. విద్యాధికులు, విద్యాభిమానులు తమ తీరికకాలమును నిష్ప్రయోజకములగు విషయములందు వ్యర్థపుచ్చక సాధ్యమైనంత సహాయమును జనబాహుళ్యమున కొనర్చి అయ్యంకి వెంకటరమణయ్య, సూరి వెంకటనరసింహశాస్త్రి ప్రభృతులారంభించి సాగించుచున్న యీయుద్యమమును సార్థకముగావించి, ఆంధ్రదేశమునకు వన్నె దెత్తురుగాక.

శ్రీ ఇప్పగుంట సుబ్బుకృష్ణయ్య ఎం. ఏ., బి. యస్‌సి. గారి ప్రారంభోపన్యాసము :

సుమారు పదియారుసంవత్సరములకు బూర్వము నాకీ యుద్యమముతో కొంత సంబంధ ముండియుండెను. ఈ మధ్యకాలములో నీయుద్యమ మెన్నియో విధముల నభివృద్ధి గాంచినది.

ఆంధ్రగ్రంథాలయోద్యమము విషయమై అభిప్రాయభేదములు లేవు. మన మందరము ఐకమత్యముతో ఒకచోట కలిసి పనిచేయుటకు ఈ యుద్యమమవకాశ మిచ్చినది. పాశ్చాత్య దేశములలో జాతీయభావము కలిగి యున్నవారు కొద్దిమంది మాత్రమే యుందురు. మిగిలినవారు సాంఘిక, పారిశ్రామికములందు దేశము నభివృద్ధిలోనికి తెచ్చుటకు ప్రయత్నింతురు. మన దేశములో నట్లు లేదు. మనలో సాంఘిక మతభేదము లున్నవని యందురు. కాని దేశీయ గ్రంథములను మహమ్మదీయులు కూడ జాగ్రత్తగ కాపాడినట్లు ఋజువు కలదు.

పాట్నాలో నుండెడి 'ఖుదాబక్షు' అను అద్భుత గ్రంథాలయమును నేను స్వయముగా చూచితిని. దానిని అందరును అవకాశము కలుగజేసికొని చూడగోరెదను.

అప్పటికప్పుడు ప్రచురణమైన నూతన గ్రంథములతో గ్రంథాలయములను నింపి చదువరుల కాకర్షణము గలుగజేసి ప్రోత్సహింప వలెను. అమెరికాలో గ్రంథాలయమునందు ఏగ్రంథము కావలసిన ఆగ్రంథము దొరకును. మరియు పెద్దపఠనాలయములుండుటచేత ప్రపంచములో నుండెడు ఏ దేశములోని పత్రికలైనను దొరకును. సంగీతము నేర్చుకొనుటకు వివిధదేశములం దుండెడు భేదములను తెలిసికొని సమకూర్చుకొని ఆరితేరినవారగుటకు, గానగ్రంథాలయము లుండును. గ్రుడ్డివారికి జ్ఞానోదయము కలుగుటకు లైబ్రరీలు కలవు. చిత్రకళాభివృద్ధికి ఆర్టులైబ్రరీలు ఆర్టుగ్యాలరీలును కలవు. న్యూయార్కు పట్ట

ణము నందలి గ్రంథాలయములందు శాశ్వతముగా ఆర్టుగ్యాలరీలున్నవి. ప్రతి పట్టణమునకు నాటకశాల, మ్యూజియమ్. ఆర్టుగ్యాలరి, గ్రంథాలయము (అనగా నేటి గ్రంథములు పత్రికలుకూడ దొరకునట్టిది) మన దేశములో కూడ ఉండవలెను. ప్రతి గ్రంథాలయమునకును ఒక అంగముగా పఠనమందిర ముండవలెను. అమెరికా దేశమందు ఆయా వయస్సులుగల పిల్లలకు అనుగుణముగా తరగతులప్రకారముగా బాలుర గ్రంథాలయములును ఆయా దేశములందు గలవు. పిల్లలకు చక్కగా బోధింపగల నిపుణులుగూడ యుండి వారికి చెప్పుచుందురు. ఇట్టిరీతిగానె మనదేశమందుకూడ నేర్పడవలెను. అమెరికాలో పిల్లలు గ్రంథాలయములోనికి వచ్చునపుడు చేతులు శుభ్రము చేసికొని పుస్తకములు ముట్టుకొనేటట్లు నేర్పుదురు.

ఆ దేశమందలి కొన్ని గ్రంథాలయములలో భోజనమునకు కావలసిన అవకాశము కూడ చేయబడినది. బోస్టన్‌లో గొప్పఆర్ట్ గ్యాలరీయు ఆర్కెస్ట్రాల్ హాలును గలవు. మాసమునకు రెండుపర్యాయములు గానప్రదర్శనములివ్వబడును. గాన, కళా, చరిత్ర, ఇతిహాస సంబంధములైన విషయములు అట్లు అచ్చట పిల్లలకు పెద్దలకు నేర్పుచుండునపుడు మనదేశములో నేల యట్టి ప్రయత్నము చేయరాదు!

మీరు డబ్బులేదని అనవచ్చును. కాని డబ్బు వినియోగించెడి తెలివిని మనము సంపాదించలేదని చెప్పవలసియున్నది.

చికాగో యూనివర్సిటీలైబ్రరీలో 20 లేక 25 గురు విద్యార్థులున్నప్పటికి 1,50,000 గ్రంథములు ఆ గ్రంథాలయములో గలవు. దానినిబట్టి అచ్చటి యభివృద్ధిని మీరు గ్రహింపుడు. మందులమ్ము షాపులు ప్రతివీధిలో నుండును. అట్టిషాపులందు కొన్ని పుస్తకములుండును. కావలసినవారు 5 సెంట్లు లేక రెండుఅణాలు అక్కడ పెట్టి ఒకవారము కావలసిన పుస్తకములను వారు ఎరువుతీసుకొని వెళ్లుచుందురు. ఈవిధముగా కూడ ప్రజలలో ప్రబోధము జరుగుచుండును.

ఆదేశములందు ఈ గ్రంథాలయోద్యమమును జనులందరికి సంబంధముగల ఉద్యమముగా చేసి (mass movement) అందరును అభివృద్ధినొందిరి. అటిస్థితి మనదేశమందు కూడ వచ్చి జనులందరును విజ్ఞానాభివృద్ధిని పొందెదరని కోరెదను.

ఇతర ఉపన్యాసములు మొదలైనవి.

యాతగిరి లక్ష్మీ వేంకటరమణగారికి గౌరవము.

పిమ్మట శ్రీయాతగిరి లక్ష్మీవెంకట రమణగారు "గ్రంథాలయ ఆధునిక జీవితము" అనెడి వ్యాసమును చదివి వినిపించిరి. సుమారు ఇరువది సంవత్సరములనుండి గ్రంథాలయోద్యమమునకు వారు చేసిననేవను అభినందించుచు సన్మానసంఘమువారు ఒక ఖద్దరుశాలువను ఆయనకు బహుమతి చేసిరి.

తరువాత వంగిపురపు జగన్నాథరావుగారు (తెనాలి) గ్రంథాలయ ప్రచారమును గురించి ఇట్లు ఉపన్యసించిరి.

గ్రంథముల నిలయమే గ్రంథాలయము. ఇది చరాచర భేదముచే ద్వివిధము. విద్వాంసులే చరగ్రంథాలయములు. వారి విజ్ఞాన ఫలంబగు గ్రంథములు అచర రూపము. ఈరెండు అన్యోన్యసహాయముచే శోభిల్లును.

గ్రంథాలయము, గ్రంథములు పాఠకులు పాలకుళను మూడంగములు గలిగియుండును.

జీవులు సకలదుఃఖనిదానమగు అజ్ఞానమును బారద్రోలి నిరతిశయానంద రూపమగు బ్రహ్మజ్ఞానమును ప్రకాశింప జేయుటయే యీ యుద్యమలక్ష్యము. ఇట్టి లక్ష్యమును దృక్పథమునం దిడుకొని తత్పాలకులు ప్రజలలో జ్ఞానసాధనమగు చిత్తశుద్ధిని చేకూర్పవలెను. ఇట్టిసేవ గ్రంథములకంటె గ్రంథాలయభాండాగారి సేవానైపుణ్యముపై నాధారపడియున్నది.

ప్రతి ఆదివారము ఉపన్యాసములద్వారా విద్యార్థులకు నియమితకాలాచరణము, బ్రహ్మచర్యము భక్తి, సత్యము, శాంతము, స్థైర్యము, పరోపకారము, అహింస, ఆత్మవిశ్వాసాదిసద్గుణములు బోధించవలెను. పురాణగాథలచే బాలబాలికల నిర్మలహృదయ ఫలకములందుత్తమభావముల నాటవలయును. 'భావానయనే ద్రవ్యానయనం' అను న్యాయానుసారము భావానుగుణసిద్ధి కలిగితీరును.

విద్యార్థు లుపన్యాసాదిశ్రవణముచే గ్రహించిన విషయములు స్వయముగ ఉపన్యసించుట ఉపయు

క్తము. ఇట్లు శ్రవణమననములచే గ్రహించిన జ్ఞానమును ఆచరణలోనికి మార్చిన అమృతమగును. గ్రంథాలయము లిట్టివారిని తయారుచేయుట తత్పాలకుల ఆదేశమువలన గాక ఆచరణమూలముననే. ఆచరణనిరతులగు పాలకులు పాఠకులుగూడ విద్యుద్దృహములవలె తమజ్ఞాన దీపికలచే దేశమంతయు తేజోమయం బొనర్పగలరు. అదియె యీ యుద్యమ సాఫల్యము.

ఈదృశ మహాసభలలో విద్యార్థులలో నుపన్యాసాది పోటీలు పెట్టి ప్రోత్సహించుట యుద్యమాభివృద్ధి హేతువు.

గ్రంథాలయ రూపిణియగు సరస్వతి యీయుద్యమ సేవకుల శక్త్యుత్సాహము లుద్దీప్తములుగా నొనర్చుగాత !

శ్రీమతి బొడ్డపాటి సీతాబాయమ్మగారు (బెజవాడ) ఉపన్యసించుచు ముఖ్యముగా స్త్రీలకు విద్యగఱపవలె ననియు, వారిని విద్యావతులుగ జేసినగాని దేశాభివృద్ధి కానేరదనియు, ప్రతి గ్రంథాలయమందును స్త్రీలను పెక్కుమందిని చేర్చుకొని గ్రంథాలయమువలని ప్రయోజనమును పొందునట్లుగ వారికిగూడ ప్రచారప్రబోధపద్ధతులు నేర్పవలసినదనియు చెప్పిరి. స్త్రీలు గ్రంథాలయోద్యమమున జేరుటకు పురుషులు కూడ తోడ్పడవలెననియు, బహిరంగముగా నొకమాట చెప్పుచు, చాటున భార్యలను గ్రంథాలయములకు రానీయకపోవుట తానెరుగుదుననియు, ఇట్టి సాకులు మాని నిజమైనసేవను స్త్రీలుకూడ చేయునట్లు పురుషులు తోడ్పడవలయుననియు ఆమె చెప్పెను.

పురుషుడును స్త్రీయు ఒకరి కొకరు తోడ్పడి గ్రంథాలయోద్యమమునకును, విద్యాభివృద్ధికిని దేశోన్నతికిని తోడ్పడవలెననియు ఆమెచెప్పెను.

బ్రహ్మశ్రీ కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు పురాణములసంగితి, వానియొక్క ఔన్నత్యమును, ఉదాహరణములతో వివరించుచు ఇట్లు చెప్పిరి. "పురాణములను మిథ్ (myth, mythology) అని తృణీకరించుచున్నారు. మన పురాణములను చదివి మన సాంప్రదాయచరిత్రలు చదివినపుడు అందలి స్వారస్యమును అందలి మంచిని గొప్పతనమును మనము గ్రహించినవార మగుదుము. ఇతరదేశ పురాణములను విదేశ చరిత్రలను చదివిన అట్టి మంచిఫలము కలుగనేరదు.

విషయమును సరిగా తెలిసికొనలేక పురాణములను నిందింతుము. పురాణములందు అన్నినీతులు, రాజనీతులుకూడ కలవు. అట్టివానిని చక్కగా పఠించి తెలిసికొని ఆచరణలో బెట్టవలెను. పురాణముల జక్కగా పఠించి చక్కగా అర్థమును గ్రహించి వాటిని గౌరవించవలెను."

శ్రీ కొత్తపల్లి సూర్యారావుగారు పాండురంగమాహాత్మ్యమున పుస్తకభాండాగార సందర్భమును పఠించుచుండ శ్రీ కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు అర్థమును వినిపించిరి. ఒక స్త్రీరత్నము పుస్తకభాండాగారమును కాపాడి అనుకూలముగా నుంచుటను గురించి అందు చెప్పబడెను. ఈ విధముగా పూర్వకాలమున ఇంటింటికి గ్రంథాలయములు గలవనియు, అందరి యుపయోగమున నున్నవనియు చెప్పి తిరుపతిగ్రంథాలయమును గురించి చెప్పిరి.

పిదప శ్రీమాన్ యియ్యుణ్ణి అప్పలాచార్యులుగారు సభ్యులానందించునట్లు వీణాగానమును వినిపించిరి.

అంతటితో మొదటిదినము సభ ముగింపబడెను.

తిరిగి 22 వ తేదీ మధ్యాహ్నము 3 గంటలకు సభ సమావేశమయ్యెను. శ్రీ వేమవరపు రామదాసుపంతులుగారు అధ్యక్షత వహించిరి.

శ్రీ వేమవరపు రామదాసు పంతులుగారి అధ్యక్షకోపన్యాసము.

ఆంధ్రదేశములో ఉద్యమము

36 సంవత్సరములక్రిందట అనగా 1898 సం॥ లో పశ్చిమ గోదావరిజిల్లా యందలి కుముదవల్లి గ్రామములో ఆంధ్రనాయకమణియు, దేశభక్తుడును నగు కీ॥ శే॥ గంజాము వెంకటరత్నం పంతులుగారిచే మన మొదటి గ్రంథాలయము స్థాపింపబడెను. ఇప్పటికిని ఈగ్రంథాలయము మంచిస్థితిలో నున్నది. దానికిమంచి భవనము, కొన్నివేల ఉత్తమ గ్రంథములుగలవు. గ్రామమునకు ఈ గ్రంథాలయము నిరుపమానసేవ గావించుచున్నది. ఈ గ్రంథాలయ మితరగ్రామములలో నేర్పరుపబడగల గ్రంథాలయములకు ఆదర్శప్రాయముగాగూడ నున్నది.

ఆంధ్రగ్రంథాలయోద్యమ నాయకులును అందును నామితుల్రు, కీర్తిశేషులైన ఎస్. వి. నరసింహశాస్త్రి గారి వంటివారల ఉత్సాహాతిశయముచేతను, కార్య దీక్షచేతను, గ్రంథాలయోద్యమము ఆంధ్రదేశ మంతటను వెల్లివిరిసినది. గ్రంథాలయోద్యమాభివృద్ధికి ఆంధ్రదేశము తగువిధమున కృషిచేసినది. 10 సంవత్సరములక్రిందట ఆంధ్రరాష్ట్రములో 400 గ్రామ గ్రంథాలయము లుండినట్లు లెక్కవేయబడినది. ఇప్పుడవి ఇంకను అభివృద్ధి జెందియున్నవి. వీనిలో కొన్ని, గ్రామ గ్రామములకు బోయి ప్రజలకు పుస్తకము లందిచ్చి జ్ఞానాభివృద్ధిచేయుచుండెను. వీనిలో కొన్ని, ప్రత్యేకముగా స్త్రీజనాభివృద్ధి కేర్పడియుండెను. గ్రంథాలయములు కేవలము గ్రంథములుండు తావులు మాత్రమేగాక జనసామాన్యమునకుజ్ఞానజ్యోతిని ప్రసాదించు సంస్థ లని గూడ మొదటినుండియు ఆంధ్రులు తలచుచుండిరి. పాఠశాలలు, కొందరు బాలబాలికలకు మాత్రము విద్య నొసంగగలవు. కాని భారతదేశప్రజలలో నత్యధిక సంఖ్యాకులు నిరక్షరాస్యులు. ఈనిరక్షరాస్యతను పోగొట్టుటకు గ్రంథాలయములు సాధన భూతములు కాగల వని యిప్పుడు గ్రహింపబడినది. పశ్చిమదేశము లందువలె గ్రంథములు చదివి జ్ఞానము పొందదగినవారు మనదేశములో చాలతక్కువ. ఏల యనగా చాల మందికి అక్షరజ్ఞానమే లేదు. కావున ఆంధ్రగ్రంథాలయోద్యమనాయకులు ప్రజలకు జ్ఞానాభివృద్ధి కలుగజేయుటకు జాతీయములగు పద్ధతుల నవలంబించుచున్నారు. గ్రామ పౌరాణికుడు, ఇంటింటికి తిరుగు హరిదాసులు, సంగీతనాటకులు మున్నగువారు అక్షరజ్ఞానము లేని గ్రామస్థులకు జ్ఞానదానము చేయుటకు ఉపయోగపడగలరు. ప్రజల విద్యాభివృద్ధికి దేవాలయోత్సవములు, తీర్థయాత్రలు, వీధినాటకములు, గ్రామములో రామభజనలు మున్నగునవి చక్కగా ఉపయోగ పడగలవు. దేశభాషలలో రాజకీయ సాంఘిక, ఆర్థికవాఙ్మయమును సృష్టించుటకు విజ్ఞానులను ప్రోత్సహింపవచ్చును. ఆయా ప్రదేశములందలి ప్రజలకు జ్ఞానము ప్రసాదించుటకై ప్రదర్శనములు, మ్యాజిక్ లాంతరులు మున్నగువాని నెక్కువగా నుపయోగింప వచ్చును. చదువగల వారికి ఉత్తమ గ్రంథములను తెప్పించి గ్రంథాలయములలో నుండి, యిచ్చుచుండుట మాత్రమేగాక, అక్షర జ్ఞానము లేనివారికి పై పద్ధతుల మూలకముగా గ్రంథాలయ సంఘములు ఉపయోగ పడదగును. ఆంధ్ర గ్రంథాలయోద్యమ నాయకులు ఈపద్ధతులను, ఉద్దేశములను మనమునం దిడుకొని కృషి సల్పుచున్నారని తెలిసికొనుటకు సంతసమగుచున్నది. మన గ్రంథాలయములను ప్రతిగ్రామమునందును మంచిపద్ధతులపై స్థాపించుటయే ముందు మన ముఖ్యకర్తవ్యమై యున్నది.

గ్రంథాలయములయొక్క లాభములను గురించియు వాని నేర్పరచినపుడు పద్ధతులను గూర్చియు నేను ఇచ్చట వివరింపదలపలేదు. మద్రాసు ధర్మగ్రంథాలయచట్టము విమర్శించి, పరీక్షించుటయే నాయుద్దేశమై యున్నది.

ధర్మగ్రంథాలయ చట్టము.

1930 సంవత్సరములో ఎస్. ఆర్. రంగనాథను గారు విశ్వవిద్యాలయ గ్రంథభాండారిగా నుండెను. అప్పుడు ఆయన రచియించిన "గ్రంథాలయశాస్త్రము యొక్క ఐదుసూత్రములు" అను గ్రంథములో నొక ఆదర్శప్రాయమగు ధర్మగ్రంథాలయచట్టమును వ్రాసి మొదటి అఖిల ఆసియావిద్యావిషయిక సభవారికి నివేదించెను. అప్పుడు ఈ రాష్ట్రమున ధర్మగ్రంథాలయచట్ట ముండవలె నను ఉద్దేశము కలిగినట్లు తోచుచున్నది. అది పాశ్చాత్యదేశములయందలి గ్రంథాలయ శాసనములను బోలియుండెను. 1933 సం|| 11 వ అనధికారబిల్లు (మద్రాసు శాసనసభ్యులగు బషీర్ అహమ్మద్ సయ్యదుగారి ధర్మగ్రంథాలయచట్టము) రంగనాథముగారి పుస్తకములోని చట్టమును బోలియున్నది. ఇది 1933సం|| అగస్టు 15 వ తారీఖున ఫోర్టుసెంటుజార్జి గెజెటులో ప్రకటింపబడి యిప్పుడు ఉపసంఘమువారి విచారణయందున్నది. ఈబిల్లును ఆల్ ఇండియా పబ్లిక్ లైబ్రరీ అసోసియేషనువారుపరీక్షించి,విమర్శించిరి. ఈసంఘము యొక్క అధ్యక్షులగు డా. వంగల శివరామగారు తనసంఘమువారి విమర్శనాధారము చేసికొని ఒక సవరింపబడిన ఆక్టును ప్రచురించెను. సవరణలకు ఆయన వివరముగూడ వ్రాసియుండెను.

మద్రాసుబిల్లుకు చేర్చబడిన ఉద్దేశములు, కారణములనుబట్టి చూచినచో దాని ముఖ్యోద్దేశములు రెండుగా నగుపడుచున్నవి. ఒకటి గ్రంథాలయముల నభివృద్ధిపరచుటకును, వీనిని నియమించుటకును నేర్పాటులు చేయుట. రెండవది వయోజనులలో నిరక్షరాస్యతను బాపుటకు తగిన యేర్పాటులు చేయుట.

మద్రాసుబిల్లులో రంగనాథంగారి ఆక్టునందుగల ముఖ్యసెక్షనులు కనబడుటలేదు. గ్రంథాలయముల

నేర్పరచుటకును, వీరికి ద్రవ్యసహాయము చేయుటకును రంగనాథముగారి ఆక్టులో మంచియేర్పాటు లుండెను. రంగనాథముగారి ఆక్టునందలి 9 వ సెక్షనులో స్థానిక లైబ్రరీ అధికారులు తమ శక్త్యనుసారము ద్రవ్యము నిచ్చుటకు నేర్పాటులు కలవు. 12 వ సెక్షనులో లైబ్రరీని పరిపాలించుటకు నేర్పాటు కలదు. 17 వ సెక్షనులో ప్రభుత్వమువా రివ్వదగిన మొత్తమువిషయము కలదు. కావున రంగనాథముగారి చట్టములో ప్రభుత్వమువారు ద్రవ్యసహాయము చేయవలసినటులు గాను, గ్రంథాలయాధికారులు గ్రంథాలయములను పరిపాలించు నట్టివారుగా నుండవలసినట్లును కలదు.

మద్రాసుబిల్లునందలి ముఖ్యషరతులు

రంగనాథం గారి ఆక్టునందలి షరతులు మద్రాసు బిల్లులో లేవు. ఈ బిల్లు ప్రకారము ఒక క్రొత్త గ్రంథాలయము సైనను నేర్పరిచి, దాని నిర్వహించు బాధ్యత ప్రభుత్వమువారిమీద గాని వా రేర్పరచు ఆసంఖ్యాకములగు ఉపసంఘములమీద గాని శాసన పూర్వకముగా నుండదు. ఒక భవనమును నిర్మించుటకును, దానిలో కుర్చీలు బల్లలు మొదలైనవాని నేర్పరచుటకును, బంట్రోతును నియమించుటకును, విరాళము నంగీకరించుటకును, గ్రంథాలయాధికారుల కది అధికార మొసంగుచున్నది. ఈ షరతు రంగనాథముగారి ఆక్టునుండి వ్రాయబడినది. ప్రభుత్వమువారును, స్థానిక సంస్థలును గ్రాంటులిచ్చు విషయమై బిల్లులో సెలెక్టు కమిటీవారు క్రొత్త షరతు కలుపుచున్నారని ఒకటి రెండు రోజులక్రిందట వెలువడిన ప్రభుత్వప్రకటన తెలుపుచున్నది. దీని నిజస్వరూపము తెలియదు. విధిగా గ్రాంట్లనివ్వవలెనో లేక గ్రాంటులనిచ్చుట ఐచ్ఛికమో తెలియదు. బిల్లులోని తక్కినభాగమును రెండు విధములుగా విభజింపవచ్చును. ఒకటి ప్రావిన్షియల్ లైబ్రరీ కమిటీయని పిలువబడు కేంద్ర గ్రంథాలయ నిర్వాహక వర్గమునకును (6 వ సెక్షను) స్థానిక గ్రంథాలయ సంస్థలకును, (ఏడవసెక్షను) స్థానికగ్రంథాలయ కమిటీలు (తొమ్మిదవసెక్షను) జాయింటుకమిటీలకు, (18 వ సెక్షను) రీజియనలు కమిటీలకు, (14 వ సెక్షను) మున్నగువాని నిర్మాణమునకు సంబంధించియున్నవి. రెండవ భాగము గ్రంథాలయముల నియమమునుగూర్చియు, వాని లెక్కలతనిఖీ, నివేదికలు, ఆడిటు మున్నగు వానికి సంబంధించినవి.

దీనిలో మూడవభాగముకూడ నున్నదని చెప్పవచ్చును. నేరములు, వానివిచారణ, వానికి శిక్ష మున్నగునవి ఈ భాగమునకు జెందినవి. గ్రంథాలయములను నియమించుట సరిగా జరుగదేమో యనుభయమున గ్రంథాలయాధికారులు బైలాలుచేసి తమయిష్టమువచ్చినట్లు గ్రంథాలయములను ఉపయోగించుట, తమ యిష్టమువచ్చినట్లు ప్రజలను చేర్చుకొనుట మున్నగువాని విషయమై బైలాలు చేయవచ్చునని తెలుపబడుచున్నది. (19 వ సెక్షను) తమయిష్టమువచ్చిన గ్రంథములు వారు తెప్పించుకొనవచ్చును. ఈ విషయషరతుండుట వలన జాతీయవాఙ్మయము నిషేధింపబడవచ్చును. రాజకీయ వాఙ్మయము, ఖద్దరుమీద పుస్తకములు అటావాఒడంబడిక, బొంబయి లాంకషైరు ఒడంబడికను ఖండించు గ్రంథములు నిషేధంపబడవచ్చును. ఇప్పుడుగూడ గ్రామ గ్రంథాలయ పుస్తకములను తెప్పించుకొననిచ్చుటలో పోలీసు సర్కిల్ ఇనస్పెక్టరుకును, వారి యనుచరులకును సెక్కవఅధికారము లివ్వబడియున్నవని చాలమందికి తెలియదు. ఈ గ్రంథాలయములలోనికి ఖద్దరు, గాంధిటోపి ధరించువారికి ప్రవేశము లేకుండ పోవచ్చును. ఇట్టివారు మీతూర్పుగోదావరి జిల్లాల యందలి రాజమార్గముల మీదికి గూడ రానివ్వబడలేదని మీకు తెలియును.

నేరములకు శిక్షలు చాలా తీవ్రముగా నున్నవి. ఈ శాసనమునకు గాని, దానిక్రింద చేయబడు నిబంధనలకుగాని వ్యతిరేకముగా చేయువారిని క్రిమినల్ ప్రొసీజరు కోడ్డు 22 అధ్యాయము ప్రకారము విచారించి శిక్షించుటకు అధికార మివ్వబడుచున్నది.

ఈ గ్రంథాలయముల మీదను కమిటీల మీదను ఇనస్పెక్టర్ ఆఫ్ లోకల్ బోర్డు అండ్ మునిసిపాలిటీలు ప్రధానాధికారిగా నుండును. ఈ యనయే పబ్లిక్ లైబ్రరీల డైరెక్టరు. గ్రంథాలయము లన్నియు అన్ని విషయము లందును ఈ ఉద్యోగియునికి యితనిద్వారా లోకల్ సెల్ఫుగవర్నమెంటు మంత్రికిని బాధ్యత వహించువారుగా నుందురు.

ఈ క్రొత్త సెంట్రల్ లైబ్రరీ అధికారవర్గము క్రింద పనిచేయు స్థానిక లైబ్రరీ అధికారవర్గములు 100 గా నుండును. వీనిలో 50 మునిసిపల్ సంఘములు. వీనిలో సగము అనగా 25, జిల్లాబోర్డులు. తాలూకాబోర్డులు రద్దుచేయునప్పు డివి 50 కాగలవు. ఈ స్థానిక స్వపరిపాలనా సంస్థల లైబ్రరీ సంస్థలలో నొక్కొక్క దానికి

ఒక్కొక్క లైబ్రరీ ఉపసంఘ ముండును. కావున 100 స్థానిక అధికారవర్గములు, 100 కమిటీలు కలసి అజమాయిషీ చేయు సంస్థలు 200 కాగలవు. ఇవి అజమాయిషీ చేయుట కెన్ని గ్రంథాలయము లున్నవి?

ఈబిల్లులో క్రొత్త కేంద్ర లైబ్రరీఅధికార వర్గము. అనగా ప్రొవిన్షియల్ లైబ్రరీకమిటీ యేర్పరుపబడుచున్నది. దీనికి ధర్మగ్రంథాలయములు నడుపువాడుకార్యదర్శి. విద్యాశాఖామంత్రి అధ్యక్షుడు. ఈ సంస్థఆయాగ్రామములలో స్థానికసంస్థలచే స్థాపింపబడు గ్రంథాలయములను మాత్రమేగాక, పరపతిసంఘముల చేతను, ప్రజలచేతను స్థాపింపబడు గ్రంథాలయముల మీదగూడ అధికారము కలిగియుండును.

గ్రంథాలయ శాఖ - లైబ్రరీ పన్ను

బిల్లు లైబ్రరీశాఖ నొకదానిని స్థాపించుచున్నది. ఈశాఖను లైబ్రరీస్ డైరెక్టరు ద్వారా ప్రభుత్వము వారు నిర్వహింతురు. ప్రభుత్వశాఖవలన ప్రజల స్వాతంత్ర్యము, గ్రంథాలయ స్థాపనాశక్తి నశించును. క్రొత్తశాఖ లనగా క్రొత్త పన్నులు విధింపబడును. ప్రభుత్వమువారి యంగీకారమున ఈస్థానిక గ్రంథాలయ సంస్థలు క్రొత్తపన్నులు విధింపవచ్చునను షరతువిర్పరుపబడినది. ఈ క్రొత్త పన్నులు చాలు అసహ్యాకరములని వా. యుద్దేశము. చాలదేశములలో వ్యవసాయదారులిచ్చు పన్నులో కొంతభాగము గ్రామ స్వపరిపాలనకున కివ్వబడుచున్నది, కాని మద్రాసు రాజధానిలో భూమిసిస్తు ప్రభుత్వమువారికి జెందుచున్నది. క్రొత్త పన్నులను విధించి, ఆ పన్నులను గ్రంథాలయేత్యాది సౌకర్యములకై స్థానిక సంస్థల కిచ్చుచున్నారు. ఈ సౌకర్యములలో వయోజన విద్యయొకటి. ప్రతిచోట ఉచితనిర్బంధవిద్యకై యాందోళనము జరుగుచుండగా ప్రజాసామాన్యపు విద్యను ప్రోత్సహించు గ్రంథాలయ నిర్వహణమునకు క్రొత్తపన్నులు విధించుట అశ్చర్యకరముగా నున్నది. ఈపన్నులభారము వ్యవసాయదారులపైబడును. అత డిచ్చినదానికి ఈబిల్లుద్వారా వచ్చు ప్రతిక్రియ యేమియు నుండదు. పట్టణములలో నిదివరకే పన్నులు భారముగా నున్నవి. క్రొత్తపన్నుల వలన భారము మరింత హెచ్చును.

నిరక్షరాస్యతను బాపుట

నిరక్షరాస్యతను బాపుటకు ఆయాతావుల నొక విచారణసంఘము నేర్పరుచుట బిల్లునందలి 17 వ క్లాజు, (1) సబ్ క్లాజులో ఏర్పాటు కలదు. ఈవిచారణ జరిపినమీదట ఆయా తావులలో నెంతవరకు నిరక్షరాస్యతకలదో తెలిపి, దానిని బాపుట కెంతధనము కావలెనో తెలియచేయవలెనట. కాని ప్రభుత్వము వారి యంగీకారము లేనిది ధనము మంజూరు చేయరాదట. ఇంకేవిధమున స్థానికలైబ్రరీ సంఘములు నిరక్షరాస్యతను బాపగలవో తెలియరాదు. ఈ క్లాజు నిరర్థకమని వేరుగా చెప్పనవసరము లేదు.

అఖిలభారత లైబ్రరీసంఘము వారిబిల్లు

అఖిలభారత గ్రంథాలయసంఘమువారు మద్రాసు బిల్లును మార్చ ప్రయత్నించిరిగాని, ఆ ప్రయత్నము నిరర్థకమైన దని వాయుద్దేశము. మద్రాసుబిల్లుకు క్రొత్తదేమియు సంఘమువారు కలుపలేదు. ఆ బిల్లులో అనర్థదాయకమైనదాని నేమియు తీసివేయలేదు. సంఘమువారి సవరణలకు వ్రాయబడిన వివరణములో మద్రాసు బిల్లు భారతప్రజల అచారవ్యవహారములను, అలవాటలను పరిగణింపక పాశ్చాత్యదేశములయందలి ఆచారవ్యవహారముల ననుసరించుచున్నదని వ్రాయబడియున్నది. ఆంధ్రదేశమునకు, కేరళ, తమిళనాడు, కన్నడదేశములకు 4 గ్రంథాలయ సంఘముల నేర్పరచి, తద్వారా బిల్లునకు జాతీయత చేకూర్ప సంఘమువారు తలంచుచున్నారు. మద్రాసు నగరమునకు 'ప్రొవిన్షియల్ లైబ్రరీ కమిటి, యుండవలెనని వా రనుచున్నారు. వానికి అనుబంధముగా ప్రొవిన్షియల్ లైబ్రరీ కమిటీవారు ఏర్పరుచు సంస్థ లుండవచ్చును. వీరు చేసిన మార్పులలో మంచివి రెండు కలవని సంఘమువా రనుచున్నారు. (1) మునిసిపల్ కౌన్సిళ్లకు, జిల్లాబోర్డులకు గ్రంథాలయములపై అధికారములు లేకుండచేయుట. (2) లోకల్ బోర్డులు, మునిసిపాలిటీల ఇనస్పెక్టరు గ్రంథాలయ శాఖాధికారిగా నుండుటకు బదులుగా మేరా పబ్లిక్ లైబ్రరీ లైబ్రేరియను అధికారిగా నుండునట్లు చేయుట, కాని ప్రభుత్వమువారు అట్లు చేయుటకు అడ్డుపెట్టినది బిల్లునందేమియు లేదు. క్రొత్తగా గ్రంథాలయములను పెట్టి, నిర్వహించుటకు సంఘమువారి బిల్లులో నేర్పాటు లేమియు లేవు. ఈబిల్లు ననుసరించి అధికారుల పెత్తనము ఎంతమాత్రమును తగ్గుటలేదు. క్రొత్త పన్నులను విధింపకుండ చేయుటకు బిల్లులో నేర్పాటేమియు లేదు. తక్కిన అన్నివిషయములలోగూడ మద్రాసుబిల్లుకు అఖిలభారత గ్రంథాలయసంఘమువారి బిల్లు నకలుగ నున్నదిగాని వేరు కాదు.

ఆంధ్రదేశమునందు లైబ్రరీ మహాసభలలో మద్రాసు బిల్లును ఖండించి సంఘమువారిబిల్లును శ్లాఘించినందు వలననే యింతదూరము చెప్పవలసివచ్చెను. సంఘము వారి సవరణబిల్లువిషయమై సరియైనసంగతి సందర్భములు తెలియకపోవుటచే నిట్టి పొరబాటు జరిగెనని నా యభిప్రాయము. సంఘమువారిబిల్లు అన్నివిధముల మద్రాసు బిల్లును అనుసరించుచున్నది. అందలి లోపములను తీసివేయుట లేదు. బిల్లులో భాషననుసరించి ౪ భాగములుగా రాజధానిని విభజించుటవలన మాత్రమే ప్రయోజనమేమియు నుండదు. ఈ అఖిలభారతగ్రంథాలయసంఘము వారిచే సవరింపబడినబిల్లు ఉద్యమాభివృద్ధికితోడ్పడుటకు బదులు ఉద్యమనాశమునకు తోడ్పడును. కావున ఆంధ్రగ్రంథాలయ సంఘమువారును, ఆంధ్రగ్రంథాలయ మహాసభవారును అనర్థదాయకమగు మద్రాసు బిల్లును రద్దుచేయుటకు ప్రయత్నింపవలెను.

ముగింపు

జనసామాన్యముయొక్క వయోజన విద్యాభివృద్ధికి గ్రంథాలయములు ముఖ్యసాధనములు. కావున ప్రభుత్వమువారును స్థానిక, మునిసిపల్ సంఘములును గ్రంథాలయోద్యమాభివృద్ధికి బాధ్యత వహింపవలెను. అట్టి ప్రధాన ధర్మమును మరచినచో బిల్లు ప్రయోజనకారిగాదు. కొద్దిమంది చేతులనుండి అధికారము ప్రజాబాహుళ్యమునకు సంక్రమించుస్థితిలో వందరు విద్యావంతులు కావలసిన యగత్యము కలుగుచున్నది. ప్రతివారును చదువుకొని విద్యావంతులు కావలసిన యవసరము కలదు. వారికి విద్య నేర్పవలసిన బాధ్యత ప్రభుత్వమువారిపై కలదు. ప్రజలయజ్ఞానాంధకారమును బాపువారే దేశసేవచేసి స్వరాజ్యప్రాప్తికి తోడ్పడగలరు.

రామదాసుపంతులుగారు వారి యధ్యక్షోపన్యాసము చదివిన పిమ్మట కార్యదర్శి బులుసు సుబ్బారావుగారు సభకు రాజాలకపోతిమనియు, సభ జయప్రదముగా జరుగునని ఆశించుచున్నామనియు వచ్చిన ఉత్తరములను తంతివార్తలను చదివి వినిపించిరి.

తీర్మానములు.

పిమ్మట నీదిగువ వివరించిన తీర్మానములు అంగీకరింపబడినవి:—

1. కడచిన 15 సంవత్సరములనుండి ఆంధ్రపత్రికా సంపాదకులుగా నుండి ఆంధ్రదేశ ప్రజలలో దేశాభిమాన దేశగౌరవభావములు ప్రజ్వలించుటకు తమ శక్తి ప్రజ్ఞలను వినియోగించి దేశస్వాతంత్ర్యసంపాదనమునకై బయల్వెడలిన ప్రతియుద్యమమునకు దోడ్పడుచు కృతకృత్యు లయినట్టియు, ఆంధ్రగ్రంథాలయోద్యమోత్పత్తికి ముఖ్యకారకులలో నొకరగునట్టియు నేటివఱకు దానిపట్ల పరిపూర్ణాభిమానము చూపినట్టియు చల్లా శేషగిరిరావుగారి యకాలమరణమునకు ఈ సభవారు వగచుచు వారి కుటుంబమునకు తమ సానుభూతిని తెలుపుట కేకగ్రీవముగా తీర్మానించుచున్నారు.

శ్రీవారి పటముతో ఆంధ్రదేశమునం దున్న గ్రంథాలయము లన్నింటిని అలంకరింపజేయవలెనని యీ సంఘమువారు తీర్మానించుచున్నారు.

నరసింహదేవర సత్యనారాయణగా రుపపాదించిరి.

కళా వెంకటరావుగారు బలపరచిరి.

2. "గ్రంథాలయ సర్వస్వము" అను గ్రంథాలయోద్యమ ప్రచారక పత్రికను తిరిగి ప్రారంభించినందులకు ఈ సభవారు సంతసించుచు ఆ పత్రిక కందరును సహాయము చేసి నిలువబెట్టవలె నని ఈ సభవారు హెచ్చరించుచున్నారు.

అధ్యక్షులు తీర్మానము నుపపాదించిరి.

3. గ్రంథ భాండాగారియొక్క తరబీతుపరీక్షను ఆంధ్ర విశ్వవిద్యాలయమందు పెట్టుదు రని యీ సభవారు కోరుచున్నారు.

అధ్యక్షులు తీర్మానము నుపపాదించిరి.

4. మన రాజధానియందు నానాభాషలలో ప్రచురింపబడు గ్రంథముల పట్టికను దొరతనమువారు ఫోర్టుసెంటుజార్జి గెజటులో మూడునెలల కొకసారి ప్రచురించుటవలన ప్రజాబాహుళ్యమునకు లేశము లాభము కానరానందున, జిల్లా గెజెటులలో కూడ ప్రచురింపజేయునటుల ఈ సభవారు దొరతనమువారిని కోరుచున్నారు.

అధ్యక్షులు తీర్మానము నుపపాదించిరి.

5. ఆంధ్రభాషోద్ధరణకై పాటుపడిన వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్సు, వెంకటేశ్వర శాస్త్రులు గారియొక్క సేవను ఈ సభవారు ఉగ్గడించుచు వారికి నుచితరీతిని సన్మానము చేయుదు రని ఈ సభవారు హెచ్చరించుచున్నారు.

అధ్యక్షులు తీర్మానము నుపపాదించిరి.

6. గ్రంథాలయోద్యమమునకు నూతన వికాసమును ఉత్సాహమును కలిగించుటకుగాను 'గ్రంథాలయ మహోత్సవము' అను పేరున సంవత్సరమున కొకవారము దినములు పండుగ దసరాలో జరుపుటకును, అప్పుడు సరస్వతీపూజ, గ్రంథాలయభిక్షలు, ఉపన్యాసములు, ప్రదర్శనములు, ఊరేగింపులు, జరుపవలెననియు ఆంధ్ర దేశ గ్రంథాలయము లన్నిటిని ఈ సభవారు హెచ్చరించుచున్నారు.

అధ్యక్షులు తీర్మానము నుపపాదించిరి.

7. 1860 సం. నెం 21 వ చట్టప్రకారము రిజిస్టర్ చేయుటకు యివ్వవలసిన ఫీజును, గ్రంథాలయములకును, పఠనమందిరములకును, లేకుండ ఉచితముగా రిజిస్టరీ చేయించునటుల చట్టమును సవరించి వేయవలె నని ప్రభుత్వమువారిని సభవారు కోరుచున్నారు.

అధ్యక్షులు తీర్మానము నుపపాదించిరి.

8. చెన్నపురిలో నున్న, కనిమెరా లైబ్రరీవారి వలెనే, మన ఆంధ్ర విశ్వవిద్యాలయాధికారులును ఆంధ్రరాష్ట్ర గ్రంథాలయముల నన్నిటిని తమకు జేరికగా జేసికొని ఆయా గ్రంథాలయములకు వలయు గ్రంథములను బదులుగా నిచ్చిపుచ్చుకొనుటలు జరుపుటకై తమ సమ్మతిని దెలుపగలందులకు ఈ సభవారు కోరుచున్నారు.

కోపల్లె శివకామేశ్వరరావుగా రుపపాదించిరి.
వింజమూరి వెంకటలక్ష్మీనరసింహారావుగారు బలపరచిరి.

9. ముద్రాలయములలో ముద్రింపబడు గ్రంథములలో మూడేసి ప్రతులచొప్పున గైకొనుచు వానిని తమకు దోచినరీతిని పంపుచున్న దొరతనమువారిని నాల్గవ ప్రతికూడ గైకొనుచు నయ్యది యాంధ్రుల కుపయోగపడునట్లు ఆంధ్ర విశ్వవిద్యాలయ గ్రంథాలయమునకో ఆంధ్రసాహిత్య పరిషద్గ్రంథాలయమునకో పంపుచుండ గలందులకు దగిన శాసనముల నిర్మించుటకై విద్యాశాఖకు సంబంధించిన శాసనసభ్యులను ఈ సభవారు కోరుచున్నారు.

కోపల్లె శివకామేశ్వరరావుగా రుపపాదించిరి.
వింజమూరి నరసింహారావుగారు బలపరచిరి.

10. లోకల్ బోర్డ్సు సవరణచట్టములో తాలూకా బోర్డు గ్రంథాలయములను గ్రామపంచాయితులకు నిచ్చివేయుటచే తాలూకా ముఖ్యపట్టణములలో నున్న గ్రంథాలయములకు తగిన చేయూత లభించదని ఈసభవా రభిప్రాయపడుచు, తాలూకా ముఖ్య పట్టణములలో నున్న బోర్డుగ్రంథాలయముల నైనను జిల్లా బోర్డుల క్రిందనే యుంచవలెనని గాని లేక ఆ స్థానముల గల పంచాయితీలు వానిని సమర్థతతో నిర్వహించుటకు ఆక్టులో నేర్పాటు చేయవలెనని ఈ సభవా రభిప్రాయపడుచున్నారు.

11. ప్రతి గ్రంథాలయమందును స్త్రీలు హెచ్చుగా సభ్యులుగా చేరి గ్రంథాలయోద్యమవ్యాపనము స్త్రీలయందు గూడ విశేషముగా కలుగు లాగున చేయవలెననియు ప్రజల నీ సభవారు హెచ్చరించుచున్నారు.

ప్రతి గ్రంథాలయమందును అథమము అయిదుగురైనను స్త్రీలు సభ్యురాండ్రుగా చేరులాగునయును, పరిపాలనాసంఘమం దిద్దరైన స్త్రీ సభ్యురాండ్రుండులాగునను, గ్రంథాలయ పరిపాలకులు ప్రోత్సహించెదరని ఈ సభవారు కోరుచున్నారు.

శ్రీమతి బొడ్డపాటి సీతాబాయమ్మగా రుపపాదించిరి. శ్రీమతి వల్లూరి సుబ్బమ్మగారు బలపరచిరి.

అయ్యంకి వేంకటరమణయ్యగారికి "గ్రంథాలయోద్ధారక" బిరుద సమర్పణము.

12. గ్రంథాలయోద్యమమునకు జనకులై సర్వవిధముల తమ ధనమును శరీరమును బుద్ధిని సదా యీ యుద్యమవ్యాపికే వినియోగించుచు ఆంధ్రదేశాభ్యుదయమునకు పాటు పడుచున్న శ్రీ అయ్యంకి వేంకటరమణయ్యగారి కృషిని గురించి ఈ సభవా రభినందించుచు వారికి 'గ్రంథాలయోద్ధారక' అను బిరుదము నొసంగుచున్నారు.

దుగిరాల. సూర్యప్రకాశరావుగా రుపపాదించిరి. దివాన్ బహద్దరు సి. రంగనాయకులు నాయుడు (రిటైర్డు జిల్లాజడ్జి) గారు బలపరచిరి. పాలూరి రామారావు (రిటైర్డు జిల్లామునసబు) గారు కూడ బలపరచిరి.

బిరుదసమర్పణ సమయమున శ్రీ వేంకటరమణయ్యగారికి ఖద్దరుశాలువను గప్పి బహూకరించిరి.

16 వ ఆంధ్ర దేశ గ్రంథాలయ మహాసభ

కాకినాడ



గ్రంథాలయ ప్రదర్శనమునం దొకభాగము

గ్రంథాలయ ప్రదర్శనమునందు మరియొకభాగము

16వ ఆంధ్ర దేశ గ్రంథాలయ మహాసభ, కాకినాడ.

గౌరవమును పొందిన

యాతగిరి లక్ష్మీ వేంకటరమణగారు

"గ్రంథాలయోద్ధారక"

బిరుదమును పొందిన

అయ్యంకి వేంకటరమణయ్యగారు

13. గ్రంథ భాండాగారికులకు కావలసిన తరిబీదు నిచ్చుటకై ఆంధ్రదేశ గ్రంథాలయ మహాసభ వారిచే నియమితమైన "తరిబీదు" సంఘమువారి ప్రణాలిక ననుసరించి రాబోవు జూను నెలయందు శిక్షాశిబిరమును స్థాపించవలసినదని ఈ సభవారు తీర్మానించుచున్నారు.

ఈ శిబిరమునకు ఆంధ్రదేశమందున్న వివిధ గ్రంథాలయములనుండియు, పాఠశాలల నుండియు స్థానిక సంస్థల నుండియు, తదితర సంస్థల నుండియు, తరిబీదును పొందుటకై తగిన ప్రతినిధులను పంపుదు రని ఈ సభవారు కోరుచున్నారు.

ఈ శిబిరమునకు కావలసిన ఏర్పాటులు చేయుటయందును, శిక్షణ నిచ్చుటయందును కావలసిన సహాయము చేయుటకై ఆంధ్ర విశ్వవిద్యాలయమువారిని ఈ సభవారు ప్రార్థించుచున్నారు.

అయ్యంకి వెంకటరమణయ్యగారు ప్రతిపాదించిరి.

మండపాక రంగయ్యనాయుడుగారు బలపరచిరి.

14. మద్రాసు పబ్లిక్ లైబ్రరీబిల్లు చాల నష్టదాయకమైనందువలనను, వృద్ధి నాటంకపరచునదిగా నుండుటవలనను, ఆ బిల్లును చట్టము చేయకూడదని శాసనసభ్యులని సభవారు కోరుచున్నారు.

లైబ్రరీ డిపార్టుమెంటు తమ స్వాధీనములో నుంచుకొని ప్రభుత్వమువారు ఇన్స్పెక్టరు అఫ్ లోకల్ బాడీస్ చేత నడిపించుటను, లైబ్రరీలకు క్రొత్తగా పన్ను విధించుట కేవలము అన్యాయమని యీసభవారు తీర్మానించుచున్నారు.

మండపాక రంగయ్య నాయుడుగారు, ఉపపాదించిరి.

అయ్యంకి వెంకటరమణయ్యగారు, శ్రీమతి వేముగంటి పాపాయమ్మగారు బలపరచిరి.

15. వ ఆంధ్రదేశములో నున్న గ్రంథాలయోద్యమమును గూర్చి అనంతమైన చెలిసికొనకుండ ఆంధ్రదేశమందు వందల కొలదిగల గ్రంథాలయములు పెక్కువత్సరములనుండి జగద్విఖ్యాతముగ పనిచేయుచుండుటను గమనింపజాలక, ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమము యొక్కయు గ్రంథాలయముల యొక్కయు ప్రత్యక్ష భంగమగునటుల "మద్రాసు గ్రంథాలయసంఘము" వారు నూతనముగా ప్రచురించిన "గ్రంథాలయశాస్త్రముయొక్క అయిదు చట్టములు" (The five laws of Library) అను గ్రంథమునందు ఆంధ్రదేశమందలి గ్రంథాలయోద్యమమును గురించి వ్రాయుచు ఆంధ్రదేశమందు గడచిన పదిసంవత్సరముల ఆఖరున గ్రంథాలయములకు సుభిక్షమైన పంట పండినది. కాని కొంతవరకు రాజకీయోద్యమమునందు కలిసిపోయి దానియొక్క విపర్యయమువలన అణగిపోయి క్రమముగా నశించుచున్న కొన్ని శేషములను మాత్రము మనము చూచుచున్నాము" We see a few decaying remnants of a bumper crop of libraries that shot forth at the close of the last decade in the land of the Andhras, but soon got strangled, partly as a result of the vicissitudes of the political movement with which they got intertwined అని అప్రస్తుతముగా వ్రాసినందులకు ఈ సభవారు మిక్కిలి గర్హించుచు, అన్యాయముగ వ్రాసిన పదరువాతను తమగ్రంథమునుండి తీసివేయవలసినదని మద్రాసు గ్రంథాలయసంఘమువారిని ఈ సభవారు కోరుచున్నారు.

నరసింహదేవర సత్యనారాయణగా రుపపాదించిరి.

వంగిపురపు జగన్నాథరావుగారు బలపరచిరి.

గ్రంథాలయసభ రాత్రి 7 గంటలకు ముగిసెను.

ప్రథమాంధ్రగ్రంథాలయ ప్రచారకుల సభ.

21-1-34 తేదీ ఉదయమున ఆంధ్రదేశ గ్రంథాలయప్రచారకుల సభ కాకినాడ అన్నదాన సమాజములో జరిగెను. ప్రార్థనానంతరము శ్రీయుత నేత్రకంటి యోగానందరావుగారు, ఎం. ఏ. బి. యల్. తమ అహ్వానసంఘాధ్యక్షోపన్యాసము నిచ్చిరి.

ఆహ్వానసంఘాధ్యక్షులు లగు
నేతృకంటి యోగానందరావు (ఎం. ఏ., బి. యల్) గారి యుపన్యాసము.

కాకినాడపట్టనముకూడ,తనస్వల్ప శక్తికొలది, తనచేత నైనంతవరకును, గ్రంథాలయోద్యమములోను సారస్వతాభివృద్ధికొరకును, పాటుపడుచున్నది. పిఠాపురం మహారాజావారి ఉదారభూరివిరాళమువలన జరుపబడు సంస్థలలో నొకటియగు ఆంధ్రసాహిత్యపరిషత్తు, మరియు శ్రీ పోలవరం జమీందారువారి దాతృత్వము వలన తూ. గోదావరిజిల్లా సంఘమువారిచే నడుపబడుచున్న 'రాజా కె. ఆర్. వి. కృష్ణరావు లైబ్రరీ' కాకినాడకు వన్నెనొసంగుచున్నవి. ఈ పట్టనము రాజకీయ, సాంఘిక, విద్యావిషయిక సంస్థలయందు ఎన్నడును వెనుకంజ వేసియుండలేదు. గ్రంథాలయోద్యమమందుకూడ తగిన సేవ యొనరించుచున్నది. గ్రంథాలయోద్యమాభివృద్ధికి ప్రకాశవంతమైన భవిష్యత్తు కలదని నమ్ముటకు సూచనలు స్పష్టముగా కన్పించుచున్నవి. గోదావరిజిల్లాలో ఆంధ్రభీష్మ న్యాపతి సుబ్బారావుపంతులుగారు, కీ. శే. వీరేశలింగం పంతులుగారు, చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు, కీ.శే. పోలవరం జమీందారుగారు, దుగ్గిరాల సూర్యప్రకాశరావుగారును గ్రంథాలయోద్యమములో శ్రద్ధవహించి పాటుబడిరి. ప్రస్తుతము గ్రంథాలయోద్యమప్రచారము గావించుచు, నిరాడంబర నిష్కామసేవ యొనర్చుచున్న అయ్యంకి వేంకటరమణయ్య ప్రభృతులు తమ జీవితము, ధనము, శక్తి,యావత్తు వినియోగించుచుండగా ఈయుద్యమము నూతనజీవనము పొందు ననుటకు సందేహము లేదు. గ్రంథాలయోద్యమ సేవయందు బెజవాడ ముందంజ వైచుచున్నది. వారు చేయుచున్న సేవ యపారము. గ్రంథములు, పత్రికలు ప్రచురించుచున్నారు. మనము వారి నభినందింపవలెను.

జాతీయ వికాసమునకు విద్యయే ముఖ్యావసరము. పాశ్చాత్య దేశములవారు ప్రాచ్యదేశములు జపాను మున్నగునవి ఈ విషయమును గుర్తెరింగి విద్యాభివృద్ధికెంతేయు ఆ దేశముల ప్రభుత్వములు తోడ్పడుచున్నవి. విద్యావిహీనమగు దేశములే అన్ని విషయములందు వెనుకబడి కష్టములపా లగుచున్నవి. ఇందుకుగాను ఆంధ్రదేశములోని కొన్ని జిల్లాలే తార్కాణము. మానవ శరీరమునకు వాయు వెంత ముఖ్యమో మనోవికాసమునకు విద్య యంత ముఖ్యము. విద్యాభివృద్ధికి తగు సౌకర్యములు లేనందువలన నూటికి పదిమంది కూడ వ్రాయను చదువను నేర్చినవారు లేరు. ప్రస్తుత విద్యావిధానము గూడ జీవితమునకు సంబంధించినదిగా కనుబడుట లేదు.

గ్రంథాలయములే దేశాభివృద్ధికి ముఖ్యసాధనములని కన్పించుచున్నది. అట్టి గ్రంథాలయోద్యమాభివృద్ధి గ్రంథాలయోద్యమ సేవకుల మీదనే ఆధారపడియున్నది.

ఈ నూతన యుగమందు గ్రంథాలయోద్యమము కూడ సర్వసామాన్య జనులకు సహాయముగా నుండి వారి యభివృద్ధికి తోడ్పడవలెను. ప్రతిగ్రామమునకు బావి యెంత ముఖ్యమో గ్రంథాలయముకూడ అట్టిదే యని యెంచవలెను; ప్రతిజిల్లాలోను తీవ్రప్రచారము సాగించి గ్రామములందు గ్రంథాలయములు స్థాపింపబ్రయత్నించవలెను. లేనియెడల గ్రామజీవితము అభివృద్ధిపొంద నేరదు.

గ్రంథాలయసేవయే ప్రజాసేవ. యువకులును, పెద్దలును కూడ ఈ యుద్యమములో పనిచేయుట కవకాశము కలదు. మనోవికాసమే జీవాధారము. ఉత్సాహము, మనోవికాసము లేని జీవనము నిరర్థకము. పూర్వకాలమున దేవాలయములే గ్రామప్రజలకు సమావేశస్థలములుగా నుండినవి. ప్రస్తుత మాదేవాలయములు పాడుబడినవి. ఆలయములకు సహాయముగాను, వానితోబాటు గ్రంథాలయము స్థాపింపబడి గ్రామజీవితమునకు ముఖ్యస్థానమయి యుండవలెను. గ్రంథాలయోద్యమప్రచారక సోదరులగు మిమ్ములను ప్రతిగ్రామమున గ్రంథాలయము నిర్మింపవేడుచున్నాను. గ్రంథాలయములు ఆటస్థలములు కాకూడదు. గ్రంథాలయమున గ్రంథపఠనముగాని, పత్రికాపఠనముగాని, యితర సాహిత్య ప్రసంగములు గాని యుండవలెను. గ్రంథాలయాధికారులు నెల కొకసారియైన విద్యావిషయిక ప్రసంగము చేయుటకు సభ్యుల కవకాశము కలుగజేయవలెను. మరియు ప్రస్తుత దేశసంచలనములో గ్రంథాలయము కూడ ముఖ్యస్థానము నాక్రమించవలెను.

గ్రంథాలయ సేవకులు ఓర్పు, పట్టుదల, ఉత్సాహము కలిగియుండవలెను. గ్రంథాలయోద్యమాభిమా

నులు గ్రామములలోని యితర సంస్థలలో తగుల్కొని యుండక నిరాడంబరముగ పని జేసినచో విశేషఫలితము చేకూరును.

మన గ్రంథాలయోద్యమమునకు అమెరికాలో కార్నెజీవంటి దాతలు లేరని, బరోడా మహారాజువంటి ఔదార్యవంతులు గాని లేరని చింతింప నవసరములేదు. మన మహారాజులుకూడ సాధ్యమయినంతవరకు పాటుబడుచునే యున్నారు.

మద్రాస్ లైబ్రరీ బిల్లును గురించి ఒక్కమాట మాత్రము చెప్పెదను. మన గ్రంథాలయములు గ్రామస్థుల కుపయోగముగా నుండుటకు దేశభాషలలోనే గ్రంథములు విశేషముగా నుండవలెనని మద్రాసు గవర్నరు స్టాన్లిప్రభువు చెప్పియున్నారు. లైబ్రరీ బిల్లునుగురించి ఆలోచించినచో అట్టి శాసనము ముఖ్యావశ్యకమని తోచుచున్నది. ఏ సంస్థ కాని ప్రభుత్వపు సహాయము లేనిదే నిలువదు. ఈ చట్టము ననుసరించి ప్రభుత్వమువారి బాధ్యత గ్రంథాలయముపై నుండును. ఎప్పుడు బాధ్యత కలిగినదో అప్పుడు గ్రంథాలయములు తగిన తనిఖీ కలిగియుండి ఎక్కువ యుపయోగముగా నుండును. అయితే ప్రస్తుతము శాసనసభయందు ప్రవేశపెట్టబడిన బిల్లునందు చాల లోపము లున్నవి. అట్టిలోపము లన్నింటెని సవరణచేసి మరి అంగీకరింపజేతు రని నేను కోరుచున్నాను.

భూపతిరాజు తిరుపతిరాజుగారి ప్రారంభోపన్యాసము.

పిమ్మట భూపతిరాజు తిరుపతిరాజుగారు సభను ప్రారంభించుచు ఇట్లు జెప్పిరి:—

గ్రంథాలయోద్యమాభివృద్ధికై నే నేమో చేసితినని మీరు నన్ను గౌరవించినారు. నేను చేసినది బహుస్వల్పము. కీర్తిశేషులగు శ్రీ వీరేశలింగం పంతులుగారి గ్రంథములను చదివితిమి. తత్ఫలితముగ మా గ్రామమున 1897 సంవత్సరమున శ్రీపంతులుగారి పేరున గ్రంథాలయమును స్థాపించి, అప్పటినుండియు మా యోపిన కొలదిని సేవ జేయుచుంటిమి.

పంతులుగారి పవిత్రనామమహిమచేతను శ్రీఅయ్యంకి వెంకటరమణయ్యగారి దోహదముచేతను ఈ సంస్థ దినదినాభివృద్ధి గాంచుచున్నది. ఈ కామధేనువునుండి అక్షరామృతమును గ్రోలిన కొలదిని సోదరగ్రామస్థులకు కూడ ఇట్టి యవకాశము కల్పింప తీవ్రేచ్ఛ ప్రజ్వరిల్లినది. ఆంధ్రదేశగ్రంథాలయోద్యమాభివృద్ధియందు మేము కూడ ముందంజ వేసి ఉడతభక్తిగ కొంత చేసి చూపితిమి.

గ్రంథాలయముల అభివృద్ధియంతయు గ్రంథాలయోద్యమప్రచారకుల మీదనే ఆధార పడి యున్నది. మన సేవకు ఫలితము దానివలన కలుగు నిర్మలమగు ఆత్మానందమేను. అట్టి పవిత్రోద్దేశముతో ప్రారంభింపబడినది. కనుకనే ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమ మిట్టి సత్ఫలితముల నొసంగ గలిగినది.

సర్వోద్యమములకు మూలకందములగు నీ ధర్మగ్రంథాలయములు ఆంధ్రదేశమందున్న గ్రామములందెల్ల విరివిగా వ్యాపింపజేయుటకు భగవంతుడు మనకు తోడ్పడుగాక యని ప్రార్థించుచున్నాను.

శ్రీమతి బొడ్డపాటి సీతాబాయమ్మగారి అధ్యక్షోపన్యాసము.

అనంతరము బొడ్డపాటి సీతాబాయమ్మగారు సభాధ్యక్షత వహించి ఇట్లు ఉపన్యసించిరి:—

పాశ్చాత్యులు పాఠశాలలందు విద్యాపరిపూర్తి యనంతరము గ్రంథాలయమందు విద్యప్రారంభింతురనెదరు. అట్లుగాక అక్షరాభ్యాసమునుండియు గ్రంథాలయముననే విద్యప్రారంభమగుట ఇంకను ఎక్కువ శ్రేష్ఠమైయున్నది.

స్త్రీలకు ప్రత్యేకముగా కొన్నిగ్రంథాలయములు కలవు. కాని వానిని నిర్వహింపవలసినవిధానము సరిగా బోధపడినట్లు లేదు. కాన పురుషుల గ్రంథాలయములలో అధమము అయిదుగురు స్త్రీసభ్యులైనను ఉండునట్లు మీరు ప్రయత్నింపవలెను. సామాన్యసభ్యులుగనే గాక కార్యనిర్వాహక సభ్యులుగకూడ చేర్చి అన్నివిధానములు నేర్పి స్వతంత్రశక్తి గలవారినిగ తయారు చేయవలయును.

చీటపేకలు గ్రంథాలయములకు చేటగుచున్నవని సప్రమాణముగ నిన్న సభలో నిరూపింపబడెను. అట్టి చీట్లపేకలకు గ్రంథాలయములలో ప్రవేశ మీయకుండుటకు కోరుచున్నాను.

పతివ్రతయగు స్త్రీ తనభర్త కనేకరీతుల సహాయమై సుఖపెట్టునట్లు ప్రజలకు గ్రంథాలయములు పలువిధముల సౌఖ్య మొసగజేయును.

ప్రతి గ్రంథాలయములోను శిశుశాఖ నేర్పరచి మొదటి తరగతి శిశువులకుగూడ తగిన గ్రంథముల నివ్వవలయును. ఇట్లు బాల్యమునుండి గ్రంథాలయ ప్రయోజనము పొందుట యను సదభ్యాసము నాటుటవలన, మనబిడ్డల భావిసౌభాగ్యము అనేక రెట్లు ఎక్కువగుననుట, కొంతమాత్రమును సందియము లేదు.

ఇతర ఉపన్యాసములు.

శ్రీ కోపల్లె శివకామేశ్వరరావు, కనుమూరి వీరేశలింగం, రుద్రరాజు నరసింహరాజు, విరియాల కామరాజు, కిడాంబి రాఘవాచార్యులు, శ్రీమతి వల్లూరి సుబ్బమ్మగార్లును, గ్రంథాలయ ప్రచారమునుగురించి మాట్లాడిరి.

తీర్మానము.

ఈ దిగువతీర్మాన మేకగ్రీవముగా అంగీకరింపబడెను. "ఆంధ్రదేశమందు గ్రంథాలయోద్యమ వ్యాప్తిని చేయుటకుగాను ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమునకు అనుబంధముగ సేవాశాఖను స్థాపించుటకు తీర్మానించడమైనది."

శ్రీయుత కళా వెంకటరావుగారును మాట్లాడుచు 1914 మొదలు 1920 వరకు గ్రంథాలయోద్యమము విషయము పని జరిగినది గనుకనే రాజకీయోద్యమము ఆంధ్రదేశములో బాగుగావిజృంభించినదనియువిజ్ఞానము పెదజల్లుటవలన ఫలితము దేశస్వాతంత్ర్యము కల్గినగాని లాభము జరుగనేరదనియు, వివిధ విషయములు సమీకరణముచేసి ఉత్తేజ మొసంగుటకు ఆదర్శప్రాయముగా గ్రామ గ్రంథాలయ సేవాశాఖ స్థాపనలు జరుగవలెననియు హెచ్చరించిరి.

శ్రీయుత పుణ్యమూర్తుల రాజశేఖరంగారును గ్రంథాలయోద్యమ ప్రచారమును గూర్చి మాట్లాడిన పిదప సభ ముగిసెను.

నివేదికలు

తాడేపల్లిగూడెం తాలూకాబోర్డు గ్రంథాలయము

ఈగ్రంథాలయము 1-11-29 తేదీన అప్పడు బోర్డునకు అధ్యక్షులుగానున్న శ్రీ కలిదిండి గంగరాజుగారిచే స్థాపింపబడినది. పదివేలరూపాయలు ఖరీదుగలిగిన భవనమును గట్టి ప్రొఫెసరు జే. సి. కుమారప్పను (గుజరాతీ విద్యాపీఠము, అహమ్మదాబాదు) గారిచే ప్రారంభోత్సవమును జరిపించిరి. ఈ గ్రంథాలయమును ఇంత ఉన్నతస్థితికి తీసికొనివచ్చుటకు శ్రీ శనివారపు సుబ్బారావుగారి కృషి విశేషముగా గలదని చెప్పక తప్పదు.

ఈ గ్రంథాలయమునకు ప్రత్యేకము గ్రంథభాండాగారి, బంట్రోతు కలరు. నెల1కి సిబ్బందికి, పత్రికలకు రు 75 లు ఖర్చుఅగుచున్నది. ఈ వత్సరము ఈగ్రంథాలయమునకు తాడేపల్లిగూడెం గ్రామ కాపురస్థులు 7970 మందిన్ని ఇతర గ్రామస్థులు 3205 మందిన్ని వచ్చి పుస్తకములను పత్రికలను చదివిరి. గ్రంథాలయమునందు 514 గ్రంథములను చదివిరి. ఇండ్లకు 366 గ్రంథములను తీసికొనిపోయిరి. సగటున రోజుకు తాడేపల్లిగూడెం వారు 22 న్ను, పొరుగు గ్రామములవారు 9 న్ను, వెరసి 31 మంది వచ్చి జ్ఞానమును పొందుచున్నారు. రోజుకు మనిషి1కి రు 0-1-3 ఖర్చు అయినది.

తణుకు తాలూకాబోర్డు గ్రంథాలయము
(1933 సం॥ నివేదిక)

ఈ గ్రంథాలయము 15-5.31 తేదీన ప్రారంభమయ్యెను. తాలూకాబోర్డు ఆఫీసునందే ఒక హాలునం దుంచబడినది.

ఇందుగల గ్రంథములు.

భాష.	సంఖ్య.	ఖరీదు.
ఆంగ్ల గ్రంథములు	461	రు 600
ఆంధ్ర గ్రంథములు	446	రు 700
సంస్కృతము	22	రు 40
హిందీ	63	రు 50
	991	రు 1390

ఆంగ్ల, ఆంధ్రభాషా పత్రికలలో, దైనిక వార మాస పత్రికలు రు 80 లు విలువగలవి తెప్పింపబడుచున్నవి. గ్రంథభాండాగారికి బంట్రోతుకు సాలునకు రు 680 లు ఖర్చు అగుచున్నది. ఈవత్సరము ఈ గ్రంథాలయమునకు 1678 మంది తణుకుగ్రామస్థులు, 722 మంది పొరుగు గ్రామస్థులు వచ్చి గ్రంథములను పత్రికలను చదువుకొనిరి. 185 మంది మాత్రము ఇండ్లకు గ్రంథములను తీసికొనిపోయిరి.

రోజుకు సుమారు 7 గురు గ్రంథాలయమందు వయోజనవిద్య నభ్యసించిరి. అందు గ్రామస్థులు 5 గురు, పొరుగూరి వారు ఇద్దరు.

ఈ గ్రంథాలయమును 1934 సం|| నుండి సంచార గ్రంథాలయముగా మార్చిరి. అందుచేత హెచ్చు ఫలితములు ఈవత్సరమున కనుపడును:

ఆంధ్ర దేశ గ్రంథాలయ సంఘము

1934 వ సంవత్సరం జనవరినెల 20 వ తేదీ ఉదయము 8-30 గంటలకు కాకినాడ పట్టణమున జరిగిన సామాన్యసంఘసభయందు చేయబడిన తీర్మానములు:—

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమునకు ఈ క్రిందవారిని ముందు సంవత్సరమునకు కారనిర్వాహకవర్గసంఘముగా ఏర్పాటు చేయడమైనది.

అధ్యక్షులు:—వేమవరపు రామదాసుపంతులుగారు.

ఉపాధ్యక్షులు:—రావుసాహెబు ఎం. అప్పారావుగారు, భూపతిరాజు సీతారామరాజుగారు, దుగ్గిరాల సూర్యప్రకాశరావుగారు. భూపతిరాజు తిరపతిరాజుగారు, శ్రీ రాజా యార్లగడ్డ శివరామప్రసాద బహద్దరు జమీందారుగారు, ఊటుకూరి వెంకటసుబ్బరాయశ్రేష్ఠిగారు, బొడ్డపాటి సీతాబాయమ్మగారు, గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు, క. కోటిరెడ్డిగారు, బెజవాడ రామచంద్రారెడ్డిగారు, సి. ఆర్. పార్థసారథి అయ్యంగార్ గారు, వామన్ నాయక్ గారు, వావిళ్ల వెంకటేశ్వరశాస్త్రిగారు, ఏ. రంగనాథమొదల్యారు గారు, సామి వెంకటాచలం శ్రేష్ఠిగారు, ఆట్లూరి సీతమ్మగారు, తూర్పాటి సన్యాసమ్మగారు, బి. మునిస్వామినాయుడుగారు, హట్టి శంకరరావుగారు, జాగర్లమూడి కుప్పుస్వామిగారు, దేశోద్ధారక కే. నాగేశ్వరరావుగారు.

కార్యదర్శి:—అయ్యంకి వేంకటరమణయ్యగారు.

కార్యనిర్వాహక సంఘాధ్యక్షులు:—నడింపల్లి వెంకట లక్ష్మీనరసింహారావుగారు.

సహాయ కార్యదర్శులు:—ఉత్తబల రామయ్యగారు, నరసింహదేవర సత్యనారాయణగారు, పుణ్యమూర్తుల రాజశేఖరంగారు, నేత్రకంటి యోగానందరావుగారు, వేమగంటి పాపాయమ్మగారు, డాక్టరు పి. గోవిందరాజులుగారు, మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు, బులుసు వెంకటసుబ్బారావుగారు, కొండ సచ్చిదానందరాజుగారు, శరణు రామస్వామిగారు, కైప సుబ్రహ్మణ్యశర్మగారు, మాడపాటి హనుమంతరావుగారు, పప్పూరి రామాచార్యులుగారు, ఊసుమళ్ల రాజగోపాలరావుగారు, సి. వి. రంగంసెట్టిగారు, చట్టి నరసింహారావుగారు, తుర్లపాటి రాజేశ్వరమ్మగారు.

కార్యనిర్వాహకసంఘము

గంజాంజిల్లా:—జగన్నాథపాడి శుడంగగారు, పొట్నూరి స్వామిబాబుగారు, పుల్లెల శ్యామసుందరరావుగారు.

విశాఖపట్నం:—పురిపండా అప్పలస్వామిగారు, తెన్నేటి విశ్వనాథంగారు, బుర్రా శేషగిరిరావుగారు.

తూర్పు గోదావరి:— వెంద్యాల వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, కిళాంబి రాఘవాచార్యులుగారు, నాళం కృష్ణరావుగారు, కొత్తపల్లి సూర్యారావుగారు,

పశ్చిమగోదావరి:—పోతాప్రగడ శ్రీ రామారావుగారు, కలిదిండి గంగరాజుగారు, డాక్టరు పాలకోడేటి సత్యనారాయణశర్మగారు, డాక్టరు తేతలి సత్యనారాయణగారు.

కృష్ణ:—అరెకపూడి రామశాస్త్రులుగారు, గుడిపాటి రంగనాయకమ్మగారు.

గుంటూరు:—మంతెన వెంకటరాజుగారు, పాతూరి నాగభూషణంగారు, వంగపురపు జగన్నాథరావుగారు,

కర్నూలు:—రాజా పెద్దసుబ్బారాయుడుగారు, క. నరసింగరావుగారు, దేశపాండ్య సుబ్బారావుగారు, శేపూరి యల్లమందయ్యశెట్టిగారు.

అనంతపురం:—యం. సన్నప్ప నాయుడుగారు, శీరిపి ఆంజనేయులుగారు.

కడప:—జనమంచి శేషాద్రిశర్మగారు, వేలాల రామకృష్ణశాస్త్రిగారు, కొప్పరపు సుబ్బయ్యశెట్టిగారు.

చిత్తూరు:—బూదూరు రామానుజులు రెడ్డిగారు, ఎమ్. శ్రీనివాసాచార్యులుగారు.

నెల్లూరు:— వెన్నెలకంటి అప్పారావుగారు, తూములూరి శివరామయ్యగారు, యం. ఆర్. రామకృష్ణరావుగారు.

బళ్లారి:—టి. రాఘవాచార్యులుగారు.

మద్రాసు:—కస్తూరి నరసింహారావుగారు, ఆర్. జనార్దనరావునాయుడుగారు.

నైజాము:—వార్నాశి సుబ్బారావుగారు, రాయప్రోలు సుబ్బారావుగారు.

ఆంధ్రరాష్ట్రీయ గ్రామగ్రంథాలయ సేవాశాఖ నేర్పరచుట.

తీర్మానము:—1. గ్రామ గ్రంథాలయ సేవా వ్యాపనమునకు సంబంధించిన విషయములను గూర్చి ప్రత్యేకపరిశ్రమ చేయుటకుగాను ఈ సంఘమునకు శాఖగా 'గ్రామగ్రంథాలయ సేవాశాఖను ఏర్పాటు చేయడమైనది.

2. ఈశాఖను అఖిలభారత గ్రామగ్రంథాలయ సేవా సంఘమునకును దానియొక్క మద్రాసురాజధానిశాఖకును ఉపశాఖగా చేర్చుటకు తీర్మానించడమైనది.

ఈసంఘమునకు ఈక్రిందివారిని ఉద్యోగులుగా ఎన్నుకొనడమైనది.

అధ్యక్షులు:—పెద్దాడ రామస్వామిగారు.

ఉపాధ్యక్షులు:—నరసింహదేవర సత్యనారాయణగారు, కామరాజు హనుమంతరావుగారు.

కార్యదర్శి:—అయ్యంకి వెంకటరమణయ్యగారు.

సహాయకార్యదర్శులు:—శనివారపు సుబ్బారావుగారు, కోపల్లె శివకామేశ్వరరావుగారు, పుణ్యమూర్తుల రాజశేఖరంగారు,

ఆంధ్రదేశ గ్రంథాలయముల నిర్మాణకార్య క్రమమును గూర్చి శ్రీవల్లూరి సూర్యనారాయణరావుగారు వ్రాసిన ఉత్తరము చదవడమైనది.

ఆంధ్రదేశములో నన్ని జిల్లా గ్రంథాలయ సంఘము లన్నియు తమతమ మండలములయందున్న గ్రంథాలయములను తనిఖీచేసి, గ్రంథాలయోద్యమాభివృద్ధిని సాగించవలసిన దనియు, జిల్లాసంఘములు లేని మండలములందు జిల్లాసంఘములను వెంటనే స్థాపించవలసినదనియు ఈసభవారు తీర్మానించుచున్నారు.

శ్రీముఖనామ సంవత్సరమునకు ఆంధ్రదేశగ్రంథాలయముల చరిత్రను తయారుచేయవలెనని తీర్మానించుచున్నారు.

గ్రంథాలయోద్యమాభివృద్ధి చేయుటకై సేవకసంఘమును స్థాపించుటకే తీర్మానించడమైనది. ఈ క్రిందివారిని సేవకులుగ అంగీకరించడమైది:—

గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు, గోరావఝల రామకృష్ణశతావధానిగారు, కైప సుబ్రహ్మణ్యశర్మగారు, యక్కలి రామయ్యగారు, కొల్లా సుబ్బరాయగుప్తగారు, వారణాసి వెంకటకృష్ణమూర్తిగారు, నేత్రకంటి యోగానందరావుగారు, పుణ్యమూర్తుల రాజశేఖరంగారు, బులుసు వెంకటసుబ్బారావుగారు, మొసలకంటి తిరుమలరావుగారు, తాడిమేటి కుటుంబశాస్త్రిగారు, రాజా వత్సరాయి జగపతివర్మగారు, చట్టి నరసింహారావుగారు.

గ్రంథాలయముల ఆవశ్యకము

(ఆంధ్రపత్రిక సంపాదకీయము. 22-1-34)

దేశమునందలి ప్రజలకు విజ్ఞానాభివృద్ధి కలుగుటకు సహాయకము లగువానిలో గ్రంథాలయములు ముఖ్యముగ పేర్కొనబడదగిన వను విషయ మిపుడు ప్రపంచమునందన్ని నాగరక దేశములలోను బాగుగా గ్రహింపబడినది. పాశ్చాత్య దేశములలో గ్రంథాలయాభివృద్ధికి ప్రజలును ప్రభుత్వము వారునుగూడ నత్యధికముగా తోడ్పడుచున్నారు. మన దేశములోగూడ గ్రంథాలయోద్యమమున కిపుడు చాల ప్రాముఖ్య మొసగబడు చున్నది. మన దేశమునందు బరోడా సంస్థానము వారీ విషయమున సర్వవిధముల ముందంజ వేయుచున్నారు. తక్కిన సంస్థానముల వారుగూడ వీరిమార్గము ననుసరించు టవసరమై యున్నది. కనీసము ప్రాథమిక విద్య నభ్యసించినవారి కందరికిని గ్రంథాలయములవలన చాల మేలు కలుగగలదు. అందులకు బాలురకును బాలికలకును ప్రాథమికవిద్య ఉచితముగాను నిర్బంధముగాను నేర్పబడుట ముఖ్యకర్తవ్యమై యున్నది. ప్రతి పల్లెలోనుగూడ ప్రాథమిక పాఠశాలయును గ్రంథాలయమును విధిగా నుండవలెను. దేశభాషలో విద్య బోధింపబడవలెను. అపుడు ప్రాథమికవిద్య నభ్యసించినవారు జ్ఞానాభివృద్ధిని బడయుటకు గ్రంథాలయములు బాగుగా నుపయోగించుటకు తగిన దేశభాషా గ్రంథములు గ్రంథాలయములలో లభించుటకు తగిన యేర్పాటులు జరుగవలెను. ఈ గ్రంథములు వ్యావహారిక భాషలో అనగా మామూలు వాడుక మాటలతో సులభశైలిని వ్రాయబడవలెను. కులవిద్యలు వృత్తి విద్యలు చేతిపనులు మున్నగువాటిని నేర్చుకొనగోరు వారికి తోడ్పడగల గ్రంథములుగూడ నుండవలెను. నీతి మత రాజకీయ సాంఘిక విషయములకు సంబంధించిన గ్రంథములు గూడ నుండవలెను. గ్రంథాలయములలో వార్తా పత్రికలుగూడ నుండవలెను. ఈ గ్రంథములను పత్రికలను ప్రజలు ఉచితముగా బడయగలుగుచుండవలెను. ప్రతిగ్రామమునందును గ్రంథాలయము ప్రజలకు కూడలి స్థానముగా నుండవలెను. స్త్రీలును పురుషులునుగూడ వీనిని పూర్తిగా నుపయోగించుకొనుటకు తగిన సౌకర్యము లుండవలెను. వీనిని ప్రజలు ఉపయోగించుటకు గట్టి ప్రచారము జరుగవలెను. ప్రజల నధికముగా నాకర్షింపగల యేర్పాటు లన్నియును జరుగవలెను. ఆంధ్రదేశమునందుగూడ గ్రంథాలయము లిపుడు హెచ్చుగా నేర్పడుచుండుట సంతోషప్రదము. వీటి కింకను ప్రజలతోడ్పాటు హెచ్చుగా లభింపవలెను. భారతదేశమున గ్రంథాలయాభివృద్ధికి బరోడా సంస్థానము తరువాత ఆంధ్రదేశమే పేర్కొనబడదగి యున్నదని నల్లూరులో 18వ తేదీని జరిగిన ఆంధ్రబాలసరస్వతీనిలయ తృతీయ వార్షికోత్సవ సంబంధమున గ్రంథాలయ ప్రదర్శనము ను ప్రారంభించుచు శ్రీయుత మాగంటి బాపినీడు గారు నుడివిరి. ఇది ఆంధ్రులు సంతసింపదగిన విషయమే గాని యీ అభివృద్ధి చాలదనుట నిశ్చయము. ప్రతి గ్రామమునను విష్ణ్వాలయ శివాలయములతోపాటు ఈ శారదాలయములుగూడ ముఖ్యముగా నుండవలెనను విషయమును ఎల్లవారును ముఖ్యముగా గుర్తింపదగును. ఇపుడు కాకినాడలో శ్రీయుత వేమవరపు రామదాసు పంతులుగారి అధ్యక్షతక్రింద ఆంధ్రదేశ గ్రంథాలయ సభ జరుగుచున్నది. ఈ సందర్భమున జరిగిన గ్రంథాలయ సేవకసభకు సన్మాన సంఘాధ్యక్షులగు శ్రీయుత నేట్రికంటి యోగానందరావుగారు గ్రంథాలయోద్యమాభివృద్ధికి ప్రకాశవంతమైన భవిష్యత్తు కలదని నమ్ముటకు సూచనలు స్పష్టముగా కన్పించుచున్నవని నుడువులలో సత్యమునే వెల్లడించిరి. ఆంధ్రదేశమున శ్రీపిఠాపురము మహారాజావారు ఆంధ్రభాషాభివృద్ధికి సర్వవిధముల తోడ్పడుచున్నా రనుటకు వీ రేర్పరచిన ఆంధ్రసాహిత్య పరిషత్తే ప్రబల నిదర్శనము. విద్వత్కవివరేణ్యులును జయపురాధీశులును నగు శ్రీ విక్రమ దేవవర్మ మహారాజాగారు ఆంధ్ర విశ్వవిద్యాలయమునకు భూరివిరాళముల నొసగుచున్నారు. శ్రీ బొబ్బిలి మహారాజాగారు పోషకులుగా నుండి చాల సహాయపడుచున్నారు. స్వర్గీయులైన శ్రీ పోలవరం జమీందారుగారు తమ జీవితమునంతను భాషాసేవకే వినియోగించిరి. కవిపుంగవులగు శ్రీ తిరుపతికవి ప్రముఖులను ఆదరించిరి. వీరి పేరిటనే యిపుడు కాకినాడలో నొక గ్రంథాలయము నడుపబడుచున్నది. ఆంధ్రదేశమునందుగల మహారాజులు జమీందారులు భూస్వాములు ధనికులు మున్నగువారం

దగును గ్రంథాలయాభివృద్ధికి శక్తివంచన లేకుండ తోడ్పడవలెను. దేశమునందంతటను ఉచితగ్రంథాలయములను విస్తారముగా నెలకొల్పుటను అఖిలభారత గ్రంథాలయ సంఘమువారు పూనుకొనిరి గాన ఆంధ్రదేశ గ్రంథాలయసంఘమువారు గూడ వారి సహాయమును బడయదగును. బెజవాడలో శ్రీయుత అయ్యంకి వెంకట రమణయ్యగారు సూరి వేంకట నరసింహశాస్త్రిగారు మున్నగువారు పెక్కువత్సరములనుండి గ్రంథాలయాభివృద్ధికి చాల శ్రద్ధ బూనియున్నారు. వీరు బెజవాడలో నేర్పరచిన రామమోహనగ్రంథాలయము వీరి సేవకు తార్కాణము. ఇటీవల నీ గ్రంథాలయ సంఘమున విదాదలు కలుగుట చాల సంతాపకరము. భగవదనుగ్రహమున త్వరలోనే మరల నన్యోన్యము కలుగుగాక. ఆంధ్రదేశమున గ్రంథాలయాభివృద్ధినిమిత్తము పనిచేయుచున్నవారికి ఆంధ్రు లందరును సర్వవిధముల తోడ్పడగలరని నమ్మెదము. ఖద్దరును స్వదేశీవస్తువులను దేశీయులధికముగా నుపయోగించుటకు ఖద్దరుస్వదేశీప్రదర్శనము లెటుల నవసరమో గ్రంథాలయములవలన కలుగునట్టి గొప్ప లాభమును ప్రజలు బాగుగా గ్రహింపగలుగుటకు గ్రంథాలయసభలును ప్రదర్శనములునుగూడ నటులే అవసరము. కాకినాడలో శ్రీయుతులు రామదాసుపంతులు, ప్రకాశరావుపంతులు, యాతగిరి లక్ష్మీవేంకటరమణగార్లును నల్లూరిలో దేశభక్త కొండా వేంకటప్పయ్యపంతులు, మాగంటి బాపినీడు, గొల్లపూడి సీతారామశాస్త్రిగార్లు గ్రంథాలయముల ప్రయోజనమునుగూర్చి తెలిపిన విషయములు ముఖ్యముగా గమనింపదగియున్నవి. ప్రజలలో గ్రంథాలయములం దాసక్తి పెరుగుచున్న దనుట కీసభలును ప్రదర్శనములును ముఖ్య నిదర్శనములు.

మదరాసు గ్రంథాలయముల బిల్లు.

(ఆంధ్రపత్రిక సంపాదకీయము (22-1-34))

సర్వజనోపయుక్తము లగు గ్రంథాలయములను రాష్ట్రమునందంతటను నెలకొల్పి పట్టణములలోను గ్రామములలోను గ్రంథాలయముల నభివృద్ధి నొందించుటకీబిల్లు ఉద్దేశింపబడెనని తెలుపబడెను. మదరాసు విశ్వవిద్యాలయము గ్రంథాలయాధికారి ఎస్. ఆర్. రంగనాథముగారు వెనుక జేసిన సూచనలపైననే ఆధారపడి ఈ బిల్లు సిద్ధపరుపబడినను రంగనాథముగారి మాతృకలోని ముఖ్యవిషయము లిందులో కనుపించకుండుట విదిత మగుచునేయున్నది. ఈలోపములను సూచించుచు భారతగ్రంథాలయసంఘాధ్యక్షుడు డా॥ వి. శివరాం గారొక సవరణనుగూడ నిటీవల చేసియుండిరి గాని అదిగూడ నంత లాభకారిగ నుండియుండలేదు. స్థానిక గ్రంథాలయాధికారి తన పరిశీలనక్రింద నున్న ప్రాంతములో గ్రంథాలయము లధికముగా నేర్పడుటకు సర్వవిధముల ప్రయత్నింపవలెను. గ్రంథాలయాధికారి సమకూర్చిన మొత్తములో సగము మొత్తమునకు తక్కువగాని ధనమును స్థానిక ప్రభుత్వమువారు గ్రంథాలయాధికారి చేర్చిన మొత్తముతో కలుపుచుండవలెనని రంగనాథంగారు సూచించియుండిరి. ఈబిల్లులో నిట్టి యేర్పాటు లేవియును కనబడవు. ఇటుపైని క్రొత్తగా గ్రంథాలయముల నేర్పరుచుటకును ఇపుడున్న గ్రంథాలయములకు ధనసహాయము చేయుటకును దొరతనమువారికిగాని వా రేర్పరుచునట్టి సంఘములకుగాని యెట్టి బాధ్యతయును ఈబిల్లులో సూచింపబడి యుండలేదు. దొరతనమువారును వా రేర్పరచిన సంఘములవారును ధనసహాయము చేయుటకీబిల్లులో నెట్టి బాధ్యతయును సూచింపకుండుటయే గాక “గ్రంథాలయములలో గ్రంథములను పరిశీలించుటకును గ్రంథాలయములకు వచ్చుచుండువారిని పరిశీలించుటకును స్థానిక గ్రంథాలయాధికారి ఉపనిబంధనలను చేయుటకు దీనిలో నవకాశ మేర్పరుపబడెను. తమ అధ్యక్షోపన్యాసమున శ్రీయుత రామదాసు పంతులుగారు సూచించినట్లు పైకి నిది చాల నిరపాయకరముగా కనబడుచున్నను, ఈ అధికారము గలవారిట్టి అధికారమును దుర్వినియోగము చేయుట కెన్నియో అవకాశములు కలవని దేశీయులు గ్రహింపజాలకపోరు. అట్టి అధికారులు రాజకీయ వాఙ్మయమును మాత్రమేగాక జాతీయ వాఙ్మయమును గూడ పూర్తిగా నిషేధింపగలుగుదురు. ఖద్దరును ప్రోత్సహించుట, అటూవాఒడంబడికను నిరసించుట మున్నగు విషయములకు సంబంధించిన గ్రంథముల కపుడు గ్రంథా

లయములలో తా వుండను. గాంధిటోపీలను ఖద్దరు దుస్తులను ధరించినవారు గ్రంథాలయములకు రాగూడదని నిబంధనలను చేయుట వీరికి సులభ మగును. ఇప్పుడు గూడ గ్రామములలోని గ్రంథాలయములను గూర్చి మండలవిద్యాశాఖాధికారుల కట్టి అధికారము గలదో అట్టి అధికారము పోలీసుసర్కిలు ఇన్స్పెక్టరులకును వారి తాబేదారులకును గూడ కలదని రామదాసు పంతులుగారు వెల్లడించియున్నారు. ఇది ముఖ్యముగా గమనింపదగిన విషయము. ఈ నిబంధనల నుల్లంఘించిన వారికి శిక్ష వేయుటకు గూడ నీ బిల్లులో నవకాశము కలదు. ఇపుడు మ్యునిసిపాలిటీలు తాలూకాబోర్డులు గ్రామపంచాయతీలు మున్నగు స్థానికసంస్థలు గ్రంథాలయముల నేర్పరచి పోషించుట కధికారమును కలిగియున్నవి. ఈ స్థానికసంఘముల పైని స్థానికసంఘముల ఇన్స్పెక్టరుకును స్థానికప్రభుత్వశాఖామంత్రికిని అధికారము కలదు. అట్టిచో నింతకంటె హెచ్చుఅధికారము కోరుటకు మా కట్టి అవసరమును కనబడదు. ఈ బిల్లు ప్రకారము రాష్ట్రీయ సంఘము స్థానికసంఘములు ప్రాంతీయసంఘములు సంయుక్త సంఘములు మున్నగున వెన్నియో యేర్పడగలవు. దీనిని బట్టి చూచినచో రామదాసుగారు తెలిపినట్లు గ్రంథాలయముల సంఖ్యకంటె పరిశీలకసంఘముల సంఖ్యయే అధికమగునట్లు కనబడుచున్నది. క్రొత్తగా గ్రంథాలయముల డైరెక్టరును గ్రంథాలయ శాఖయును ఏర్పరుపబడునెడల స్థానిక సంఘముల కట్టి అవకాశమును లేకుండ పోవచ్చును. ఈ శాఖయొక్కయు ఉద్యోగులయొక్కయు వ్యయమునకు క్రొత్తపన్ను గూడ విధింపబడును. ఇదివరకే పన్నులచే క్రుంగిపోవున్న ప్రజలపై మరియొక క్రొత్త పనున్ను విధించుట దుర్భరమే యగును. ప్రారంభవిద్యను ఉచితముగ నిర్బంధముగను వ్యాపింపజేయవలెనని ప్రజలు కోరుచుండ, గ్రామనులోనిబీదసాదలకు జ్ఞానాభివృద్ధికి సహాయకములగు గ్రంథాలయముల విషయమున పన్ను విధింపవలెనని సూచించుట చాల ఆశ్చర్యకరము. దేశమునందలి ప్రజలలో 100 కి 10 మందియైనను అక్షరజ్ఞానము కలవారు లేరని స్పష్టమగుచుండ, నిపుడు క్రొత్తగా దీనిని గూర్చి విచారణ చేయవలె ననుట మిక్కిలి అసమంజసమును వ్యయమూలము నని చెప్పక తప్పదు; కావున దీనిని గూర్చి కాకినాడలో జరుగుచున్న 16 వ ఆంధ్ర గ్రంథాలయ సభలో సభవారు తమ అసమ్మతిని స్పష్టముగా వెల్లడించుటయే గాక లాభకరములగు సూచనలను చేయుట ప్రధాన కర్తవ్యమై యున్నది. దేశమున ఉచితప్రాథమిక విద్యాశాలలును ఉచితగ్రంథాలయములును వేలకొలదిగా నేర్పడవలెను. దేశమునందు విద్య సార్వత్రికము కావలెను. ప్రజలకు రాజకీయపరిజ్ఞానము కలుగవలెను. మూఢవిశ్వాసములును అజ్ఞానమును తొలగవలెను. స్వరాజ్యమును శీఘ్రముగా లభించుట కిది అవశ్యకర్తవ్యము గావున నిందులకు నిరోధకములగు బిల్లులను, ఏర్పాటులను దేశీయులు ఏకగ్రీవముగా ఖండించక తప్పదను విషయమును గుర్తింతురుగాక.

భీమవరం తాలూకా

గ్రంథాలయ సంఘాభివృద్ధి

1933 — 34 సం. నివేదిక.

భీమవరం తాలూకా గ్రంథాలయ సంఘము ది 12-3-33 న ఉండిగ్రామములో ఆంధ్రదేశగ్రంథాలయసంఘకార్యదర్శియు సుప్రసిద్ధగ్రంథాలయ సేవాతత్పరులునైన శ్రీయుత అయ్యంకి వెంకటరమణయ్య పంతులుగారి అధ్యక్షతను జరిగిన ప్రథమ భీమవరం తాలూకా గ్రంథాలయమహాసభలో స్థాపింపబడినది. ఆమహాసభలో ఎన్నుకోబడిన 15 గురు సభ్యులుగాక మరి ఇద్దరు ఈ సంఘములో చేర్చుకొనబడిరి. ఈ సంవత్సరములో 8 కార్యనిర్వాహక సభలును, 2 ఉపసంఘసభలును, 46 ప్రచారకసభలును జరుపబడినవి. తాలూకాలోని పూర్వపు గ్రంథాలయములు 37 టిలోను 18 గ్రంథాలయములుమాత్రమే ప్రస్తుతము పనిచేయు

చున్నవి. ఇందులో ఈ దిగువ 10 గ్రంథాలయములును ఈ సంవత్సరములో పునరుద్ధరింపబడినవి.

1. శ్రీ ఆంధ్రవాల్మీకి: వావిలికొలను సుబ్బారాయ గ్రంథాలయము, వేండ్ర.

2. శ్రీ పరపతిసంఘ గ్రంథాలయము } యండ
3. శ్రీ సహకారసంఘ గ్రంథాలయము } గండి.

4. శ్రీ సీతారామాంజనేయ గ్రంథాలయము, పెదపుల్లేరు.

5. శ్రీ మోతీలాల్ పుస్తక భాండాగారము, కొణితివాడ.

6. శ్రీ వేణుగోపాల పుస్తక భాండాగారము, అండలూరు.

7. శ్రీ కృష్ణదేవరాయ పుస్తక భాండాగారము, చెరుకుమిల్లి.

8. శ్రీ బ్రహ్మానందదాయిని పుస్తక భాండాగారము, విస్సాకోడేరు.

9. శ్రీ యువజనానంద గ్రంథాలయము, చిలుకూరు.

10. శ్రీ రానడే గ్రంథాలయము, పాలకోడేరు.

ఇవిగాక ఈ దిగువ నుదాహరింపబడిన గ్రంథాలయములు ఈ తాలూకాలోని ఆయా గ్రామములందు నూతనముగ స్థాపింపబడినవి.

1. శ్రీకృష్ణ గ్రంథాలయము, మహాదేవపట్నం.

2. శ్రీ పద్మనాభ స్వామి గ్రంథాలయము, పెదఅమరం.

3. శ్రీ శారదా గ్రంథాలయము, వాండ్ర.

4. శ్రీ సూర్పరాజు గ్రంథాలయము, తోలేరు శివారు, సూర్పరాజుపేట.

5. శ్రీ గణపతి గ్రంథాలయము, వేంపాడు.

6. శ్రీ పటేలు గ్రంథాలయము, భీమవరం.

7. శ్రీ సుబ్బరాయ స్మారక గ్రంథాలయము, పెన్నాడ అగ్రహారం.

8. శ్రీ రంగేశ్వరానంద గ్రంథాలయము, చినఅమరం.

9. శ్రీ అరుంధతీ గ్రంథాలయము, చెన్నురంగనిపాలెం.

10. శ్రీ సీతారామాంజనేయ గ్రంథాలయము, చెరుకువాడ.

ఈ గ్రంథాలయ సంఘాధ్యక్షులును, దేశసేవాపరులును, ప. గోదావరిజిల్లా గ్రంథాలయ సంఘాధ్యక్షులును అగు శ్రీయుత భూపతిరాజు తిరుపతిరాజుగారు, వ్యయప్రయాసలకు ఓర్చి ఈ వృద్ధాప్యములో తాము చూపిన దీక్షకును, చేసిన గ్రంథాలయ సేవకును, ఈ తాలూకా ప్రజలపక్షమున అనేక వందనశతంబులు అర్పించుచున్నాడను. వారి ప్రయాణపు ఖర్చుల కైనను ఈ సంఘము సహాయము చేయలేదని మనవి చేయుటకు చింతిలుచున్నాడను. వీరు వెళ్లిన గ్రామమే తిరిగి వెళ్ళవలసి వచ్చుచుండుటచేతను, కొన్ని గ్రామములయందు ఉత్సాహముగాని, సహాయము చేయుటకు పూనిన యువకులు గాని లేనందున పూర్వపు గ్రంథాలయములన్నియు పునరుద్ధరించుటకు తగిన అవకాశము కలుగలేదు.

ఈ తాలూకాయందు గ్రంథాలయ ప్రచారము సుమారు 40 సం॥రముల క్రితమే ప్రారంభింపబడినది. కాని రానురాను ప్రచారము లేకపోవుటచేతను యువకులం దుత్సాహము సన్నగిలుటచేతను పూర్వము స్థాపింపబడిన పెక్కు గ్రంథాలయములను పునరుద్ధరింపవలసి యున్నది. గ్రంథాలయములు లేని గ్రామములందు నూతనముగ గ్రంథాలయములను స్థాపించవలెను. గ్రామములయందు, విద్యా, ఆర్థిక, భౌతిక, సాంఘిక, మత, రాజకీయాభివృద్ధి కలుగజేయవలెను, ఇట్టి సర్వతోముఖాభివృద్ధికి గ్రంథాలయములే పునాదులు.

ఈ సంఘము గ్రంథాలయముల స్థాపించి పునరుద్ధరించి కొన్ని గ్రంథములను వాటికి సమకూర్చుటయే కాక, ఆ గ్రంథములను గ్రామస్థులచే చదివించియు, జ్ఞానులచే నుపన్యాసము లిప్పించియు, మాజికులాంతరు మొదలగు సాధనములచే జ్ఞానాభివృద్ధి కలుగచేసియు, నవీనపద్ధతుల వ్యవసాయము చేయుట, దేశమునందలి వివిధప్రాంతములందలి ధరవరలును కనుగొని వెల్లడి చేయుట—ఇవి యవి యననేల? గ్రామస్థులలో, స్త్రీ పురుషజాతిమతవిభేదములేక సౌఖ్యసంపన్నులుగా నుండుటకు తగు నుపాయము లరయుచు ప్రబోధించుచుండవలసియున్నది. కాన దేశసేవాతత్పరులును, కార్యదీక్ష కలిగిన త్యాగశీలురును ప్రతిగ్రామమునందును ఏ కొలదిమందైనను ఈ సంఘమునకు సహాయముచేసినగాని పైన వివరించిన విషయములన్నింటియందు కృషిసల్పుట దుస్సాధ్యము. కనుక తాలూకా ప్రజలందరు ఈ తాలూకా గ్రంథాలయసంఘమునకు యథాశక్తి సహాయముచేసి తాలూకాయందలి ప్రజలు అన్నివిధముల అభివృద్ధి చెందగలందులకు చేయు ప్రయత్నములను సఫలపరచగలందులకు కోరుచున్నాడను.

పాలకోడేటి సత్యనారాయణశర్మ,
కార్యదర్శి,

భీమవరం తాలూకా
గ్రంథాలయ మహాసభ.

ప. గోదావరిజిల్లా భీమవరం తాలూకా గ్రంథాలయ మహాసభ ది 11-2-34 ఆదివారము మధ్యాహ్నము కుముదవల్లి గ్రామములో సర్దారు దండు నారాయణ రాజుగారి అధ్యక్షతను జరుపబడెను. సాగి వెంకట నరసింహారాజుగారు ఆహ్వానించుచు నందరకు స్వాగతమును పల్కిరి. శ్రీయుత కామరాజు హనుమంతరావుగారు మహాసభను ప్రారంభించుచు జ్ఞానమును గురించియు, ఆ జ్ఞానము లభించు మార్గములను గురించియు అందు గ్రంథాలయములు చేయు సేవను గురించియు విపులముగా చెప్పిరి.

అధ్యక్షులగు సర్దారు దండు నారాయణరాజుగారు విద్యనుగురించియు ప్రస్తుత భారతదేశమందలి విద్యాహీనతను గురించియు, గ్రంథాలయములు విద్యాభివృద్ధికై చేయుసేవను గురించియు, మదరాసు శాసనసభ యెదుటనున్న గ్రంథాలయ చట్టమును గురించి ఆంధ్రదేశ గ్రంథాలయ మహాసభాధ్యక్షోపన్యాసములో శ్రీయుత వేమవరపు రామదాసు పంతులుగారు చేసిన ఖండనతో తాను పూర్తిగా నేకీభవించుచున్నాననియు, ఈ చట్టము గ్రంథాలయోద్యమాభివృద్ధికి తోడ్పడునట్టిదిగా గన్పట్టుట లేదనియు ప్రస్తుతము భారతదేశములో నున్న దుర్భర ఆర్థికస్థితిలో పండిన పంట పన్నులకే చాలని ఈ రోజులలో నింకను క్రొత్త పన్నులను వేయు చట్టమును చేయబూనుట క్రూరత్వమనియు చెప్పిరి.

తరువాత డాక్టరు తేతలి సత్యనారాయణగారు గ్రంథాలయ పరిపాలన గురించియు, గ్రంథాలయముల ఆవశ్యకతను గురించియు, ముదుగంటి జగ్గన్నశాస్త్రిగారును, 'నేటి కవసరమగు విద్యను' గురించి కొవ్వలి గోపాలరావుగారును, 'ప్రజాసేవను' గురించి చంగల్వల చిట్టిపంతులుగారు 'గ్రామోద్ధరణమును' గురించి కలిదిండి నరసింహరాజుగారును, 'అస్పృశ్యతనుగురించి' రాయసం వెంకటశివుడుగారును స్త్రీవిద్యగురించి కోటమర్తి కనకమ్మగారు నుపన్యసించిరి. అనంతరము ఈ దిగువ తీర్మానములు చేయబడినవి.

తీర్మానములు

1. అఖండత్యాగశీలురును, దేశసేవా తత్పరులును, భారతజాతీయనాయకులును అగు శ్రీయుత విఠలభాయి పటేలు, సేనుగుప్తాగార్లును శ్రీయుత పొన్నపల్లి వీరరాఘవ సోమయాజులుగారును, ఆంధ్రదేశమున ఆంధ్రవాఙ్మయాభివృద్ధిగావించి ఆంధ్రపత్రిక సంపాదకులుగాయున్న శ్రీయుత చల్లా శేషగిరిరావుగారును, బరంపురం నివాసులగు సుప్రసిద్ధ ఆంధ్రులును అయిన శ్రీయుత ఉన్నవ రామలింగం పంతులుగారును, హిందూ పత్రికాధిపతియగు శ్రీయుత రంగస్వామి అయ్యంగార్ల నిర్యాణమునకు ఈ సభవారు చింతించుచు వారి ఆత్మకు శాంతి యొసంగుగాక! యని భగవంతుని ప్రార్థించుచున్నారు.

2. కార్యదర్శిగారు క్రిందటి సంవత్సరము చేసిన పనినిగురించి చెప్పిన నివేదిక నామోదించడమైనది.

3. శ్రీ బషీరు అహమ్మదుగారిచే మద్రాసు శాసననిర్మాణసభయందు ప్రవేశపెట్టబడిన మద్రాసు గ్రంథాలయ చట్టము (Bill No XI of 1933) ఈ రాజధానియందు ప్రాముఖ్యమగు వివిధదేశభాషలయొక్క వికాసమునకు దోహద మిచ్చునదిగా గన్పట్టుటలేదనియు, ప్రస్తుత దేశపరిస్థితిగతులయందు అభివృద్ధికి భంగకరముగ నున్నదనియు, నూతన పన్నులను వేయునట్టి ఎట్టి చట్టముగాని దేశమున ఆవరించియున్న ప్రస్తుత దుర్భర ఆర్థికదుఃస్థితియందుప్రవేశపెట్టుట భావ్యముకాదనియు, ఈ సభవారు తీర్మానించుచు ప్రభుత్వమువారికి విన్నవించుచున్నారు.

4. మద్రాసు గ్రంథాలయచట్టమును విచారించుటకు చట్టనిర్మాణసభకు, ఉపసంఘమునకు సభ్యులుగ ప్రభుత్వమువారితరపున శాస్త్రజ్ఞానవేత్త (Technical Expert)గ నియమింపబడిన మద్రాసు గ్రంథాలయసంఘాధ్యక్షులగు శ్రీ కే. వి. కృష్ణస్వామి అయ్యరుగారికి గ్రంథాలయ పాలన అనుభవజ్ఞానముగాని, పల్లెటూరి గ్రంథాలయలమునుగూర్చిన అనుభవము గాని

భూతిగా లేదని ఈ సభవారు వినయపూర్వకముగ విన్నవించుచు, వారి అభిప్రాయములను ఆధారములుగా తీసికొనరాదని మద్రాసు ప్రభుత్వమువారిని, మద్రాసు శాసన సభవారిని ఈ సభవారు వినయపూర్వకముగ కోరుచున్నారు.

5. గ్రామము నందలి విద్యావ్యాప్తికి ప్రాథమిక పాఠశాలలవలె, గ్రంథాలయములుకూడ తోడ్పడును. కాన, జిల్లా బోర్డువారు గ్రామ గ్రంథాలయములకు విరివిగా విరాళముల నిచ్చియు, గ్రంథాలయములు లేని గ్రామములయందు గ్రంథాలయములను నెలకొల్పియు గ్రంథాలయాభివృద్ధి కలుగచేయగలందులకు ఈ సభవారు జిల్లాబోర్డువారిని కోరుచున్నారు.

6. గ్రామములలో నుండు సహకార సంఘముల యందు నేర్పడు సాముదాయకనిధి నంతయు ఆ యా గ్రామముల యందలి గ్రంథాలయముల కిచ్చి విద్యాభివృద్ధికి తోడ్పడగలందులకు తాలూకాలోని సహకార సంఘములను ఈ సభవారు కోరుచున్నారు.

7. రాష్ట్రీయ ప్రభుత్వమువా రిచ్చు గ్రాంటులతో కొను పుస్తకములకు విద్యాశాఖాధికారుల అనుమతి అవసరమనుట అన్యాయమని ఈ సభవారు నిర్ణయించుచు, అట్టి అనుమతిని లేకుండనే బహిష్కరింపబడని పుస్తకములనే గ్రంథాలయ సంఘమువారు కొనుటకు అధికార మిచ్చుచు ఉత్తరువును జారీచేయించగలందులకు మద్రాసు ప్రభుత్వమువారిని కోరుచు, అట్టి బహిష్కరణ పుస్తకముల పట్టని అన్నిగ్రంథాలయములకు ఉచితముగా పంపగలందులకు ఈ సభవారు ప్రభుత్వము వారిని వేడుచున్నారు.

8. ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము రిజిష్టరీ అయినదిగాన, ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘశాఖలగు తాలూకా గ్రంథాలయ సంఘములకు దానియందు చేరిన (affiliats) గ్రామ గ్రంథాలయములకుగాని వేరేరిజిష్టరీ అవసరము లేకయే వరుసగా రిజిష్టరీ సంఘములుగను, రిజిష్టరీ గ్రంథాలయములుగను పరిగణించుచు ఉత్తరువును జారీచేయించగలందులకు మద్రాసు ప్రభుత్వము వారిని ఈ సభవారు కోరుచున్నారు.

9. కార్యనిర్వాహక వర్గముచే తయారుకాబడిన మాదిరి నిబంధనలు ఆమోదించుచు వాటిని తాలూకా గ్రంథాలయ సంఘమునకును, గ్రామగ్రంథాలయ సంఘములకును అమలుపరచగలందులకు తీర్మానించుచు వాటిని అచ్చువేయించి తాలూకాగ్రంథాలములో చేరు గ్రంథాలయము లన్నిటిని ఇచ్చుటకు తీర్మానించడమయినది.

10. ఈ దిగువవారిని కార్యనిర్వాహక సభ్యులుగా రాబోవు సంవత్సరమునకు ఎన్నుకొనడ మయినది.

1 భూపతిరాజు తిరుపతిరాజుగారు, కుముదవల్లి 2 ముదుండి లక్ష్మినరసింహంగారు, పెదఅమరం 3 పాలకోడేటి సత్యనారాయణ శర్మగారు, భీమవరం 4 వేగేశ్న సూర్యరాజుగారు, పాందువ్వ. 5 కొత్తపల్లి వెంకటపతిరాజుగారు, పాలకోడేరు 6 తటవర్తి కృష్ణమూర్తిగారు, భీమవరం. 7 సాగి వెంకట్రామయ్యగారు, చినఅమరం. 8 గంధం రామారావుగారు, ఉప్పలూరు. 9 గొడవర్తి సూర్యనారాయణగారు, అండలూరు. 10 చంగల్వల చిట్టిపంతులుగారు, రాయమదురు. 11 శ్రీపాద భగవన్నారాయణగారు, భీమవరం. 12 భమిడిపాటి సూర్యనారాయణగారు, 13 జంపన రామయ్యగారు, అయిభీమవరం. 14 ప్రసుల సాగరంగారు, చినరంగనిపాలెం. 15 జూపూడి కేశవరావుగారు, భీమవరం. ఇంక నితరులను చేర్చుకొనుటకును అధికార మివ్వడమయినది.

11. ఈ దిగువ వారిని ఆయా హోదాదారులుగ ఎన్నుకొనడ మయినది.

భూపతిరాజు తిరుపతిరాజుగారు, అధ్యక్షులు.
జూపూడి కేశవరావుగారు, ఉపాధ్యక్షులు.
ముదుండి లక్ష్మినరసింహారావుగారు,
పాలకోడేటి సత్యనారాయణ శర్మగారు,
సంయుక్త కార్యదర్శులు.

12. 1934-35 సంవత్సరము తాలూకాగ్రంథాలయసభకు శ్రీ గంగేశ్వరానంద గ్రంథాలయ సంఘము వారి ఆహ్వానమును అంగీకరించడ మయినది.

పిల్లలగ్రంథాలయము.

అమెరికాదేశమందు "క్వారీఫారము" అనునది ఒక చిన్న పల్లెటూరు. ఆ గ్రామమునకు చుట్టుప్రక్కల అనేక మైళ్ళలోపున గ్రంథాలయ మెద్దియును లేదు. అందుచేత ఆ గ్రామమందున్న పిల్లలు తీరికసమయము లందు విశ్రమమును పొందవలెననిన, తమకు తోచిన పాతరకపు ఆటలనైన ఆడుకొన వలెను. లేదా, దగ్గరనున్న పట్నమునందున్న సినిమాకైనా బోవలెను. ఆ గ్రామమునందున్న పిల్లలలో చాలమంది పొలములలో వ్యవసాయము జేసికొనుచుండు రైతుబిడ్డలు - వారందరు జ్ఞానసముపార్జనాసక్తులగు తెలివితేటలు గలిగిన పిల్లలు.

ఆ గ్రామమందు పూర్వకాల మెప్పుడో కోడిపిల్లల కొఱకు రాతితో కట్టినట్టి అందమైన చిన్న ఇల్లొకటి గలదు. ఈ మధ్యకాలమందా యిల్లు పటములు వ్రాసి కొనుటకు ఉపయోగించుచుండిరి. ఇప్పుడు అచట అపని యును జరుగుటలేదు. అందుచేత ఆ యింటిని, గ్రామ గ్రంథాలయముగ మార్చిన బాగుండునని తలంచిరి.

వెంటనే ఒకబల్ల, కొన్నికుర్చీలు, కిటికీలకు తెఱ బట్టలు సంపాదింపబడెను. ఆ ఇంటియందున్న అలమ రలు - మూలలు - సందులు - గొందులు - ఎల్లెడల నాకర్షవంతములగు గ్రంథములతోను పటములతోడను ఆటలతోడను నింపివేయబడెను. అందుచేసిన యేర్పాటు లన్నియు పిల్లలను ఆకర్షించునవిగను, వారి తృష్ణను సంతుష్టిపరచునవిగను ఉన్నవి.

ప్రారంభోత్సవమునకు ఆ గ్రామమందలి పిల్లలంద రును ఆహ్వానింపబడిరి. ప్రథమమున ఒకగంటసేపు పిల్ల లకు కథలు చెప్పిరి. తర్వాత ఆటలు - తుదకు ఫలహార ములు. అప్పుడు గ్రంథాలయముయొక్క అభిప్రాయ ములు అందరికిని విప్పిచెప్పబడినవి. తుదకు పిల్లలంద రును తలకొక పుస్తకమును దీసికొని సంతోషముతో ఇంటికి బోయిరి.

ఆ గ్రంథాలయమందు ఏపిల్లలైన సభ్యులు కాదలం చినయెడల, సభికుల పట్టికయందు సంతకము జేసిన జాలును. వానికి ప్రథమమున గ్రంథాలయముయొక్క నిబంధనలు విప్పిచెప్పబడును. అచటి గ్రంథము లన్నియు విషయములనుబట్టి వర్గీకరణము చేయబడినవి. ప్రతి గ్రంథమునందును ఒక కార్డును చీటీయును గలవు. వాని మీద, ఆ గ్రంథమును తిరిగి ఎన్నిదినములలో వాపసు జేయవలసి యుండునో సూచింపబడియుండును. పిల్లలు గ్రంథమును తీసికొనిపోవునప్పుడు పెద్దవారెవ్వరును తనిఖీ చేయుటలేదు. వారు గ్రంథములను ఎరువు తీసి కొని పోవునప్పుడు "కార్డు" మీద సంతకముజేసి, అది పెట్టుటకై నియమితమైన చిన్న డ్రాయరునందు దాని నుంచెదరు. ఆ డ్రాయరుబల్లప్రక్కనే తారీకు లను దెలుపు "క్యాలండరు" వ్రేలాడగట్టబడి యుండును. పుస్తకమును తిరిగి ఇవ్వవలసిన తారీకును అందు జూచుకొని, ఆ తారీకును వ్రాయవలసినచోట పిల్లలే వ్రాయుదురు. ఇది యంతయును ఏ తనిఖీయును లేకుండనే జరిగిపోవుచుండును. అయినప్పటికిని పుస్తక ములు ఎరువుతీసికొనువారిపేరు వ్రాయునప్పుడుగాని, తిరిగి గ్రంథమును ఇయ్యవలసిన తారీకును నమోదుచేయ టయందుగాని పొరబాటులు ఎంతమాత్రమును జరిగి యుండలేదు. పుస్తకములు ఏమియూ పోవుటగూడ జరిగి యుండలేదు.

గ్రంథాలయమునకు వచ్చి అదివరకు తీసికొనిపోయిన గ్రంథములను వాపసుజేసి తిరిగి క్రొత్తగ్రంథములను తీసికొనిపోని దిన మేదియూ ఎండకాలమునందు లేనే లేదని చెప్పిన నతిశయోక్తి ఎంతమాత్రమునుగాదు. కొందరు పిల్లలు గ్రంథాలయమునకు వచ్చుటకుగాను రెండు మూడు మైళ్లదూరమును - అంతకంటె నెక్కు వయునుగూడ నడువవలసియుండును. చపలులగు అయిదు లేక ఆరు సంవత్సరములు వయస్సు గలిగిన పసికూనలు కూడ తమ సోదరులతోగాని, సోదరీమణులతోగాని గ్రంథాలయమునకు వచ్చి బొమ్మలపుస్తకములున్న అరలు వారల బుచ్చికనులను ఆకర్షింపజేయగా, వానిని చూచి చూచి, తుదకొక పుస్తకమును తీసికొని తమచంకల యందు గట్టిగా అదిమిపెట్టికొని ఇంటికి పోవుచుందురు. కొందరు పిల్లలు బిడియముగలియుందురు; మరికొందరు మోటుదేరి యుందురు. అట్టివారుగూడ ఈ గ్రంథాలయ మునకు వచ్చి గ్రంథములను దీసికొని పోవుచుండుట ఆశ్చర్యకరమైనట్టియు, ముదావహమైనట్టియు విషయము.

ఒకదినమున ఆ గ్రంథాలయమునకు ఒక చిన్నపిల్ల వచ్చి "మా అన్నయ్యకు ఒక పుస్తకము ఇస్తారా" అని అడిగినది. ఆ అన్నయ్యయొక్క వయస్సునుబట్టి, తగిన పుస్తకమును ఏర్చి ఇచ్చుటకుగాను అతని వయస్సెంత? అని అడిగిరి. దానికా పిల్ల ఇట్లుచెప్పినది. "మా అన్న

య్య చాల పెద్దవాడు; సుమారు ఇరవై సంవత్సరము లుండును.” అతనికి అనువుగ నుండునట్టి గ్రంథము ఇయ్యబడినది. వారము దినములు కాగానే ఆ పెద్దన్నయ్య చెల్లెలు వచ్చి, తీసికొనిపోయిన పుస్తకమును వాపసు ఇచ్చి, తన అన్నయ్య పుస్తకము బాగుగా నున్నదని చెప్పినాడనియు తిరిగి ఇంకొక పుస్తకమును తీసికొని రమ్మన్నాడనియు చెప్పి, ఇంకొక పుస్తకమును తీసికొని వెళ్ళినది.

ఈ గ్రంథాలయము కొన్ని వందల పుస్తకములతో మాత్రము ప్రారంభింపబడినది. ఆ సంఖ్య దినదిన ప్రవర్ధమాన మగుచున్నది. ఈ యుద్యమమును విన్న స్నేహితు లందరును, అనేక గ్రంథములను పంపి తోడ్పడిరి. “ఫిలడల్ఫియా”యందు ఒక ప్రయివేటు పాఠశాలయందలి విద్యార్థులు చాల గ్రంథముల నిచ్చిరి.

శీతకాలమందు పిల్లలు బడిచదువులతో మునిగియుందురు; అందుచేత నా కాలమున పిల్లలు గ్రంథాలయమునకు విశేషముగా రారు. వేసవికాలపు సెలవుదినములందు ఈ గ్రంథాలయము ఎడతెరపిలేకుండ ఉపయోగింపబడుచున్నది. ఆ గ్రామమందలి పిల్లల జీవితమునందు ఈ గ్రంథాలయము అద్భుతమగు మార్పు గలిగించుచున్నది.

గ్రామగ్రంథాలయము.

“వర్జినియా” దేశమందు “బాన్ ఎయిర్” అను చిన్న గ్రామమందు పదునారు సంవత్సరములనుండి ఆ గ్రామమునందలి దేవాలయము (Church) నందు పూజారిగా నున్న “హొజనా” అను పరోపకారపారీణుని కార్యదీక్షవలన 1901 వ సంవత్సరమందు సార్వజనిక గ్రంథాలయము ఒకటి స్థాపింపబడినది; ఆ గ్రంథాలయమునకు ఆయనయే ప్రథమాధ్యక్షుడుగా నుండెను. 1902 వ సంవత్సరమునం దాయన చనిపోగా ఆయన జ్ఞాపకార్థ మా గ్రంథాలయమునకు స్వంతభవనము కట్టి 1903 వ సంవత్సరమున ప్రారంభోత్సవమును జేసిరి. ప్రారంభోత్సవమునకు వచ్చినవా రందరును ఒక్కొక్క పుస్తకమును దానము జేసిరి.

గ్రంథాలయమునకు పుస్తకములను కొనుటకు నిల్వ సొమ్మేమియు లేదు. అందుచేత అప్పుడప్పుడు అనేక వేడుకలను ఏర్పాటు జేసి, గ్రంథాలయాధికారులు సొమ్మును సంపాదించుచుందురు. గ్రంథాలయమునకు స్థిరమైన ఆదా సభ్యత్వపు చందామాత్రమేను. సభ్యుల చందా సంవత్సరమునకు ఒక డాలరు (రు. 2-8-0 లు) అట్టిచందా నిచ్చు సభ్యులు 27 గురు మాత్రము కలరు. వీరివలన సంవత్సరమునకు 27 డాలర్లు (రు 67-8-0 లు) మాత్రము వసూలగును. ఈ సొమ్ములో నుండియే, పత్రికలు తెప్పించుటకు చందాలు, వంటచెరకు (ఆ దేశమునందు చలి విస్తారముగా నుండుటచే ప్రతి యింటియందు వెచ్చగా నుండుటకై ఎల్లప్పుడు నిప్పు రాజుచు నేయుందురు). ఊడ్చుటకు, మరమ్మతులుచేయుటకు కావలసిన సొమ్ము ఖర్చుపెట్టవలసియుండును. అందుచేత క్రొత్త పుస్తకములు కొనుటకు సొమ్మేమియు అందుండి మిగులదు.

ఆ గ్రామస్థు లందరికిని పుస్తకములు ప్రతి మంగళవారమునాడు సాయంకాలము నాలుగుగంటలు మొదలు అయిదు గంటలవరకు ఇచ్చెదరు. ఆ పుస్తకములను తిరిగి మరుచటి మంగళవారమునందు వాపసు జేయవలయును. అట్లు వాపసు జేయనివారు తిరిగి ఆ గ్రంథమునే ఎరువు తీసికొనవలెను. వాపసు జేయకను, తిరిగి ఎరువుతీసికొనకను ఉండువారు జుల్మానా ఇయ్యవలసియుండును. తీరికసమయములం దెల్ల ఆ గ్రామస్థులు గ్రంథాలయమందే చేరియుండెదరు. గ్రామస్థు లందరికి గ్రంథాలయము సాముదాయిక ప్రదేశముగ నేర్పడినది. మంగళవారమునాడుమాత్రము గ్రంథాలయమునకు వచ్చువారందరికి “తేయాకునీరు”ను అల్పాహారములును సప్లయి చేయబడును. పళ్ళెము 1 కి అయిదుసెంట్లు (డాలరుకు 100 సెంట్లు - డాలరుకు రు 2-8-0 లు) ఖరీదు. ఆనాడు గ్రంథాలయమునకు చాలమంది వచ్చెదరు. ఔదార్యవంతులగు అనేకమంది గ్రంథకర్తలును, ప్రకాశకులును తమ గ్రంథములను గ్రంథాలయమునకు దయతో నొసంగిరి. గ్రంథాలయమందు 3,500 గ్రంథములు గలవు.

గ్రంథభాండాగారియగు “ఫ్రాంచెస్ విథర్స్”అను నామె 1906 సంవత్సరమునుండియు గ్రంథాలయమునకు ఉచితసేవను జేయుచున్నారు.

కీర్తిశేషులైన బెల్గాం రామదాసునాయుడుగారి స్వీయ చరిత్ర.

జననము:—

వీరు సెకందరాబాదు అను నైజాము ఇలాకాలో జన్మించి, కొచ్చి, కొల్లడం, తిరుచునాపల్లి, చెన్నపట్నం మొదలగు ప్రదేశములలో పెరిగి బెంగుళూరు చేరెను. వీరి తండ్రియగు నారాయణస్వామిగారు బ్రిటిష్ సైన్యమందొక యుద్యోగిగా 21 వ మదరాసు పయినీరు పటాలమునందు నున్నందున ఆ పటాలము ఎక్కడకి పోయిన వీరు వీరి తండ్రివెంట వెళ్లుచుండువారు. కొన్నిదినములకు బెంగుళూరినుండి బెల్గాము అను బొంబాయిరాజధానికి వీరి తండ్రిగారు ప్రయాణము చేసిరి. వారివెంట వీరును, వీరియన్నయగు దొరస్వామిగారును వెళ్లిరి. కొన్నిదినములకు వీరి తండ్రిగారు చీనల్సు యుద్ధమునకు పోవలసినవారైరి. అప్పటికి దాసుగారి అన్నగారివయస్సు 12 సంవత్సరములు. దాసుగారి వయస్సు సుమారు 10 వత్సరములు. తండ్రిగారు యుద్ధమునకు వెళ్లుటకుమునుపు వీరిని వీరితల్లి సంరక్షణక్రింద చెన్నపట్టనమున వదలిరి. అచ్చట ఒక సంవత్సరము ఉండునంతలో, వీరి తండ్రిగారు యుద్ధము ముగించిన తోడనే వీరిని చెన్నపట్టనమునుండి బెల్గామునకు పిలిపించిరి. అచ్చట రెండు సంవత్సరములు ఉండునంతలో మరి వారితండ్రిగారికి పంజాబునకు ప్రయాణము తగిలెను. అందువలన కీ. శే. దాసుగారి మేనత్తగారు బళ్లారిలోనున్న వారి వశములోనుంచి వెళ్లిరి. అప్పటికి వీరు ఆంధ్రభాష యన నెట్టిదో యెరుగరు. ద్రావిడభాషయే మాతృభాషగా నుండెను.

భాష:—

అప్పుడు హిూణభాషయందు కొంచెము ప్రవేశము కలదు. బెల్గామునకు వచ్చిన తరువాత నాంధ్రభాషయందు శ్రీ దాసుగారు ప్రవేశించిరి. కాని వీరి యన్నగారు ఆంధ్రభాషయందు ప్రవేశింపక యెప్పుడును చెన్నపట్టణమునందే కాలము గడుపుచు వచ్చిరి. కీ. శే. దాసుగారు మాత్రము బళ్లారియందే వీరి మేనత్తగారి సంరక్షణములో నుండి కొంతవరకు తెనుగు నేర్చినపిమ్మట బళ్లారి వారడ్లా హైస్కూలులో 8 వ తరగతిలో చేరిరి. 1901 నవంబరు నెలలో అంతలో పంజాబునకు వెళ్లియుండిన వీరి తండ్రిగారు ఉపకారవేతనమును పుచ్చుకొని బళ్లారి చేరినారు. ఉపకారవేతనముకలన వచ్చుపైకము వీరి మువ్వురికి చాలనందున వీరి తండ్రిగారు ఒకఅంగడిని పెట్టిరి. అందువలన వచ్చు ఆదాయముతో జీవనము జరుపుకొనుచుండిరి. 1906 అక్టోబరు నెలయందు శ్రీ కీ. శే. దాసుగారి అన్నగారు పరలోకగతులైరి. అప్పటికి దాసుగారు 3 వ ఫారము చదువుచుండిరి. 1907 లో బళ్లారికి ప్లేగు మొట్ట మొదట సంభవించెను.

వారిరువురును మేనత్తయును, దొరతనమువారు ఈ వ్యాధివిషయములో పెట్టుచున్న నిర్బంధములకు, నిలువజాలక అనంతపురంజిల్లా గుత్తితాలూకా విడుపనకల్లు అను గ్రామమునకు బంధువులు ఉండుట వలన అక్కడికి వచ్చి చేరిరి. అప్పటికే శ్రీ దాసుగారి తండ్రిగారు జబ్బుగా నుండిరి. దినదినము జబ్బు హెచ్చుకాజొచ్చెను. 1907 డిసెంబరు నెల 31 వ తేదీన వీరి తండ్రి చనిపోయెను. బళ్లారికి వీరు వచ్చి ఒంటరిగా వారి పూర్వస్నేహితులవలన కొంతకాలము గడపిరి. కాని వీరియునికివలన తోడిస్నేహితు లందరికిని విసుగు కలుగుటచే (ధనములేని వానిని ఎవరును చేరరు. ధన మున్నప్పుడే సర్వబంధువులు ఆశ్రయింతురు అని తెలిసి) వీరిమేనత్త బావకుమారుడు చెంగల్వరాయునివద్ద 3 మాసములుగడపెను. అక్కడనే యుద్యోగమునకుండ దలచెను గాని శ్రీ చెంగల్వరావునాయుడుగారు బంధువులను నౌకర్లుగా నుంచుకొనుట బాగులేదనిచెప్పినారు.

ఇక్కడ ఈ బ్రతుకు బ్రతుకుటకంటె మరెక్కడికైన దేశాంతరము వెళ్లిన బాగని తలచి బళ్లారి తాలూకాకు చేరిన రూపనగుడి గ్రామమునకు కాలినడకతో చేరిరి. అచ్చట నొక్క స్నేహితుడు దొరికి అన్నము పెట్టెను. అచ్చటినుండి వుండబాడ గ్రామమునకు సాయంత్రము వచ్చి చేరిరి. రాత్రి భోజనములేదు. ఒక దేవళమున పరుండి తెల్లవారి లేచి నడువ మొదలిడిరి. ఆకలిబాధ హెచ్చుగా నుండెను. దారిలో నిరుప్రక్కల చపాతి కళ్లిపండ్లు విరివిగా పండియుండుట జూచి కొన్ని తిని వండలో నీళ్లు త్రాగి రేణిమాకులపల్లెకు 10 గంటలకు చేరిరి. అన్నమునకుగాను చాల కష్టపడుచుండగా తుదకు ఒక రైతు చేరబిలిచి అన్నము పెట్టినాడు. అచ్చట కొంతసేపు విశ్రాంతి తీసికొని పురవకొండ గ్రామమునకు వచ్చిరి. ఒక లోకల్ ఫండు కంట్రాక్టరుతో కలిసి పనియేదైన నున్నదా అని అడుగగా పనియేమియు లేదని ప్రత్యుత్తర మిచ్చెను.

ఉపాధ్యాయవృత్తి - రు 4-0-0 జీతము:—

వెంటనే ముష్టూరు అనుగ్రామముమీదుగా మోపిడి అను గ్రామమునకు వెళ్లిరి. ఆగ్రామాధికారి వీరిని జూచి మీ రెవరు? ఏల యిక్కడకు వచ్చిరి. అని ప్రశ్నింపగా ఇక్కడ నెవరైన చదువుకొను వారుండిన నేను ఇంగ్లీషు. తెనుగు చెప్పగలను. అని బదులుచెప్పెను. గ్రామాధికారి కొమారుల కిరువురకు విద్యగరపవలెను. భోజనము పెట్టి నెలకు 4/-రూపాయలు జీతము ఏర్పాటు చేయబడెను. 1909 మే మాసమునుండి 6 మాసములు అచ్చట గడపిరి. మోపిడిగ్రామమునకు 1½ మైళ్ల సమీపమున కత్తెబూదెహాల్ (ఇందావతి) ఉపాధ్యాయుడు అపుడపుడు వచ్చి వీరిని పలుకరించి పోవుచుండిరి. ఇందావతి రాయచూరు యిరువన్నా మరదలను శ్రీ కీ. శే. దాసుగారికి ఇచ్చి వివాహము చేయునటుల నీ యుపాధ్యాయుడు మాట్లాడెను. వివాహము 1909 నవంబరు మాసమున జరుపబడెను.

ఉపాధ్యాయవృత్తి: జీతము రు 10-0-0:—

పాలూరుగ్రామము కరిణము కొమారులకు చదువు చెప్పుటకుగాను నెలకు 10/లు వేతనముపైన పాలూరునకు భార్యాసమేతముగా వెళ్ళిరి. 1910 సం॥రము ఏప్రియల్ నెలలో 12 సంవత్సరముల వయస్సుగల విద్యార్థి బడికి రానందున మరుదినము అదేపిల్లవాడు వచ్చినపుడు నీవు బడికి వచ్చుటకు ఇష్టమున్నచో సక్రమముగా రావలెను. లేనియెడల నెక్కడనైన భావిలో పడి చచ్చుట మేలని దండించిరి. మరుదినము బాలు రందరు వచ్చిరి కాని, దండింపబడిన బాలుడు మాత్రము రాలేదు. బాలుడు నిజముగా ఉరివేసుకొని చనిపోయినాడు. దైవానుకూల్యమువలన ఆకేసు ఎవరిపైనను లేకుండునటుల కొట్టివేయబడెను.

వ్యాక్సినేటరు ఉద్యోగము:—

ఆగ్రామ కరణముగారు వీరికి నెలసరి జీతము సక్రమముగా నిచ్చు చుండనందున నేదయిన ఇతర ఉద్యోగము చూడవలెనను కుతూహలము వారి కుండెను. అంతలో డెప్యూటీ యిన్స్పెక్టరు అఫ్ వ్యాక్సినేషన్ గారు అక్కడ అకస్మాత్తుగా కలిసికొని వీరికి ఎక్కువ పరిచితు లయిరి. వీరికి మునిసిపల్ వ్యాక్సినేటరుపని దొరకెను. జీతము రు 10/- మాత్రము. 1910 సం॥రము ఏప్రిల్ నెల 7 వ తేదీ మొదలు 1912 సంవత్సరము జనవరి నెలవరకు ఈ యుద్యోగమునందే యుండిరి. పిమ్మట లోకల్ ఫండు వ్యాక్సినేటరుగా నియమింపబడిరి. రిజర్వు వ్యాక్సినేటరుగా నుంచిరి. 6 రోజులు సెలవుతీసికొని కత్తెబూదెహాళ్ (ఇందావతి గ్రామమున ప్రైవేటుపాఠశాల విద్యార్థుల కొరకు) సంఘము నేర్పాటుచేసిరి. రిజర్వు వ్యాక్సినేటరుగా నున్నందున జిల్లాయందు ఎక్కడెక్కడ అవసరమో అక్కడికి పోవలసివచ్చెను. వీరి భార్య మేన తను వరియంపేట అను గ్రామమున (అనంతపురంవద్ద)నుంచిరి.

సేద్యము నష్టము:—

ఆ గ్రామమున భూమి ఎ 100 లకు 11 యెకరములు కొనిరి. సేద్యముచేయవలెనను అభిలాష హెచ్చుగా నుండెను. సమీపముననున్న సర్కారుభూమిని సహ సాగుచేయుచుండిరి. ప్రథమసంవత్సరము వేరుసెనగ వితనము చల్లించిరి. జర్మనియుద్ధము 1914 జనవరి నెలలో ప్రారంభ మయినందున పండినపంటకు ధరలేక చాల నష్టము సంభవించెను.

ఉరవకొండ గ్రామమునకు సమీపమున ఇందావతి గ్రామమునకు వచ్చి వెనుక తాను విద్యార్థులకుగాను స్థాపించిన సంఘమును గ్రామ ఐకమత్య సంఘ మను పేరుతో పునరుద్ధరణ గావించిరి.

మరల ఉపాధ్యాయపదవి:—

సేద్యమువల్ల నేమియు లాభములేదని తలచి 1915 సం॥రము జనవరి నెల 6 వ తేదీన లోకల్ ఫండు ఉపాధ్యాయపదవి యొకటి గూడుగ్రామమున దొరకెను. 5 మాసములు అచ్చట పనిచేయునంతలో ఆ పదవికి ట్రెయినింగు అయిన ఉపాధ్యాయులు ఇతని స్థలమునకు వేయబడినందున వీరికి పనిలేకపోయెను. ఒకటి రెండు మాసములలో కూడేరు అను గ్రామమునకు ఉపాధ్యాయుడుగా పోవునటుల వుత్తరువు రాబడెను.

రామమోహన గ్రంథాలయ స్థాపనము:—

1919 వ సంవత్సరమున వురవకొండ గ్రామమున రామమోహన గ్రంథాలయము స్థాపింపబడినపుడే కీ. శే. దాసుగారు సహ వురవకొండ గరల్సుస్కూలు మాష్టరుగా మార్చబడిరి. శ్రీ దాసుగారే గ్రంథాలయ కార్యదర్శిగా నుండునటుల చేయబడెను,

వీరు కార్యదర్శి పదవికి వచ్చినతరువాత ప్రతి నెలకు చందాలమూలముగా రు 0,80 రూపాయలు

వసూలుచేయుచు అనేక వందల గ్రంథములను గ్రంథాలయమునకు తెప్పించి సభ్యులు, ఇతరులు చదువునటుల చేసెను. దినపత్రికలు వారపత్రికలుసహా తెప్పింపబడుచుండెను.

సేవావ్రతము.

మూడు స్థలములందు ప్రత్యేకముగ ఉపాధ్యాయులను వేతనములపైన నియమించి రాత్రి పాఠశాలలను జరుపుచుండెను. గ్రంథాలయమున ఉచితముగా నేత పరిశ్రమ గఱపునటుల ఏర్పాటుచేయబడెను. శ్రీ దాసుగారు స్వయముగా నేత నేర్చుకొని, విద్యార్థులకు నేర్పుచు, కాయకష్టమునందుగల గౌరవమును ప్రస్ఫుటించిరి. బాలభటోపాధ్యాయ శిక్షణ కోడూరుగ్రామమున-ఆంధ్రరాష్ట్రీయ బాలభట నాయకులగు అయ్యంకి వేంకటరమణయ్యగారిచే నిర్వహింపబడిన శిక్షా శిబిరమునందు, వీరును యం. వెంకటరమణప్పగారును పొంది గ్రంథాలయముతరఫున శ్రీయుత పి. నారాయణశాస్త్రిలవారి ఆధ్యక్షతక్రింద బాలభటపటాలముల నేర్పాటు చేసి మిక్కిలి జయప్రదముగా నిర్వహించిరి. దాసుగారు ప్రధానోపాధ్యాయులుగా నుండి - రాత్రిపాఠశాలలందు చదువుచు పగలంతయు కూలివల్ల జీవనము చేయు సామాన్యవిద్యార్థులకు బాలభటశిక్షణచక్కగా గఱపిరి. ఇవన్నియు చక్కగా జరుపబడుచున్న దినములలో ప్రభుత్వోద్యోగులలోకాని, ప్రజలలోకాని తప్పుచేసినవారు బాలభటులకు మిగుల భయపడుచుండిరి. బాలభటులు ఎక్కువగా చదువుకొన్నవారుగాకపోయినను తన అధికారి ఆజ్ఞలను చక్కగా నిర్వర్తించువారై యుండిరి.

మండలగ్రంథాలయసభ

ప్రథమ అనంతపురమండల గ్రంథాలయ సభను 1920 నందు ఆహ్వానించి మిక్కిలి జయప్రదముగ నిర్వహించిరి. శ్రీ రామమోహన గ్రంథాలయము యొక్కయు, బాలభట పటాలముయొక్కయు, వార్షికోత్సవములనుగూడ జరపిరి.

గ్రామస్థులందు జ్ఞానోదయము.

వీరిచే నిర్వహింపబడుచున్న వివిధ సంస్థలవలన ఉరవకొండ గ్రామమునందున్న అశేష జనమునందును జ్ఞానోదయము కలిగినదని చెప్పిన అతిశయోక్తి ఎంతమాత్రమునుగాదు. వీరు గ్రామస్థు లందరియందును తలలోని నాల్కవలె మెలంగుచు అందరియొక్క మన్ననను పొందుచుండిరి.

ఉద్యోగము పోయినను ధైర్యమును వీడలేదు.

ఇటుల పరోపకార పారీణులై పాటుబడుచున్న సమయమున గరల్ స్కూలు ఉపాధ్యాయ పదవినుండి తొలగింపబడిరి. అయినను ఎంతమాత్రము నధైర్యమును జెందక తాను స్వంతముగా మగ్గము పెట్టి నేత నేయుట మొదలిడి జీవనమును గడపసాగిరి. మరి రెండు మగ్గములుకూడ చేర్చి పనిని ఎక్కువగా సాగింప మొదలుపెట్టిరి.

ఇదంతయు నిటులుండ మహాత్ముని సత్యాగ్రహోద్యమము ప్రారంభమాయెను. కాంగ్రెసునందు శ్రీ దాసుగారుసహా సభ్యులుగాచేరి ప్రచారము మొదలుపెట్టిరి. వెంటనే గ్రంథాలయ యావదాసులను వురవకొండ కారనేషన్ రీడింగురూమున చేర్చబడెను. శ్రీ రామమోహన గ్రంథాలయము, కారనేషన్ రీడింగురూము అను పేరుతో నేర్పరుపబడెను. పిమ్మట కల్లు అంగళ్లయొద్ద పికెటింగు చేసి జెయిలునకుగూడ బోయిరి.

నేతగాండ్ర సంఘము.

జైలు అనుభవము ముగిసినతర్వాత కాంగ్రెసు ప్రచారమునందే చాలకాలము గడపిరి. సత్యాగ్రహము లేనికాలమున వురవకొండ గ్రామము నేతపరిశ్రమకు పేరుగాంచినది గనుక, బీదసాదలు బ్రతుకుటకు అనువగునటుల నొక నేతగాండ్ర సహకారసంఘము నెలకొల్పిరి. 13 వేల మొత్తము షేర్లమూలముగా జమచేయబడి 25 వేల రూప్యములవరకు బ్యాంకునుండి తెప్పించి ముడిసరుకులను కొని-యిచ్చట తయారైన చీరలను కొనుట వానిని అమ్మకముచేయుట ఏజంట్లను నియమించుట మొదలగు పనులు జరుపుచుండెను. ఒక వత్సరమున 1 లక్ష రూప్యములకు పైబడి బేరము జరుపబడెను. కాని యుత్పత్తిచేయు సరుకులు అమ్మకముఅగు మార్కెట్టులేకను, విదేశీ పోటీలవల్లను తయారైన జవళి ఖర్చుగాక నిలిచిపోయినందున స్వదేశీ రక్షణ కలుగువరకు నీ యుద్యమమును సక్రమముగా జరుపుట కష్టమని-వ్యాపారపద్ధతిమానుకొని, అప్పు లిచ్చు పద్ధతి మాత్ర మిప్పుడు ఉంచబడినది. దాసుగారీ యుద్యమమం దెక్కువగా కృషిసల్పిరి.

దుకాణము.

వీరు, జీవనోపాయమునకు వేరుతెరవు గానక ఒక దుకాణముపెట్టి జరుపుచుండిరి. ఇంతలో అనంతపురమండలమున ప్రభుత్వమువారివల్ల ఏర్పరుపబడిన మద్యపాననిషేధప్రచారమున చేరి ఒక సంవత్సరకాల మించుక పనిచేసిరి. వీరు పెన్నహోబిలమున రథోత్సవకాలమున అంగడివాండ్రు మొదలగువారికి సౌకర్యముగా స్థలములను విభజించుట మొదలగువాటియందు ధర్మకర్తల కెక్కువగా తోడ్పడిరి.

మృతి.

వీరు అకస్మాత్తుగా జ్వరబాధవల్ల ౧౯౩౨ సంవత్సరము మేనెల 9 వ తేదీన స్వర్గస్థులైరి.

వీరు చిన్ననాటినుండియు స్వదేశదీక్షయందే యుండువారు. బీదలయెడ చాలదయగలవారు. చాల ధైర్యవంతులు, పట్టుదలగలవారు, చిన్ననాటినుండి బీదతనమును ఆనందముతో అనుభవించినవారు. వీరు కడపటరకును పరోపకారమైన పనులు చేయుటయందే తన కాలమునంతను గడపినవారు.

తాను బ్రతికియుండగనే తన బిడ్డలకు వివాహములు జేసెను. వారు వారివారి భర్తల జేరుకొనిరి. దాసుగారికి 5 యేండ్ల బాలుడు, భార్యయు నిరాధారులై నిలిచినారు.

ఉరవకొండ,
అనంతపురంజిల్లా. } ఘట్టి వెంకటరమణప్ప.

సంపాదకీయములు.

గ్రంథాలయోద్యమ సేవకులు.

ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమమునకు పట్టుకొమ్మలై, ఈ యుద్యమ విజయమునకుగాను పాటుబడిన గ్రంథాలయోద్యమ సేవకుల జీవితచరిత్రలను ప్రకటించవలెనని సంకల్పించినాము.

అట్టి సేవకులలో నొకరగు అనంతపురంజిల్లా ఉర్వకొండ గ్రామ గ్రంథాలయ సేవకులగు శ్రీ బెళ్గాం రామదాసు నాయుడుగారి జీవితచరిత్రను ఈ సంచికయందు ప్రకటించినాము. వీరిపటమును ముందు సంచికయందు ప్రకటింపగలము.

సంచార గ్రంథాలయములు - కృష్ణాజిల్లాబోర్డు

కృష్ణాజిల్లాబోర్డు సభ్యులును, దక్షిణభారత గ్రంథాలయసంఘ ఉపాధ్యక్షులును, ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘ సహాయకార్యదర్శినియునగు శ్రీమతి తుర్లపాటి రాజరాజేశ్వరమ్మగారు జిల్లాబోర్డు సభయందు ఉపపాదించుటకై ఈక్రింది తీర్మానమును పంపిరి:—

"ఈజిల్లాలో రెండు కేంద్రస్థలములయందు మాదిరిగా పనిజేసి చూచుటకై సంచార గ్రంథాలయములను ప్రారంభించుటకు తగు ఏర్పాటులను చేయుటకుగాను రు 600 లను మంజూరుచేయుచు తీర్మానించడమైనది. అవి గుడివాడ తాలూకాలో అంగలూరునందున్నట్టియు, నందిగామతాలూకాలో కొణకంచియందున్నట్టియు గ్రంథాలయములతో సహకారముగ ఆతాలూకాలలో పనిజేయవలయును."

కృష్ణాజిల్లాబోర్డునకు అధ్యక్షులగు శ్రీరాజా యార్లగడ్డ శివరామప్రసాద బహద్దరుగారు-క్రిందటి సంవత్సరమున బెజవాడలో జరిగిన అఖిలభారత గ్రంథాలయ మహాసభకు ఆహ్వాన సంఘాధ్యక్షులును, ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమునకు ఉపాధ్యక్షులును అయియున్నారు. గ్రంథాలయోద్యమము యెడల గాఢమైన అభిమానము గలవారు. వీరి పరిపాలనయందు ఈతీర్మానము అమలులోనికి వచ్చుటయే గాక జిల్లాయందంతటను గ్రంథాలయోద్యమమునకు మంచి సహాయము లభింపగలదు.

విషయసూచిక

౧. సరస్వతీదేవిస్తుతి ... ౫౯

౨. ఆంధ్రదేశ గ్రంథాలయ మహాసభ ... ౬౦

ఆహ్వాన సంఘాధ్యక్షులు: దుగ్గిరాల వెంకట సూర్యప్రకాశరావుగారి ఉపన్యాసము ,,

శ్రీ ఇప్పగుంట సుబ్బకృష్ణయ్యగారి ప్రారంభోపన్యాసము ... ౬౭

యాతగిరి లక్ష్మీవెంకట రమణగారికి గౌరవము ... ౬౮

అధ్యక్షులు: శ్రీ వేమవరపు రామదాసుగారి ఉపన్యాసము ... ౬౯

తీర్మానములు ... ౭౩

అయ్యంకి వెంకట రమణయ్యగారికి "గ్రంథాలయోద్ధారక" బిరుద సమర్పణము ... ౭౪

3. ప్రథమాంధ్ర గ్రంథాలయ ప్రచారకుల సభ ... ౭౫

ఆహ్వానసంఘాధ్యక్షులు: నేత్రకంటి యోగానందరావుగారి ఉపన్యాసము ... ౭౬

ప్రారంభకులు: భూపతిరాజు తిరుపతిరాజుగారి ప్రారంభోపన్యాసము ... ౭౭

అధ్యక్షులు: బొడ్డపాటి సీతాబాయమ్మగారి యుపన్యాసము ...

ఇతర ఉపన్యాసములు—తీర్మానములు ... ౭౮

౪. నివేదికలు

1 తాడేపల్లిగూడెం తాలూకాబోర్డు గ్రంథాలయము ,,

2 తణుకు తాలూకాబోర్డు గ్రంథాలయము ,,

౫. ఆంధ్రదేశ గ్రంథాలయసంఘము - నూతన ఎన్నికలు ... ౭౯

౬. గ్రంథాలయముల ఆవశ్యకము ... ౮౧

౭. మద్రాసు గ్రంథాలయముల బిల్లు ... ౮౨

౮. భీమవరం తాలూకా గ్రంథాలయ సంఘాభివృద్ధి ... ౮౩

౯. భీమవరం తాలూకా గ్రంథాలయ మహాసభ ... ౮౫

౧౦. పిల్లల గ్రంథాలయము ... ౮౭

౧౧. గ్రామ గ్రంథాలయము ... ౮౮

౧౨. గ్రంథాలయ సేవక బెల్లాం రామదాసునాయుడుగారు ... ౮౯

౧౩. సంపాదకీయములు ... ౯౧

RSVM01 A147 40

Grandhalaya Sarvasvam - Registered No. M. 1714

ఆంధ్రభూమియందు ప్రథమమున స్థాపింపబడినది.

ఆంధ్ర ప్రావిడెంటు కంపెనీ,

లిమిటెడ్.

ప్రధానకార్యస్థానము : బెజవాడ

(స్థాపితము 1929)

మేనేజింగు డైరెక్టరు:

మహారాజశ్రీ దిట్టకవి వీరరాఘవయ్యాపంతులుగారు

స్వల్ప ప్రీమియములు !　　　　నవీన పద్ధతులు !

ప్రత్యేక సౌకర్యములు

1 స్త్రీ పురుషులకు సమానమైన ప్రీమియము రేట్లు

2 రు 100 లు మొదలు రు 500 వరకు పట్టాలు జారీచేయబడును

3 వైద్యపరీక్షలేని భీమాపద్ధతులు

4 క్లెయిములు గ్యారంటీ చేయబడినవి

5 పట్టాదారులకు ఋణము లియ్యబడును

6 జనసభీమాలో నెలకు రూ 1 లేక 2 రూపాయలు ప్రీమియం చెల్లించిన రు 500 లేక 1000 రూపాయలవరకు క్లెయిములు పొందవచ్చును. కవల పిల్లలు జనించిన రెండు క్లెయిము లొసగబడును

7 ఉత్తర ప్రత్యుత్తరములు తెలుగున జరుపవచ్చును

8 పట్టాదారులకు ఫలప్రదమును సహాయకరములగు సేవయే ఆదర్శము

ఏజంట్లకు

ధారాళమైన కమీషను యివ్వబడును

జనసభీమా శిశుపోషణకు గొప్ప సహాయకారి

పూర్తివివరములకు:— సూపరింటెండెంటు ఆఫ్ ఏజన్సీస్,
ఆంధ్ర ప్రావిడెంటు కంపెని, లిమిటెడ్,
గాంధినగర్, బెజవాడ.

ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు క. కోదండరామయ్యచే ముద్రింపబడి ప్రకటింపబడినది.

మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	RSVM01 A 147
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	7/6/24
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	43
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Sandhya
పేజీలు విడదీసినది	Sandhya
స్కాన్ చేసినది	Sandhya
పరీక్ష చేసినది	Pragathi
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	NO
పరిస్థితి	good